మార్చి '71 18

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

'....దేశమంతటా పోలీసు మంత్రులు విప్లవసాహిత్యాన్ని నిషేధించడానికి పథకాలువేస్తున్నారు. కాని విప్లవాన్ని నిషేధించబోవడం భేరీని జోకొట్టడంలాంటిదే. మిగిలిన దేశంమాట ఎలాగున్నా తెలుగు నాటికి సంబంధించినంతమట్టుకు యీ సరికే విప్లవ రచన విజయవంతమైందని నేను ఢంకా భజాయించి చెప్పగలను. వేలకొద్దీ గ్రంథాలను నిషేధించినా, వందలకొద్దీ రచయితలనోళ్లు నొక్కినా, యిదివరకే విజృంభించిన విప్లవ తరంగం యికమీద విశ్రమించదు...'

శ్రీ శ్రీ

నిర్వహణ: సాహితీ మిత్రులు

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

18

మార్చి 1971

నిర్వహణ:

'సాహితీ మిత్రులు'

84 పేజీలు

వెల: ఒక రూపాయి

కలాలకు సంకెళ్ళు

రచయిత, ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యపైన తన అభిప్రాయం చెప్పాలి. అది మనకు సంబంధించిందికాదు, మనకెందుకులే అనుకోవడం పిరికితనం. దేశం గడ్డుసమస్యల కత్తెర్లకు లోనైనపుడు రచయిత మౌనం గాని, ఉదాసీనతగాని ప్రజాద్రోహంకన్నా తక్కువేమీకాదు. కుటుంబ నియంత్రణం, పొదుపు, గాంధీ, సమైక్యాంధ్రప్రదేశ్‌పై రచయితలతో రాయించి, మేధావులతో ప్రచారం చేయిస్తున్న ప్రభుత్వం అలాంటి విషయాల పైనే దాని పాలసీలకు వ్యతిరేకంగా రాసినవారికి, చెప్పినవారికి రాజకీయ సంబంధాలు ఆరోపించి అనుమానిస్తున్నది. గట్టిగాచెప్తే హింసిస్తున్నది. గాంధీని పొగిడితే రాజకీయంకానిది గాంధీని సహేతుకంగా తిడితే రాజకీయం ఎట్లా అవుతుందో, గుత్త పెట్టుబడిదారులు సోషలిజం సాధిస్తారని రాసిన కవి మహాకవియై, శ్రామిక శ్రేయో ప్రజాస్వామ్యం ఏర్పడాలని రాసినకవి దేశద్రోహి ఎట్లా అవుతాడో అడిగినందుకు కలాలకు సంకెళ్ళువేసే దేశంలో స్వతంత్రానికి అర్థం ఏమిటి?

ఈ విధంగా కలాలమీద కత్తులునూరే అవమానకరమైన స్థితికి మన ప్రభుత్వం దిగజారింది. భావసాయుధుడైన ప్రతి రచయితా నిజంగా సాయుధుడన్నంతగా భయపడి కలాలుతప్ప ఆసరాలేని రచయితలను కటకటాల

వెనక్కుతోసి వెల్లువలావీళ్ళు ప్రజల్లో తెస్తున్న విప్లవచైతన్యాన్ని అరెస్టు చేయాలని చూస్తున్నది యీ ప్రభుత్వం. దీనికి నీతీ, నిజాయితీలేవు. నువు సత్యంచెప్పావు కనుక నీమీద నాకు పగ అనగల గుండెబలం దీనికిలేదు. అందుకే రచయితలకు ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధాలుకల్పించి, తప్పుడు కేసులుపెట్టి, నేరాలు ఆరోపించి, దొంగలవలె, ఖూనీకోర్లవలె చిత్రించి హింసిస్తున్నదే కాని శాస్త్రీయ దృక్పథమూ, భావావేశమూ, చిత్తశుద్ధీవున్న మేధావులవలె వారిని 'ట్రీట్' చేయడంలేదు.

హంసరాజ్ రహబర్, పి. కిషన్‌రావుగార్ల అరెస్టులు యీవిషయాన్నే రుజువుచేస్తున్నాయి. పి. కిషన్‌రావుగారిని అరెస్టుచేసి తప్పుడుకేసులు ఆరోపించి బెదిరించి హింసించడమేకాక ఆయన ప్రచురించిన 'మార్చ్'పుస్తకాన్ని కూడా యీ ప్రభుత్వం నిషేధించింది. అయితే సూటిగా నువ్వీపుస్తకం రాసావుకనుక నిన్ను అరెస్టుచేస్తున్నాం అని అనగల గుండెలు యీ పోలీసు యంత్రాంగానికి లేకపోయాయి. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను ఎంతో విలువైందిగా భావించే ప్రతి ప్రజాస్వామిక పౌరుడు తీవ్రంగా గర్హించవలసిన విషయం.

చేతులకు సంకెళ్ళువేస్తారు. చాలకపోతే కలాలకు సంకెళ్ళువేస్తారు. కుటుంబ నియంత్రణంపేరుతో మనిషిని పుట్టకుండాకూడా ఆపేస్తారు. కాని పుట్టినవాణ్ని ఆలోచించకుండా చేయడం సాధ్యమయే పనికాదు. బుద్ధీ, హృదయమూ వున్న మనుషులనోళ్ళు హృదయమైనాలేని జైళ్ళు మూయించలేవు.

—సంపాదకుడు

చావు

—కాళీపట్నం రామారావు.

ఆతతాయిలు సాగించే హింసలా, చలీ, గాలీ, నిరంతరాయంగా, నిరాక్షేపంగా తమ కత్తికోత సాగిస్తున్నాయి. కొయ్య దగ్గర పడివుండే బక్క పెద్దులా, ఊరు నీఃసంగా వుంది. జవసత్వాలుడిగిన ముసిలి రాజులా, సూర్యుడు వెలాతెలా పోతున్నాడు.

"అద్దద్దద్దో అల్లా మిడతాడ కొండ సూసినావా?" అంది సిమ్మాద్రి. ఆ పిల్లలు నిల్చున్న మాం చెర్వు గట్టు ఊరికి దక్షిణంగా వుంది. ఎదురెండ వాళ్ల మొహాల మీద ఏటవాలుగా పడుతోంది.

దాలి పిల్ల తన చీకి కళ్ళను మరీ చిన్నవి చేసుకుంది. ఎడం చేయి కళ్ళ కడ్డం పెట్టి, ఎండలోంచి చూసింది. కొత్తగా కోసిన పొలాల్లో వరి మొదళ్లు ఎండకి తళతళ మెరుస్తున్నాయి. ఆకాశం, భూమి కలిసే చోట మావురు కప్పిన మహా వృక్షాలు మరుగుజ్జు సైజులో వున్నాయి.

"నీకళ్ళు గుడ్డే....? అంత పెద్ద కొండ కనపడదా! నాన్నూపుతాను నాసేతి మీఁణ్ణించి సూడు."

చెల్లెలి మీదికి ఒరిగి చూపింది సిమ్మాద్రి.

ఆ పిల్ల చూపుడువేలు మీంచి చూస్తే ఆ చెట్లవెనక దూరాన ఎర్రగా నీలంగా నల్లగా జేగురుకొండ! భూమిలోంచి సగం లేచిన కొండ నదిలో సగం మునిగిన బండరాయిలా వుంది.

"ఆ కొండ కిటువంక సెట్లకి ఆత్తలకాదు ఇత్తలకాసి వూరుందా?— ఆ మర్రి సెట్టు కెనకాతల, కనపడదా, తెల్లగా సత్రం గోడ"....

చెయ్యి కదిపి ఒక్కొక్కటే చూపుతోంది సిమ్మాద్రి. బొమ్మరిళ్లలాగ చిన చిన్నగున్నాయి పెంకుటిళ్లు "ఆఁ"... కనపడిందన్నట్టు తలూపింది దాలి గుంట.

"నావిందాక సెప్పినానే తాటిపల్లి— అదిగో ఆ వూరు. ఆ వూరికెగవనుంది యెంకటాపురం. దానికీ దీనికీ మద్దిన బాలసెరువు. ఆ సెరువు కింద యెక్కడో వున్నారు మన్జుల్లు మరి నువ్వెల్లమంటె నానక్కడ కెల్లాల."

అప్ప కళ్ళల్లోకి ఒక్క క్షణం నిదానంగా చూసింది దాలిగుంట. మొహం మీద జుత్తులు రెండు చేతులా వెనక్కి తీసుకుంది. "వద్దునే" అంటూ వెనక్కి తిరిగేసింది.

ఊరంతా ఎండలోనూ ఊరి కింద పొడవుగా నీడలూ వున్నాయి. పేట తాలూకా నీడ చెరువు కొమ్ము మీంచి చెరువులోకి పాకుతోంది. చెరువు గట్టు మీద గత్తర్లు చూసుకుంటూ ముందు దాలీ ఆ వెనుక ఆమె అప్పా జాగ్రత్తగా నడుస్తున్నారు. మొలచుట్టు తప్పిన పుట్టగోచీ మాటిమాటికీ సర్దుకుంటూ విసవిసా నడుస్తోంది దాలి.

ఏడెనిమిదేళ్ల దాలి, దాని వయసుకి చాలా పొట్టిపిల్ల. పొట్టివాళ్లకి పుట్టెడు బుద్ధులుంటాయి. అందుకే తనకన్నా చిన్నదైనా దాని సలహా తీసుకుంది సిమ్మాద్రి. కొంత దూరం వెళ్ళాక ఆ పిల్లతో అంది—

"ఇయ్యేల కాదుగాని అల్లాయేల, ముసిల్దాన్ని కిందనొడేసినారు కాదా- అపొద్దూ ఇనాగే నానెత్తే. పెద్దప్ప నన్ను సాటుకు పిలిసి. సెప్పింది— పొద్దుటేల యేఁవేనైతే యెళ్ళి అల్తో సెపొచ్చట— మద్దేఁవైతే మాటాడ కొల్లకోమంది:"

దాలి ఏఁవని అడగలేదు. సిమ్మాద్రే కారణం చెప్పింది. సీటికిమాటికి పని మయాన్న పారొస్తె కూలి దండుక్కాదా! ఆళ్లకి కూలిస్తారా? ఇప్పటికిన మాటు పాటు పోనాది. ఒకల్దా యిద్దరివా ఐదుగురు పాటు.

ఓ పూట పాటు పోవడమంటే యేఁపిటో దాలి వయసు పిల్లలకుకూడా తెలుస్తుంది: విసవిసా ఆడుగులేసే దాలి "అటుసూడు" అంటూ ఆగిపోయింది.

ఎదురుగుండా పెంటిగాడు! ముసిలి దగ్గర కాపుండమంటే వచ్చేసి యిప్పుడు చెరువు కొమ్మున నించున్నాడు.

"ఏఁవిర పారొచ్చినా? మాఁవొచ్చిందాక నిన్నక్కడ వుండమన్లేదా?" అంటూ కీచు గొంతుకతో అరిచింది సిమ్మాద్రి.

పెంటిగాడు మట్లాడడు, నోట్లో వేళ్లు తియ్యడు. పెద్ద గుడ్లేసుకొని మిడుతూ మిడుతూ చూస్తాడు.

"ఆణ్ణి తీసుకురాయే" అంటూ దాలికి పురమాయించి గబాగబా యింటికేసి రెండడుగులేసింది.

దొరికిన అవకాశం దాలి విడిచిపెట్టలేదు. దగ్గరకొచ్చి నించుంది. ఎర్రగా వాడి వంక చూసింది. గట్టిగా చీవాట్లేసింది. 'విన్నిలాక్కాదు యింటికిరా' 'అటుకాసి కాదు- యిటు'- 'నా ముందలే నడు' అంటూ దూడను తోలినట్టు తోలుకొస్తోంది. పెంటిగాడు నల్లగా బూడిదలోంచి తీసిన బొగ్గులా వుంటాడు. సన్నగా గుండు. మొలకో నూలుపోగైనాలేదు. కాళ్లనిండా దుమ్ము. అయిష్టంగా దిక్కులు చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

కోతలు మొదలైన దగ్గరనుండీ మళ్లా పండుగెళ్లిందాకా పేట పేటంతా పగలల్లా తలుపులు మూసేసివుంటాయి ఆ చుట్టుపట్ల నదుల్లేవు. కాలవలు గురించి వాళ్లెరగరు. కురిస్తే వర్షం కురవాలి, చెరువులు నిండా నీరు చేరాలి, అదును పదునూ అన్నీ కుదరాల. అప్పుడైనా అదృష్టం బాగుంటే పంట కళ్లాలకొస్తుంది. ఏ గాలివానో ఏ ఒగాదో కార్తెకాని కార్తెలో ఏ పెద్ద ముసురో పెడితే ఏఁవీ లేదు. నిరుడు లేదు మూనిరుడు లేదు. యీ యేడు కాలం కలిసొచ్చిందట. ఆకలిగా వున్నారు జనం- ఆబగా వున్నారు జనం- సంతోషంగానే వున్నా దాన్ని లోలోపలే దాచుకొని వున్నారు.

వానకొక ముసిల్దీ యింటి కిద్దరు ముగ్గురు పసివాళ్లనూ కాపుపెట్టి బాలాది వాడ జనమంతా కోతలకు పోయేరు.

ఒక చోట కోతలు ఒక చోట ఓగులు ఒక చోట కుప్పలు- కళ్లాల్లో నూర్పులు ఊరి జనమంతా పొలాల్లో గింజల్ని యిమ్ము చేస్తున్నారు,

కలవారి లోగిట్లో పెళ్లయితే కసిన్ని మెతుకులైనా దొరుకుతాయి కదా. అంచేత కూలీలు కూడా వాళ్ల సంతోషాన్ని పంచుకుంటున్నారు. చెప్పిన పనల్లా చేస్తూ, చేసింది తొందరగా చేస్తూ ఆ వెంటనే చేసినట్టు చెపుతూ పేట జనమంతా పెద్దవారి కళ్లాల్లోనే వున్నారు,

మూసివున్న పాత తలుపుల వంకా మొలపాతలైనా లేని ఆటపిల్లల వంకా మేయడానికూడా ఓపికలేని బక్కగొడ్ల వంకా చూపులు తిప్పుతూ నడుస్తోంది దాలి, చెరువుగట్టున వెచ్చననిపించిన గాలి, వాడ మధ్య చివ్వున వెన్నులో పొడుస్తోంది. అతి యిరుగ్గా ముర్గ్గా వుండే ఆ వాడలో. ప్రతి మట్టిగోడలోనూ, చలిపేరుకొని ఉండాలి, సీతాకాలపు పగుళ్లను పెద్దవి చేసుకుంటూ చలిగాలి, చావుగాలిలా వాఁడంతటా కమ్ముతోంది.

దాలీ. వాళ్ల తమ్ముడూ కాగు చెట్టుకింది వొచ్చేసరికి —

"బానే ఓల్దాలమ్మా! బెత్తాటకొస్తావే?" అంది కోటమ్మ— "మావిద్దరఁవే వున్నాఁవు. పోనీ ఒక్క సిటం పంటలేసి ఎఁపో" అంది బతిమాలుతున్నట్టు.

దాలి తిరిగైనా చూడకుండా పోతూ ఆ పూట తనకు తీరదంది— పంట లెయ్యడానికీ కుదర్దు, వాళ్లు సూతకంలో వున్నారుట.

ఎవరు పోయేరని అడిగేక ఎప్పుడని అడిగింది కోటమ్మ.

"ఇప్పుడిప్పుడే యింకా ఓ సిటంవో రెండు సిటాలో అవుతాది. అది అనాగ పోనాది— మాం వినాగ యిటొచ్చినాం— యింటికాడెవ్వర్నేరు...." సంగతి చెపుతూనే దాలి దూరం అవుతోంది.

అలాటి భోగట్టా విన్నాక కోటకూ ఆమె తోటి పిల్లకూ ఆట మీద మనసు పోలేదు. పరిస్పరం కూడబలుక్కుని దాలి వెంట పరిగెత్తేరు.

దిబ్బసూరి జంతి దాటి ఎరకయ్యగారి గోలిలోంచి వాళ్ల వాకిట్లోకెళ్లేసరికి సిమ్మాద్రి ముంజూరు దగ్గర నించుంది.

జానడు వెడల్పు పుట్టగోచీ దోపి దాన్నే ముందుకు లాగి పయ్యాటలా వేసుకుంది. ఆమె చేతిలో పొడుగాటి వెదురుబద్దుంది.

"నానింకొక్క సిటం రాపోప్పతె యేమైపోనో ఎరికా?" అంది సిమ్మాద్రి- "నారయ్యగారి కర్రి బేపినేదా— అది నాయినమ్మను పీక్కు తినీసుమ- ఉండమంటె పారొచ్చినాడు గుంటడు" అంటూ దిగాలు పడి చూసే పెంటిగాడివి మొట్టబోయింది.

కోటా, దాంతో వచ్చిన పిల్లా ఆ ముగ్గురు పిల్లల్నీ అబ్బురంగా చూస్తున్నారు. వాళ్లిద్దరూకూడా సిమ్మాద్రి యీడువాళ్లే: ఒకత్తె ఓ పాత గావంచా వల్లెవాటేసుకుంది, రెండోది చిరుగుల కబ్బా తొడుక్కుంది.

కొంచెంసేపు పోయేక "మాం వోపాలి ముసిల్దాయివి సూదొచ్చే" అంది కోటమ్మ. సిమ్మాద్రి రండి అంటూ వాళ్లను పంచలోకి తీసికెళ్లింది.

బాగా కిందికుండే చూర్లో ఎత్తుగా యిరుగ్గావుండే అరుగు, అరుగునీ చూర్నీ కలుపుతూ గోనె ముక్కలూ చింకి చాపలూ మాసికలేసి దడి కట్టేరు దక్షిణపు ఎండ దడి మీదపడి పచ్చగా పల్చని వెలుగు లోపలి చీకట్లను తరుముతోంది. —

ఆ వెలుగు చీకట్లలో ఓ పాత కుక్కిమంచం. కొన్ని గోనెలూ చింకి గుడ్డలూ తప్ప వాళ్లకేమీ కనిపించలేదు. ఎక్కణ్ణుంచొస్తోందో ఘాటైన దుర్వాసన. అటు వేపేచూస్తే మంచం మధ్య ఓ ఆకారం.

తెల్లగా పచ్చగా వుండే వెలుగులో మంచానికి రెండో చివర కృశించి కృంగిపోయిన ఓ ముసలి తల. వడిలి పోయి ఉబ్బిపోయిన మొహం ఎండిపోయి పండి

పోయిన జుత్తు, మూతలు పడని గాజువారిన కళ్లు, తెరుచుకున్న దంతాలూడిన నోరు–చలనం ఏ మాత్రంకూడా లేదు.

వాసన భరించలేకో, భయం కలిగించే ఆ ఆకారాన్ని చూడలేకో కోటతో వచ్చిన పిల్ల "ఇంక పోదుఁవా" అంది.

అందరూ వాకిట్లోకొచ్చేరు. "మీ యమ్మా నాయనకీ కబురెట్టవా ?" అంది కోటమ్మ.

"ఎవురెల్తారు? ఎవురెల్లినానికేనా యిక్కన్నుంచి నాలుగాఁవళ్లాల – అక్కడికెల్లీ సరికే పొద్ది. సీకటొడితే ఆల్దోదారీ మన్దోదారీ. దారిలో ఎదురైనా దండుగే.... అందుకే మా దాలి ఎల్లొద్దంది."

"నిజవే" అఁది కోటమ్మ.

"పోనీ యిక్కడోటోళ్ల ఎవురికైనా సెప్తేనో?" అంది కోటతోవచ్చిన పిల్ల.

"ఎవురితో సెపతాం– ఎగవీదిని మాయమ్మకో పెద్దమ్మఁది. ఐతే.... దానిక్కళ్లేనేవు, అది గుడ్డిది. దిగవీదిని లండాన లచ్చువఁమ్మ కోడలుంది. అది మసిల్దానికేటో అవుద్దట. కాని మొన్న రాత్తిరే పురుడయ్యింది. ఎఁతైన పచ్చి బాలింత యీ సల్లో శవం కాడికొస్తదా ?" అంది సిమ్మాద్రి.

అయినా చెప్పపోతే 'మాటా రావొచ్చు' అంది కోటమ్మ. ఆమెతోవచ్చిన పిల్లకూడా చెప్పడఁవే మంచిదంది. – నువ్వా- నేనా– కొంచెం సేపు వంతులాడేక దాలిని వెంటపెట్టుకొని ఆ పిల్లే బయల్దేరింది.

పొద్దు వాటారిన కొద్దీ చలిగాలి యెక్కువౌతోంది. కిందట వాకిట్లో చిఁకి చాపంత ఎండ వుండేది. ఇప్పుడది చింతమ్మగారి చొప్ప కుప్పెక్కి దాని మీంచీ పక్కనున్న యింటి మీదికి పాకుతోంది. ఎండ పట్టు ఎక్కడుంటే రోజల్లా అక్కడ కూర్చుంటాడు పెంటిగాడు. వాడిప్పుడు ఎండకేసి వెర్రిమొహం వేసుకుచూస్తున్నాడు.

"ఔనా్రి ఓరి గుంటడ! నీదుప్పటి గుడ్డేది?" అంది సిమ్మాదిర్రి చేతులు రెండూ పక్కలకు గట్టిగా అదుఁవుకునిగూడ కొంగలా గొంతికిలా కూర్చున్నాడు పెంటిగాడు. అప్ప మాటలకి వాడు తలైనా తిప్పలేదు. ఎండ పోయినా ఆ పట్టు వెచ్చగా ఉన్నట్టుంది. కదిల్తే చలేస్తోంది.

వాడి దుప్పటి గుడ్డ వెతకడానికి సిమ్మాద్రి యింట్లో కెళ్ళింది. తలుపుతీస్తే అంతా చీకటి. పచ్చగా మెరిసే యిత్తడి బిందిలాంటిదైనా లేదు. ఉట్టెలు చట్టెలు కుండలు మండలు చివరకు గుడ్డముక్కలు సహితంగా నల్లగా ఆ చీకట్లో కలిసిపోయేయి.

తడుములాడుతూ వెతికి తమ్ముడికోసం మళ్లా కేకేసింది సిమ్మాద్రి. గుంటడు మొద్దునాపలకడు. కోపంగా యివతలికొచ్చి చూస్తే పెంటిగాడు నాయనమ్మ మంచాని కెదురుగా నించున్నాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది సిమ్మాద్రికి. చస్తూ చస్తూ ముసిల్ది చలి సంకటంతో సచ్చింది.

ఏవయ్యిందంటే—

... అంబళ్ల వేళకి పిల్లలిద్దరికీ కసింత కసింత ఒడ్డించి తనూ కొంచెం పెట్టుకు తింది. కాచి అట్టి పెట్టిన నూకజ్జావ తీసుకుని ముసిల్దానికి పట్టడాని కెళ్ళింది. ఒంటి మీద ఒక్క గుడ్డ ముక్కైనా లేదు. ముసిల్ది యీ లోకంలో లేదు. ఎముకలూ చర్మం, వజ వజ గడ గడ చెడిపోయిన మోటారింజనులా కొట్టు కుంటోంది. తల నుండి పాదాల్దాకా కింద పక్కగుడ్డలు తియ్యబోతే నీరుడుతోనూ, చెరువుల్తోనూ తడిసున్నాయి. ఇంట్లో కనపడ్డ గుడ్డ ముక్కల్లా కప్పింది. తడి గుడ్డలు కూడా కప్పింది. దాలీ పెంటిగాడూ పరుచుకునే పాతగోనెలు చింకి బొంతలూ మీద పడేసి గట్టిగా పట్టుకున్నారు. ఎంత చేసినా ముసిల్దాని చలి ఆగలేదు.

పళ్లు గట్టిగా కరిచిపెట్టి, పిడికిళ్లు రెండూ బిగించేసి, ఊం.... వజ వజ వణికి పోతోంది. మెత్తగా తోలుతిత్తిలా వుండే ముసిల్ది ఎలా అయిపోయిందో, గట్టిగా యినప్పొయ్యిపోయింది. పావుగంట నానా హైరానా పెట్టి టపీమని పట్టొదిలేసింది. తరువాత మూడు చెక్కలు చెక్కడానికి తెరిచిన కళ్లూ నోరూ అలాగే వుండిపోయేయి.

"కోటమ్మా! శవంకాడ గుడ్డ అంటుకోవచ్చే?" అంది సిమ్మాద్రి.

కోట జవాబివ్వ లేదు. సిమ్మాద్రికి గుండె గతుక్కు మంది. రాత్రి తొంగుందికి ఒక్క గోనెగుడ్డైనా లేదు. అన్నీ శవం మీదేఉండి పోయేయి, ఇంట్లో యేవంటారో. "శవాన్నింకా దించనేదుకదా! ముడితె తప్పా?" అంది వాకిట్లోకొచ్చి.

'నాకు తెల్దు. పెద్దోళ్ళొస్తే తెలియాల' అంది కోట.

సిమ్మాద్రికో చిన్న ఆలోచనొచ్చింది.

'ఎప్పుడనగ ఎల్లినారు, యింకా రారు పిల్లలు!' అంది బెంగపెట్టుకున్నట్టు.

'నానెల్లి పిలుసుకొద్దునా?' అన్లేదు కోట. 'మీయమ్మా బాబు వొచ్చిందాక మీరిలాగుండ గల్దురా?' అంది కోట.

'ఉండకేటి సేస్తాం! ఎందల పడి పోతాఁవేటి?' అంది సిమ్మాద్రి.

అన్నప్పటి పేడి తగ్గగానే అనుమానఁవేసింది. తను ధైర్యంగానే వుండొచ్చు. పిల్లలు భయపడొచ్చు. మన నాయినమ్మేనరాత్రి అని వాళ్ళకు ధైర్యం చెప్పాలి.

ఆపైన ఆలోచించడానికి మనసు ముందు కెళ్ళలేదు.

పొద్దు బాగా వాటారింది. నీరెండ నేలవిడిచి చెట్లమీద అల్లల్లాడుతోంది. చెట్లమీద పొంచున్న చీకట్లు క్షణంలో దాన్ని ఫలహారం చేసేయి.

గోర్జలో దుమ్ము రేపుకుంటూ అడవికెళ్ళిన ఆలమందలు ఇళ్ళకొస్తున్నాయి.

'పశివిలొచ్చేసినాయ్. మా యప్ప పేడకెల్లింది, నానింటి కాడ నేపొ్తే తిటంటాడో' అంది కోటమ్మ.

ఎంత సేపై అలాటి మాటకోసఁవే ఎదురు చూస్తోంది.

'ఐతే ఎల్లిరా' అంది సిమ్మాద్రి—

ఆ పిల్ల గోలి మలుపు తిరగ్గానే దొంగలా చూరులోకి దూరింది, లోపలంతా చీకటి. శవం మీద గుడ్డలు ముట్టబోయేసరికి వెన్నులోంచి దడొచ్చింది.

మీద మీదవి కొన్ని నొల్లుకొని రెండడుగుల్లో బైటికివచ్చేసింది. వెలుతుర్లో ఒకొక్క గుడ్డా చూసి మడతలు పెడుతోంది.

దాదాపు అన్ని గుడ్డలూ తడితడిగా పొడిపొడిగా వున్నాయి. గొంగళి పురుగులో రోకలి బండలో పట్టిన గుడ్డల్లా చూసి చూసి దులిపి దులిపి మడతలు పెడుతోంది.

....పెంటిగాడి దుప్పటిముక్క అంచుదగ్గర అంగుళంమేర బాగా మైలయ్యింది ఎవళ్ళో అడుక్కొని మొన్ననే తెచ్చేడు నాయిన, బాగా గట్టిగుంది పోతాదేఁవో?— ఆమేరకి చీరి పారేసి మడతలు పెడుతోంది.

చూర్లోంచి పెంటిగాడు ఎప్పుడొచ్చేడో కళ్ళు పెద్దవి చేసుకుని ఎదురుగా నించున్నాడు.

'నోట్లో ఆయేళ్లు తియ్యరా— నిన్ను గుమ్మట్లో కూకోమన్లేదా?' తనకే భయమేసేటంత గట్టిగా అరిచింది సిమ్మాద్రి.

పెంటిగాడు తలవంచుకొని దడదడ గుమ్మంలోకెళ్ళిపోయేడు. ఒంజి పెట్టిన గుడ్డలూ, గోనెలూ తీసుకొని సిమ్మాద్రికూడా వాడి వెనకనే వెళ్ళింది. తమ్ముడు ఎప్పుడూ కూచునే స్థలంలోనే ఉండచుట్టుకూర్చున్నాడు.

తను తెచ్చిన గుడ్డల్లోంచి ఒకటి తీసి తమ్ముడికి కప్పబోయింది. ఎందుచేతో మనసొప్పలేదు. లోపల కావిడిపెట్టి అడుగున తల్లి యింకొకందుకు దాచిన చింకి కోక తీసుకొచ్చింది. సగం పరచి వాణ్ణి పడుకోమంది. మిగిలిన సగం వాడిమీద కప్పింది.

చలిగాలి రివ్వున వీస్తోంది. తను కూడా కప్పుకోవాలి, ఆ గుడ్డలు తప్ప యింకేమీలేవు. ఆలోచిస్తుంటే దాలి పరిగెత్తుకొచ్చింది.

"అమ్మా నాయినికి కబురెల్లిందే అప్పా— దిబ్బమీద కిల్లీ బడ్డీ నేదా. అక్కడోటు ఓ నాయుడున్నాడు. ఆయన్తో కబురు తోల్నాను."

"ఉహూ హూ" అంటూ అక్కడున్న గుడ్డతీసి ఒళ్ళల్లా దగ్గిరిగా కప్పుకుంది దాలి. ఎందుకు కోపమొచ్చిందో సిమ్మాద్రికి కోపం వొచ్చింది.

"సూసిరమ్మంటే కాల్చొస్తాది పిల్ల. నానెక్కడికెల్లమన్నాను— నువ్వెక్కడ కెల్లినావు. లచ్చువమ్మ కోకలకి సెప్పనేదా?" అంది దీర్ఘాలు తీస్తూ.

"సెప్పినాను. ఏటి సేస్తాం, ఒల్లకోండంది.— అప్పుడా దగ్గులోడునేడా— ఆడే సెప్పినాడు— టీకొట్టుకాడ ఎంకటాపురం మనిసున్నాడు బేగెల్లమని....

ఆ తరవాత ఆ మనిషికోసం వాళ్ళెక్కడెక్కడ తిరిగేరో, చివరికాయన ఎలా దొరికాడో— అదంతా దాలితో వెళ్ళినపిల్ల, పదిలంగా వివరంగా చెప్పుకొచ్చింది.

అంతా అయ్యేక "యింక నా పెల్లునా?" అంది చేతులు రెండూ గుండెలకాన్చుకొని చలిని సూచిస్తూ.

"నీ యిష్టం వే. నీకు పనుంటె యెల్లు. నేవొప్పితె తోడుండు." అంది సిమ్మాద్రి స్నేహంగా.

దాలి మాత్రం "ఉండవా? ఉండవా?" అంది—

నీలమ్మ సంతోషంగా ఉండిపోయింది.

* * *

దొంగరేయి దాకా ఆకబురూ యీకబురూ చెప్పుకుంటూ అలా అముగ్గురూ ఆ గుమ్మంవార గోడకు ఆంటి పెట్టుకూర్చున్నారు.

నడి వాకిట తెల్లగా వెన్నెల. నట్టింట్లో నల్లగా చీకటి. చూరు పంచలో ముసిల్దాయి శవం. బయట ఊరూ దేశం చెట్లూ చేమలూ దొంకలూ దొరువులూ సన్నని మంచు వానలో సందడి లేకుండా తడుస్తున్నాయి.

* * *

పొద్దల్లా ఒంచిన్నడుం ఎత్తకుండా పన్చేసి పొద్దు పోయాకూడా కొంత సేపు పన్చేసేరు. సందవేళ పని ఆగింది. నడవ్వలసేది నాలుగాంవళ్ళు. చలిలో వెన్నెట్లో కూలీలు చకచకా అడుగేస్తున్నారు.

పాతికదాకా ఆడాళ్ళు, పదీ పదిహేనుమంది మగాళ్ళు, భుజాలమీద కొడవళ్ళు, చేతుల్లో చద్ది ఉట్టెలు, గిలుకూ గిలుకూ చప్పుళ్ళతో పనిమీద కదిలే చీమల బారులా పరుగువెనకే నడకా నడకలందక పరిగెడుతున్నారు.

"ఓరెవర్రోయి కూలీలు! అక్కివరం కూళ్ళదేనా?"– అన్నాడో దుప్పటి మనిషి.

ఎంకటాపురం నాయుడు గొంతు: 'అవును బాబ'న్నాడు మేస్త్రీ.

"ఎరకయ్యట ఎవుడ్రా. ఇందలున్నాడు?" అన్నాడు నాయుడు.

"బాబ్బాబున్నాను." ఎరకయ్య జట్టులోంచి ఒసల బోయేడు:

వెనకనేవున్న సాంవాలు ఆపింది "ఏంవిగదా" అంది నాయుడికెదురై. ముందు వాళ్లు ముందు, వెనుక వాళ్లు వెనకా. ఎక్కడివాళ్ళక్కడే ఆగిపోయేరు.

"ఇంటికాడ– మీయత్తో– అమ్మో– ఒక ముసిల్దాయి ఉండేదే!" అన్నాడు నాయుడు.

"ఆఁ ఆఁ.... వుంది బాబు మాయమ్మే" అన్నాడు ఎరకయ్య.

'ఉస్–ఉండు' అన్న సాంవాలు మాటలు అతడు వినిపించుకోలేదు.

"బేగెల్లండి. ముసిల్దానికి సుకం లేదు. బేగెల్లండి" అన్నాడు నాయుడు.

"ఏటి– పోనాదా?" అంది సాంవాలు. నాయుడు కోపం తెచ్చుకున్నాడు.

"పోపోవ్వతే యెల్లపేటే? కాదు పోపోవ్వతె యెల్లవా?... నత్తా నాంవా పిల్లలమీద సావనున్న ముసిల్దాన్నొగ్గేసి తల్లి నలుగురూ తగలడాలా? కాదు– ఏడుపు ఇక్క ఎల్లినారు– ఏం ఒకళ్లు ముందొస్తె తప్పా!"

నాయుడు మందలింపు సాగుతూనేఉంది. సాఁవాలు కంతా అర్థమైపోయింది. నెత్తిమీదున్న వడ్ల మూట తీసింది. పక్కనే వున్న పెద్దకూతురు కెత్తింది. దాని చేతిలో వుండే చద్ది మూట అడిగితే అది పరవాలేదు ఉండనిమ్మంది.

"ఏఁవింక కదలవూ.... మత్తొదల్నేదా?" అంటూ యింకా విలబడే వున్న మొగిణ్ణి గదిమింది.

పని ఆపీ ఆపకముందే ఇదిగిప్పుడొస్తాఁవంటూ ఊళ్లోకెళ్ళిన మొగాళ్లు కల్లు పాకలో దూరేరు. తాగినందుకే కాదు. ఎందునా పొందని జాలం! ఆడవాళ్ళంతా అగ్గి మీద గుగ్గిలాల్లా వున్నారు. అది గ్రహించి—

"పదపదొస్ పదండ్రా" అంటూ ఎరకయ్యని తోలుకొని ఆ జట్టు కొందరు బయల్దేరేరు. సాఁవాలు కూడా వాళ్ళతో పరుగందుకుంది. రెండడుగులేసి కొడుకేడంది. ఆ కొడుకు అందరికన్నా ముందరే ఉన్నాడు.

"నాను కూడా వొద్దునేఁటే?" అంది చిన్న కూతురు నారెమ్మ. జవాబు రాప్పోయేసరికి "అయితెల్లే" అంటూ జట్టుతోనే వుండిపోయింది.

అక్కడికి అక్కివలస యెంతో దూరంలేదు. గోర్జ కొసంటు కొచ్చేసరికి వెనకనుండొచ్చింది అంకాలు.

"అవునె పోలమ్మా ముసిల్ది పోనాదన్నాడా? జబ్బు మోపు గుందన్నాడే?" అంది అంకాలు.

"ఏ కబురూ సెప్పనేదు- ఏ మాత్రం పోయే వుంటాది, నాయుళ్ళు సావు కబురు సెపతారా?" అంది పోలమ్మ.

"నానెప్పుడో సెప్పినానే— అటు కోత లిటు పండుగు— అన్నీ కుదిరిన్నాడే ముసిల్దాయి కదుల్తాది. అందాక యిది కదల్దన్నాను, నానన్నట్టె అయ్యింది."— అంది నారెమ్మ.

మధ్యలో "నోరుముయ్యే" అన్న పోలమ్మ మందలింపు ఆ పిల్ల చెవికెక్కలేదు. టిక్క చెరువు గట్టెక్కేసరికి ఊరెదురుగా కనిపిస్తోంది.

"ఎంత రేత్తిరెంత రేత్తిరయ్యింది. ఈదిల శవాన్నెట్టుకుని యింటికాడ పిల్లలేం బెగిలిపోతన్నారో"— ఆ శవాన్ని తియ్యడఁ పెప్పుడు, ఆ తరవాత అగ్గులెయ్యడఁ పెప్పుడు! మళ్ళా సీకట్నె నెగాల!" అంది ముందు నడుస్తున్న ఆడ మనిషి.

"తాగుమోతు సంత- దీంతో బయలెల్తె రాత్తిరి కాదా"- అంది ఆమెకన్నా ముందున్న పిల్లతల్లి.

"ఏటి సెయ్య మన్నారర్రా, సలీ" అంటూ సర్దుకు రాబోయేడు మేస్త్రీ.

గుగ్గిలాలన్నీ ఒక్కసారి భగ్గుమన్నాయి.

"సలి మీ మొగాళ్ళకే గాని మాకుండదేట్రా మాఁవా"— మీరే మడుసులు గాని మాం కాదేట్రా ?

"కాదు ఇంటికాడ ఎలాగా తప్పదు. దార్లో కూడ తాగాలేట్రా ?"—

కదిపితే కందిరీగల పుట్ట. మయ్యాలేదు – తోలాలేదు. నోరు మూసుకు ఊరుకున్నాడు మేస్త్రీ. ఊరంచు కొచ్చేక నారెమ్మ అడిగింది—

"బొనతే ముదరదానా ! మనిసి సచ్చిపోతే ఏఁవేటి సేస్తారే ?" అంది వెనక వస్తున్న మనిషితో.

"ఏటి సేస్తారు. సచ్చిన్నాడు కాలుస్తారు దినవారాల్నాడు తిళ్ళెడతారు."

"సరీగ సెప్పే. ఏఁవేటి కరుసులౌతాయి ?" అంది నారెమ్మ.

"ఎట్టినోళ్ళ కెన్నేనే అవుతాయి. ఇప్పుడు నాలాటి దాయి సచ్చిందంటే నలుగురూ పూసై, నాల్దబ్బులెత్తి శవాన్ని అనిపీడంతోసరి కనుక్కున్న బిడ్డ పాపలో, కట్టుకున్న మొగుడో, తోడబుట్టిన అన్నదమ్ములో. వుంటె దానికి పదో పాతికో ఆళ్ళ కలిఁవిని బట్టి దినవారాల్నాడు తిళ్ళకనీ— తాగుడకనీ అవుతాది.—"

అందాకా అందిన భోగట్టా చాలు—

"గోయిందా— నా సీఁవెండి కడియాలు గోయిందా !"— అంది నారెమ్మ.

"సీఁవెండి కడియాలేఁవే ?"— ఎవరో అడిగారు.

"తిన్నగుంటావ తన్నమన్నావా ?" అంది పోలమ్మ.

* * *

దండప్పిగాడు, పేట నాలుగు వీదులూ తిరిగి పదిమందినీ పిలుచు కొచ్చేసరికి జాఁవున్నర రాత్రయ్యింది— పొగ మంచు యింకా కురుస్తోంది, పేట మధ్య వేపచెట్టు మీంచీ మసక చంద్రుడు బారెడు పైకి లేచేడు.

"మరేట్రె ఎరకయ్యా— యింక సూసీ వోళూ— సేసీ వోళూ ఎవరు నేరు కొబట్టు ఏదో ఓ యేళకి యీ రాత్రికే అనిపీస్తె కాదా, అంటారు మనోళ్ళు. నలుగు

రన్నారనే కాదు— నా బుద్ధికీ అదే మేలుగుంది. పేనఁవా ఎప్పుడో రెండు జాఁవులకి పోనాది. ఇప్పటికే అంటుకు రావాల, రేపొద్దున్నదాకుంటె ఏటగునో?''— అన్నాడు సూరయ్య.

కులపెద్దలు నలుగురూ నాలుగు చొప్పకర్రలు పడేసుకుని వాకిట్లోనే కూచున్నారు. తక్కిన వాళ్ళ దగ్గిరా దాపలా చూరు పంచల్లోనూ సర్దుకున్నారు, ముంజూరికి కొంచెం ఎడంగా శవాన్ని పెట్టుకొని— ఎరకయ్యా అతడి భార్య సాఁవాలూ కూర్చున్నారు.

''శీతగాలి కాబట్టి ఆపాటేన కాసింది.'' అన్నాడు బారికి కన్నయ్య. నేపోృతె ముక్కూ నోట బొక్కలన్నీ నీళ్ళు కారేసి, ఇనాగ— ముట్టుకుంటె పొట్లపండు నాగ— ఇచ్చిపోతాది శవం.

''జీవుడు పోనాక కాల్పనానికి నాలుగైదు జాఁవులు దాటకూటదు— దాటితే కట్టె నిలవదు.''

కన్నయ్య చెప్పేదంతా నిజంకాక పోవచ్చు కాని కొంత వుంది. కొడుకూ కోడలూ వచ్చేసరికే శవం కొంత పాడయ్యింది.

అదరా బాదరా పరుగెత్తుకొచ్చిన జనానికి యిల్లిల్లా చీకటి యింటి గుమ్మంలో బెగిలి కూర్చున్న పిల్లలూ కనిపించేరు. తలుపులేసి గబగబ బుడ్డి దీపం వెలిగించి యివతలకి తెచ్చేరు. చూస్తే ముక్కు రంధ్రాల్లోంచి నోటంబడి చీఁవలూ, నీళ్ళూ. ఎక్కణ్ణుండి వచ్చేయో పుట్టలకి పుట్టలు— చీఁవలు పట్టేసేయి, గబబబా వాటినన్నిట్నీ దులిపేసేరు. వాకిట్లో చూరుమీంచి గోనె గుడ్డల దేరా కట్టేరు, కింద గడ్డి పరిచి అందు మీద శవాన్ని పడుకో బెట్టేరు.

ఆ నీళ్ళ కారడం ఆ దుర్వాసనా అన్నిటితో అలాగే తలదగ్గర కొడుకూ కాళ్ళ దగ్గర కోడలూ కూర్చున్నారు.

''సరే. యిక కాస్తాదో కాయిదో ఆ సంగతంతా అలాగుంచు.'' అన్నాడు రాజియ్య ''సచ్చిన ముసిల్దానితో ఉన్నోళ్ళం సావనేం కదా? లండానోళ్ళ జట్టు పొద్దు దూరీ సరికి బయలెల్లాల. మాఁవూ సిటం యిటో అటో అయేలకే బయల్దేరితేగాని మామ్మోలు ఏలకి తాటి పిల్లి సెర్నేం. ఆ పూర్నాయుడూ అసలే మూకానోడు. పని పూర్తైతే గాని యియ్యాల్నాగే కూల్లియ్యడు. ఇంక మూరా బారా పని మిగిలి పోయిందంటె, ఎల్లుండి బొద్దాం కాపులికి ఒస్తాఁవన్నావు— ఆ మాట పోద్ది.''

రాజయ్య మాత ముప్పిడి లేకండా యదార్థం తిన్నగా చెప్పేడు —

నిజఁవే, ఎరకయ్య సదుపాయంకోసం చూస్తే పేటపేటందఁకీ ఓ పూట పని పోతుంది. మాకారం– గంగినేనిపల్లి కూలీలున్నారు. పీళ్ళోరోజు అన్యం చేస్తే వాళ్ల తన్నుకు పోతారు, ఎవరెంత నొల్లుకున్నా యింకో వారం పది రోజులే.

"మీరందర నాగాగంటె మాం మాత్రం కాదంటావా? అనాగే అసిపీదుఁవు. ఎక్కడేనా నాలుగు సందిళ్ల కర్రలు సూడండి," అంది సావాఁలు– శవం మాకన్నా వోరూ తుడవాడానికి ఆమె మధ్యమధ్య లేస్తూనే వుంది

ఆ మాట అనీసరికి మరెవ్వరూ మాటాడ లేపోయేరు. కొంత సేపు పోయేక సాఁవాలే అంది.

"కావిడి కర్రలు– సాలవంటె రెండు కావుళ్ల– పోసుత్తిగ్గాదు కరీదుకు దొరికినా మాబాగే– ముసిల్దానికెంత కావాల–. దుమ్ములూ శరమం తప్ప యింకేటి మిగల్నేదుకాదా." అంది సాఁవాలు,

కర్రలకోసం సాఁవాలు అంత పట్టుపట్టడం కొందరికి బాగులేదనిపించింది. అందులో, ఆడవాళ్ళకి:

"ఎం, కర్రలు రాపోతె శవాన్ని కదపవేటి?" అంది లచ్చువఁమ్మ.

"ఎలా కదుపుతావూ?"

"ఏం కిరియా సేసేస్తె కాదా?"

సాఁవాలు మాటాడలేదు.

"—కాదు నీకెప్పుడో కర్రల్దొరికిందాక శవాన్ని తియ్యనంటె– యీ రేత్తిరి– సిన్నాపెద్దా– అంతా పస్తేకదా– రేపు రెండు జాఁవుల్దాక పొద్దల్ల తిండీలేని జనం– సిన్నపిల్లలు, పురటాళ్లు ముసిలీ ముడగా ఈళ్ళంత అలాగ పల్లగం గడుసుకొని ఉండగల్తురా?"— అంది లచ్చువఁమ్మ.

లచ్చువఁమ్మ నోరు మంచిదికాదు, దానికి తోడు ఆమె వాదానికిప్పుడు బలముంది. ఎండాకాలం నాలుగు నెలలూ యే మూలకెళ్ళినా కర్రా కంపా ఆకూ అలం ఎంతో కొంత ఎవరికైనా దొరుకుతుంది అలాటి రోజుల్లో యిలాటి ఆపదొస్తే నలుగురిళ్ళల్లోనూ నొల్లితే నాలుగు సందిళ్ళ కర్రలు సుళువుగా పోగు చెయ్యొచ్చు పొయ్యి మీదకి దొరికే యీ రోజుల్లో పొయ్యి కిందికి దొరకటం పెద్ద గగనం! యిప్పుడల్లా వేరుశనగ రొడ్డా గంటీ కర్రలూ కంది కంపా యిపే పొయ్యిలోకి

అలాటప్పుడు మనిషిని కాల్చడానికి సరిపడ కర్రలెక్కడ దొరుకుతాయి.

"మరి మాం మాత్రం ఎండల పడిపోతాంవప్పా. కాల్సనానికి కర్రల్లేవని కిరియా కొప్పేసుకుంటే మాయాడ బొడుసు లూరుకుంటారా? రేప్పొద్దున్ననీ కోడలే అంటాది— అత్తముండని కాల్సనానికి దీవి మొకానికి అగ్గేనా పుట్టింది కాదు. గొయ్యి తీసి కప్పెట్టేసింది.— పొద్దుటి దాక ఆగితె కాదా— అంటాది. ఎటెల్లినా నాలాటోళ్ళకి కొయ్యే కదా." అంది సాంవాలు.

మాట మధ్యలోనే లచ్చువమ్మ అదో కారణం కాదన్నట్టు తోసి పారేసింది.

"— ఆఁ అంటాది. ఇప్పుడు సస్తె దానత్తని కాల్సడానికి దానికాడ కర్రలు కూకున్నాయి. నీకాడ లేపోనాయి. అనీ లెంజనెవలనో పుట్టెడు కర్రలు అప్పీమను— అప్పుడు తెలిసొస్తాది."— అంది లచ్చువమ్మ.

"పోనీ ఓ పన్సేస్తెనో" అన్నాడు పొరుగింటి సొట్ట పాపిగాడు "రేప్పొద్దున్న యాపగించీదేదో యిప్పుడే యాపగిస్తే కాదా?" అన్నాడు ఉభయ తారకంగా,

నిజమేకాని పొద్దున్నకీ ఆ అర్ధరాత్రికీ తేడా ఉంది, యీ చలిలో అర్ధరాత్రి ఎవరి తలుపని కొడతారు. అమ్మకానికైతే పోనీ అపద కాబట్టి లేపొచ్చు. ధర్మాని కడుగుతూ అర్ధరాత్రి కలుపు కొడితే ఎవరైనా ఏవంటారు!

"ఈ యేలప్పుడు పని జరగాలంటె ఒక్కటే ఉపాయం— కన్నయ్య మాంవ కదలాల. ఎంత లేదన్నా బారికోడు కదా, ఆడు ముందలుంటే ఎవులూ తన్ననానికి రారు.— అదే ఉపాయం." అన్నాడు మళ్ళా సొట్ట పాపిగాడే—

సొట్ట పాపివాడి ఆలోచన అందరికీ బాగుందంటే బాగానే ఉందనిపించింది. సామాలు కూడా "సూద్రన్నా రేప్పొద్దున్నేనా, యిప్పుడేనా, నువ్వే పూనుకోవాల. మరి మాకేటి యిరస్తా పరస్తా! మరి మీ బావకెవ్వరు పలకరు— నువ్వొరగవేటి?"— అంది నువ్వే దిక్కన్నట్టు—

....కన్నయ్య "తప్పు తాదేటి పదండి." అంటూ కర్ర తీసుకొని బయల్దేరేడు,—

బారికాయన కర్రలు అడగడంవంటే అడుగుతాడు. కర్రలు మోస్తాడా— అందుకు నలుగురు మనుషులు కావాలన్నాడు.

సొట్ట పాపిగాడూ— ఎరకయ్య పెద్దకొడుకూ, పొరుగింటి సీతయ్యా ముగ్గురు లేచారు.

"ఇంకోణ్ణి నీకన్నా కాస్త జబరుగున్నోణ్ణి సూడు." అన్నాడు బారిక్షన్నయ్య

"అప్పారావుని నేపుకొద్దునా?" అన్నాడు సీతయ్య.

"అడొస్తే.... అడిగినావా మీరెవ్వరు రావోయినా పరవానేదు. కాని ఆడితో ఓ తగువు. అసలాడు వెగుస్తాడా యీ రాత్రేల!"

"నీకెందుకు నువు నడుదూ, నానాణ్ణి తెస్తాను గదా," అంటూ నిబ్బరంగా పక్క సందుకేపి నడిచేడు సీతయ్య, బారిక్కన్నయ్య, అతని వెనుక మనుషులూ ఊరికేసి కదిలేరు.

* * *

"ఈ సచ్చిపోయిన ముసిల్దాన్నీ ఇంతప్పణ్ణుంచీ నానెరుగుదును"— అన్నాడు సూరయ్య.

ఆ పల్లెటూళ్ళలో శవాల దగ్గిర భజనలుండవు. ఈ కులానికీ ఆ కులానికీ లా, వాళ్ళ శవాల్దగ్గర అగర బత్తీలు వంటి సుగంధ ద్రివ్యాలుండవ్. ఎంతైనాకానీ ఖర్చు అవసరంలేని మాటలూ, కన్నీళ్ల తప్పితే —ఆ శవాలు కదిలే వరకూ యింకే ఖర్చూ అవసరంలేదు.

సూరయ్య వయసులో పెద్దవాడు. ఊరి ఊరందరి కథలూ ఎరుగును, ఆ పేటవారి బ్రితుకులన్నీ అతడి కళ్ళ ముందు నడిచేయి.—

సూరయ్య చెపుతున్నాడు—

"నానిదిగిలాగ యింతున్నప్పుడు, మాయమ్మెన కాతల మా తాతగారూరు లరుచూ యెల్లోణ్ణి, మాయమ్మ యింటి కొక్కతే ఆడపిల్ల. దాని కన్నోరి వూరూ యిది పుట్టినూరూ ఒక్క టే; తంగుడు—బిల్లనీ, కూర్మాం కెళ్లేదారినేదా, అక్కడ అంపోలుకి కోసెడు దూరాన వుంటాది. మనూరికన్న మరి పద్ది కెక్కువే వుండొచ్చు. మాలపేట దీన్లో సగంవే వుంటాది, మా తాతగారిల్లూ దీని కన్నోరిల్లూ ఇలా గలాగ ఎదురూ బొదురుగుండేవి.

"నానింతున్నప్పుడు— యిది ఇలాగ యింతుండీది. దీన్నందరూ, ఒలే పొట్టి నారెమ్మ! ఒలే గచ్చకాయ! ఓలె గొట్టిపిక్క! అని ముద్దుకి రకరకాలుగ పిలసీ వోరు. ఇప్పుడీళ్ల కడసారపు గుంటనేదా— దాన్లాగే లిడుకూ— లిడుకూమని తిరుగు తుండేది.

"నాకు దాగ్గేపకం. యెండకాలం యెన్నెలరాత్తుళ్ళొస్తే పెద్దోళ్ళందరూ విద్ద రోయినా యెంత రద్దు మా గుంటలంతొంగునీ వోళ్ళంకాఁవు. కబుర్లయీ సెప్పుకుం డోల్లం– ఆటలూ పాటలూ మద్ది మద్దె కయ్యాల్తో ఓ గొల్లుమనీది యీది. అయితె అప్పుడు అరెవురో నానెవురో– సంతల సింతపండునా గుండీది.

"ఇది గిలా గుండగా ఓపారి యీ జట్టు జట్టంతా తాటి ముంజలు కోసం పెందెలంటపడ్డారు. ఏడెనమండుగురు మొగపిల్లలూ నలుగురైదుగురు ఆడ పిల్లలూ రెండో మూడో గడ కర్రిలూ....

"అయితె అప్పటి నాయుళ్ల యిప్పట్నాటి కరువుగొట్టు నాయూళ్ళ కాదు. 'ఆపు' ఉంచిన పెందికెళ్ళినా, ఏదో పేదారోదా, కడుపు జరగని గుంట పాపల్నెమ్మని సూసీ సూణట్టు ఓ కసురు గసిరి ఒగ్గీసివోరు.

"పది పన్నెండు పెందెలు తిరిచీసరికి పొద్దు తిరిగి పోనాది. అందరికీ కదు పుల్నిండినాయి. కాని ఒళ్ళల్లా బంకే, సేతుఁల్లా తెఁవదే. ఎండపళ్ళన్నీ మావేనేఁవో యీవలట్టి పోనాం.

"అప్పడలా గొస్తంటే– అక్కడ తోవలో గొల్లల పాలెఁవని యింకో వూరుండేది. అవూరు దాట్నాక, యిక్కడ మన కాఁవుడికోనేర్నెదా, అలాటిదో పెద్ద 'బంద' తగిలింది.

"మాకు తెల్దు, అందల గేదల్ని కడుగుతారని– నీళ్ళు దొరికిందే సాలు, ఏ నీళ్ళైతేం మాకందరికీ పోయిన పేనాలు తిరిగి దొరికినట్టయ్యింది. పొలో మంటూ ఆ గోసిగుడ్డలా గట్టుమీద యిసిరి పారీసి అందరిఁవీ నీళ్ళమీద పడ్డాఁవు.

"అయ్యా! దిమ్మాదిరగా తానాలాడి నీళ్ళల్లా కెలకిలెట్టేసి గట్టు మీది కొచ్చి సూదుఁవూ జలగులంటుకున్నాయి. గజ్జలంటా, యీపులమీనా, కాళ్ళకాడ యిక్క దక్కడనకు– ఒక్కొక్క గుంటకీ గుంటపాపడికీ రెండేసి మూడేసి జలగలంటేసినాయి.

అందులీ నారెమ్మకి సరీగ్గ మానమ్మీదట్టుకుంది. యింత జలగ–

"మాకు తెల్దు– ఓలమ్మంటె ఓరిబాబో ఓర్నాయినంటె ఓరయ్యోఅని ఎవరి జలగలు సూసుకొని అళ్ళఁపే గెంతుతున్నాఁవు.

"తల్లి ముండ మోసిన జలగలు పట్టుకుంటె ఒకంతట్గా నూడిరావు— యీడవు– ఎలాగైతేనేం ఒకళ జలగల్ని ఒకళం ఒలుసుకొని ఆరకతాలన్నీ మళ్ళీ నీట్లో సుబ్బరంగ కడిగేసుకొని సివరకి బయలెల్లినాఁవు

"మొగ పిల్లలంత కదిల్నారుగాని యీ ఆడపిల్లలుకదటరి. ఏవ్రా? 'ఒస్తాం మీరు ముంగల నడవండి.' ఆడపిల్లిలుకదా ఏదో గోపిగుడ్డలు పిండుకుంటారు కావోలని మేం పదండంటే పదండన్నాం.

"పదిబారలెల్లి ఎనక్కి సూస్తే ఒగ్గుంటా కానారిదు. అందల పెద్దోళ్ళు ఏటి పంగతో సరీగ్గ సూసిరండయ్యా"అని మా బావనీ నన్నూ తోల్నారు.

"మా వెల్లీసరికీ, యినాగ్గేది పడ్డలు సూసినా, ఏడేనాస్తే అన్నీ ఒక్కాడ దగ్గిరైపోతాయి, అనాగ యీయాడపిల్లలందరూ ఒక్కాడైపోయి బిక్కుబిక్కుమంటూ దిక్కులు సూత్తన్నారు.

"మా బావని సూడగానే యిప్పుడు మా ఆడదాయినేదా, అప్పటికి మా పెళ్ళి కానేదు, దాన్ని మా కాడకి తోల్నారు. అదొచ్చి అతి రగస్సెంగ యిదిగినాగని ఆళ్ళన్నకి సెప్పింది.

మా బావగదా, ఓరిబాబు! కొంపలంటుకున్నాయని ఆళ్ళందర్నీ పిలుసుకు రానానికి తయారైనాడు. నాను ఆణ్నాపి, మరేం బయ్యంనేదని దైర్యంసెప్పి ఆ సుట్టు పట్టంత ఎతికించినాను. ఒక్కాడ ఒక్కొత్త సుట్టపీక దొరికింది, అప్పుడు దాన్నే నీట్లో సుబ్బరంగ కడిగేసి కసాబిసానవిలి ఆ రసం ఓ తాటి దొప్పలోకి పట్టినాను. అది మా ఆడదాయికిత్తే ఒట్టుకెల్లి ఆ జలగ మీదోసింది, అప్పటికిడ్డాది జలగ.

"అయితే, అది నగాయితు, ఒంటిగ నానెప్పుడు తారసపడ్డా ఇదిగిలాగ తలొంచుకు తప్పుకునీది, మళ్లా పదిమందిరైతే మాటాడీది. ఒంటిగైతేనే ఆ బెరుకు. అప్పటికెంతానేదు. ఈళ్ళ మూడోదాయినేదా దానంతుండీది "

"ఏఁవిరతాతా! కబురంపినావా?"అంటూ అప్పారావు రావడంతో సూరయ్య మాటమధ్య ఆపేడు.

"నాయిన్నాయన అల్లా బారికోడికి తోడట ఎల్లుమీ" అన్నాడు అప్పారావుతో. దేనికంటే, ఎందుకో రాజయ్య చెప్పేడు.

"ఏఁవి నువ్వెల్లరాదేటి? ఇంతోటి పెద్దమేత్రీకి, కర్రిలు మొయ్యడం నామోసికా?"అన్నాడు. రాజయ్య నిఁడలేదు. బాబ్బాబనే అన్నాడు.

"అయితొక సుట్టముక్కిచ్చుకో"అన్నాడు అప్పారావు.

అప్పారావు ఆరడుగుల నాలుగంగుళాల మనిషి. అంతకు తగిన ఛాతీ. మనిషెంతజబరో మాటంతధాటీ. మంచికి మంచిగాచెపితే ఎంతచాకిరీఅయినా చేస్తాడు.

తిక్క రేగితే దేవుడు కొడుకునైనా లెఖ్ఖచేయడు. అంచేతే అడగ్గానే రాజయ్యిచ్చాడు. అంతకుముందే బాబ్బాబన్నాడు. అప్పారావు అప్పుడు కదిలేడు.

అప్పారావు అందర్లాగా దుప్పటి కప్పుకొని రాలేదు. ఒగ్గావంచా కట్టుకున్నాడు. ఓబనీనుంది. పైన ఓ తువ్వాలేసుకున్నాడు. జడిస్తేనే చలైనా జడిపించేది. రాజయ్యి యిచ్చిన చుట్టవాసనచూస్తూ చూరుకేసినడిచేడు

మునిలిసూరయ్య చచ్చిపోయిన నారమ్మకు తన తల్లి ఈ ఊరి సంబంధం ఎలాకుదిర్చిందో చెప్తున్నాడు. "ఏవరాౌ అగ్గిరవకుందా?" అప్పారావు చూరుపంచ ముందు గొంతుకూర్చుంటూ అడిగేడు.

మంజూరులో ముగ్గురు నలుగురు ఆడవాళ్లున్నారు. గుమ్మంమీద గువ్వలా ముడుచుకు కూర్చుంది నారెమ్మ. ఆపక్క సగంలో అంకాలుంది. వాళ్ళవెనక గదంతా వెచ్చగా వచ్చని వెలుతురుంది,

"ఏది మా ఒదినేది? వదినా, అగ్గిరవక" అన్నాడు అప్పారావు.

ఆడవాళ్ళందరికి ముందుకూర్చుంది పోలమ్మ. ఓడలా కదల్లేకుండా వుంది. ఓసరిల్లి "లోపల దీపం వుంది ఎల్లి కాల్చుకో"అంది ముభావంగా.

అప్పారావు చూరు చప్పుడుచేస్తూ లోపలికి దూరేడు. అంకాలు సగం తప్పుకుంది. నారెమ్మ కదల్లేదు.

"బానే గుంటల్లార. గురాౌల్నాగున్నారు. గుమ్మాలమీద కూకోవచ్చా? నెగండి నెగండి"అన్నాడు అప్పారావు.

అంకాలు లేచినిల్చుంది. నారమ్మ ఒళ్లు జరిపిందికాని కదల్లేదు.

"గుంటకి ఒళ్ళల్లా పొగరే." పోతూపోతూ కాలి బొటనవేలితో నారెమ్మను పక్కలో ఎక్కడో తాకేడు అప్పారావు.

నారెమ్మకు నాభినుండి నిలువూతా ఒక్కసారి సర్రుమంది పాములా పక్కకి తిరిగి ఆ కాలు గట్టిగా గిల్లింది.

'ఓల్లంజో' అనబోయి ఒక్క ఎగురెగిరి ఆపుకున్నాడు. "గుంటమాకాన్ది" అనుకుంటూ చుట్టకాలుస్తూంటే దీపం భగ్‌భగ్‌న మండి ఆరిపోయింది.

"ఒదినో అగ్గిపెట్టె"అరిచేడు అప్పారావు పోలమ్మ విసుక్కుంటూలేచింది. నెలలునిండిన మనిషి నెమ్మదిగా నడుస్తోంది.

చీకట్లో ఒకళ్ళిటు ఒకళ్ళటూ పోలమ్మా అప్పారావూ తడుముకుంటున్నట్టు నడుస్తున్నారు. అప్పారావు తలుపుదగ్గరకొచ్చేసరికి నారెమ్మ లేచిపోయింది.

అగ్గిపుల్ల గీసిన వెలుగులో చూస్తే ఆడవాళ్ళమధ్యగా నించుంది.

ఆమాత్రం భయముందిగదా అనుకున్నాడు అప్పారావు. నారెమ్మ పక్కనే నిలబడి చుట్టని ఎర్రగా కాలుస్తున్నాడు. నారెమ్మ గుండెల్లో దడపుట్టింది. ఆమెకాళ్ల ల్లోంచి వణుకు పుడుతోంది.

గట్టిగా బుక్కెడు పొగపీల్చి ఆమె మొహమ్మీదికొదిలేడు. చప్ప చూరు దాటి వాకిట్లోకి పోయేడు.

కథవింటున్న ఆడవాళ్ళకు యివేవీపట్టలేదు. ఆకటికడుపునవున్న నారెమ్మ కొక్కసారి కడుపులో దేవినట్టయింది. వణికే నడుముతో వెళ్ళి గుమ్మంలో కూచుంది.

పదహారేళ్ళ నారెమ్మకు బతుకులో హాయెంతో, వెలుగెంతో, ఇంట్లో ఒంట్లో చీకటీ, బాధా అంత. నవ్వుతూనే వుంటుంది, కేరుతూనే వుంటుంది. లోలోపల దడ దడలు, దిగుళ్లు. రక్తం, ఏవేళా మంటలు రేపుతూ పరుగులు. తిన్నా తినకున్నా ఆకలి— పేగులు చుమ్మలుచుట్టే ఆకలి.

''... దీనికి పన్నెండోఏటే పెళ్లయింది ఏడాదిలోపునే యీడేరింది. అయితే బంగారాలకాడ తగువొచ్చి ఎదిగొచ్చిన కోడల్ని నాలుగైదేళ్లు పుట్టింటికాడే ఒగ్గేసింది— దీనత్త. ఎందరెన్నిచెప్పినా గుమ్మంతొక్కనిచ్చింది కాదు ముసిలి ముండ మహకాన్ని. దాన్ని మీరెవ్వరూ ఎరగరు... ''అంటున్నాడు సూరయ్య.

నారెమ్మకూడా పెద్దమనిషై నాలుగేళ్లు కావస్తోంది ఆమెపెళ్ళి యెప్పటి కప్పుడు వెనకపడిపోతోంది. గత ఏడాది కప్పరాం సంబంధం తల్లితరపునుండివచ్చింది. అంతా సెటిలైపోయింది. పంటలు పోయేయి. వీళ్లు తూగలేకపోయేరు. వాళ్లింకో సంబంధం చేసుకున్నారు. ఈ ఏడాది పంటలు పండేయి— కుదిరితే చేదామనుకున్నారు. ఎవ్వరూ అడగరాలేదు ఇంతలో యీచావు. పెళ్ళి వెనకబడ్డకొద్దీ నారెమ్మమనసుకీ, శరీరానికీ పొంతన మరీ మరీ దూరమవుతోంది. ఒకమాట అనబోయి యింకోమాట అంటుంది. ఒకపని చేయబోయి యింకొకటి చేస్తుంది. పగలు రాత్రినిగురించీ రాత్రి పగలును గురించీ ఆలోచిస్తుంది.

నారెమ్మకు రేలూ పగళ్లు— కళ్ళముందు పంట కళ్లాలు; కండలు తిరిగిన గడ కర్రల్లాటి కాళ్ళపై దాగర్లలాంటి వీపులు; నెత్తులమీద బిళ్ళకు సరిపడా చేలమోపులు;

పరుగులు, గాల్లోకి ఎగిరే ఆమోపులు; బారులుతీరి కోతలుకోసే చీరల గిలుకు గిలుకూ చప్పుళ్లు;పరాచికాలతో పరుగులతో కవ్వించి చేతికందని కుర్రాళ్లూ కన్నెపిల్లలూ; కన్ను మూసినా కన్ను తెరిచినా— కోతలు, కుప్పలు, మనుషులు, వంటలు, మందలు, గుంపులు; అర్ధమ్మరేయి చలిలో చీకటిలో కటికినేల చల్లదనానికి తెలివొచ్చినపుడల్లా నారెమ్మగుండెల్లో ఊపిరిసలపనిబరువులు.

"—సివరికి కొడుకు సెడుప్ల తిరుగుతున్నాడని యిని ఇంకెవర్తిని తెస్తాడో పీకమీదకని, అప్పుడు కోడల్ని తెచ్చింది. పెద్దమనిసైనాక మొత్తం నాలుగైదేళ్లు పుట్టింటే ఉండిపోయింది నారమ్మ. అయితే ఒక్కళసేత ఏలెత్తిసూపించుకోలేదు."

....ముసిల్దాయి గురించి శానామంది ఎప్పుడ చెప్పినా మంచిగానే చెపుతారు. అయితే చివర చివరికొచ్చేసరికి దాని మంచంతా మాయమయ్యిందేమో మనవరాళ్ళకి, అందులో నారెమ్మకు దానిలో చెడేతప్ప మంచి కనిపించదు.

నారమ్మా నారెమ్మా ఎప్పుడూ తగులాడుతూనే వుంటారు. ఆ తగువులు తీర్చేసరికి ఎరకయ్యకీ సాఁవాలుకీ తలప్రాణం తోక్కొస్తుంది.

" దాన్నెత్తి కరవై ఏళ్ళొచ్చినాయి. దీనికింకా యీసెంప కొడితె ఆసెంప పాలు కారె వాయసు. ఈళ్ళిద్దరికి యీవైరవేఁటో" అనేవాడు ఎరకయ్య. "ఇద్దరికిద్ద రొకటే, దానిపేరెట్టినందుకైన దీంతో సర్లీగుండదు ముసిల్ది, యిదీ అంతే, అద్దఁవుంది ముకఁవుందన్నట్టు అచ్చుదాని పోలికిని పుట్టింది, మళ్లా దాంతో తగువాడతాది! ఎక్కడికి పోతాది ఆ కిరిబుద్ది? కిరిపట్టుతో సహా నాయనమ్మ ముక్కులోంచి ఊడొచ్చినాది"అనీ వాడు ఎరకయ్య.

పొట్టీ పొడుగూగాని నాయనమ్మా మనవరాళ్ళది అచ్చం ఒకటే రూపు.

"పేరుదాందికావచ్చు. పోలికాదాందే— ఇదేటి సెరిపీసుకుంటె సెరుగుతాదేటి? కాని బుద్దులు దానివంటె నానొప్పను. ఆ ముసిలిముండకీ నాకూ అక్కడ పోలిక తేవద్దు"అనీది నారెమ్మ.

యవ్వనం యిచ్చే వరాలన్నింటితో దాని శాపాలనుకూడా మోస్తూ పకపక బొకబొకలుగా తిరిగే నారెమ్మనుచూస్తే ఉలికులికిపడీది ముసిల్ది. ఆమెను ఈగనుతీసేసినట్టు తీసిపారేసేది నారెమ్మ. దానిమీద—

"ఓలేటోలె అంత మిడిసిపాటు. కసింతదాసే. కసింతదాసే, కాలఁవంత ముందుందే"అనీది ఓసారి.

ఇంకోసారి "ఏటిసూసుకునే అలారాలి పడిపోతా? కాదు, ఏటిసూసుకునీ? వొయిసా!? వొయిసునాడు నానూ వుండీదాన్ని— నీకన్న రెపరెపనాడుతూ, యిప్పుడు సూడునాఅందఁవు"అంటూ పైట తొలగించి ఎండిన తనరొమ్ములు చూపేది.

అలాంటి బుద్ధులు చూస్తేనే నారెమ్మకి ఒళ్లమంట—

"పోపోయె ముసిలిముండా! సిగ్గునేదు నెంజికి!! సిన్నప్పుడు మాతాత తన్నినట్టు మెత్తగ తన్ని వోణ్ణేక ఇప్పుణ్ణీ వొళ్లు అనాగ పులిసిపోతాంది. నేకపోతే ఏటా పన్లు? సీ!" చీదరించుకునేది నారెమ్మ.

"నవితీ యారాళ్ళపోరు నాకీసంత ఎప్పటికి తీరితాదో"అనేది ఇంటి యజమానురాలు అటు అత్త యిటు కూతురు— సావాలు ఎటూ చెప్పలేకపోయేది.

బయట సూరయ్యతాత కథ చెపుతున్నాడు.

"....అయితే కొట్టినంతసేపు కొట్టేవోడు. అదయ్యింతరవాత యిలాగ సంకకెత్తీసుకుని గిరగిరగిరగిరా తిప్పి గుభీమని ఏ సొప్ప దిబ్బమీదో యెత్తీసీవోడు.

"అందరూ ఆణ్ణి దెబ్బలాడీవోరు, 'ఒరేనీకిదేటి తిపారంరా! ఆడమనిసి ననాగ ఏడిపించకూడదురా. దాని కళ్లనీళ్ల యెంతరాత్తే నీకష్టాలంతకన్ని అలా పెరుగుతాయిరా"అంటూ బుద్ధులు సెప్పీవోరు. "అందికేగదా నవ్విస్తన్నాను. ఒలే ఒల్నంజ ఇంకా నవ్వవేఁవే? నవ్వుతావా తన్నమన్నావా?"అనీవోడు నాలికద్దగ కరుసుకుంటూ. జనఁవందరు ముక్కుమీద వేలేసుకుంటే, యిది— యినాగ నవ్వీసి నెగిసిపోయీది....'

నారెమ్మకి నాయనమ్మంటే ఎంత అసహ్యవోఁవాళ్ల తాతంటే, అతడికబుర్లంటే ఆమెకంత యిష్టం. ఆమె పుట్టకముందే అతడు పోయేడు. అయినా అతణ్ణి చూచినంత స్పష్టంగా అతడిగురించి వింది.

పెదమనవరాలికి నాయినమ్మంటేనే జాలి—

ముసల్దానికూడా పెద్ద మనఁవరాలంటే చాలా యిష్టం. "దాని ఒబ్బిడి, మాటపొందిక యీ రాలుగాయినంజకి నస్తేరాదు"అనేది యిద్దరు మనవరాళ్లనిపోలుస్తూ.

"దాన్లాగ ముగ్గురు బిడ్డల్నెత్తితే దీనికీ వాస్తాది"అనేది సావాలు.

"ఆఁ వొస్తాది, దీనికిముందు మొగుడంటూ ఒకడురానీ— ముగ్గురు పిల్లల ముచ్చట ఆ ఎనక సూద్దుం"అనేది ముసిల్ది.

నారెమ్మకు పెళ్లికాకపోవడం ఆపిల్ల తప్పుకాదు. అయినా 'రాలుగాయి నంజలకి పెళ్లిళ్లవడం మాట్లేటి? ఒకేళయినా అలాటి నంజలకి కడుపులు పండవు. కడుప్పండని ఆడదాయీ ...' అనీది ముసిల్ది

ముసిల్ది చాలామందిని కని పెంచింది. దానికి చంటిపిల్లలంటే చాలాఇష్టం. అలా పిల్లల్తల్లి కాబట్టే పెద్దదంటే మోజు. కాదుకాబట్టే చిన్నదంటే మరీ చేదు.

''....అయితే కనీ, పెంచీరోజుల్లో యీనారెమ్మ ఎలాగుండీదో ఎరికా—లేత పరువుకే ఇరగ్గాసిన బొప్పాసపసెట్టు నాగుండేది తల్లి.

''—ఎక్కడికేన ఎల్తే దీని పిల్లలందరూ దీనెంట పడీవోరు. ఇసుపన్నది నేకండా, యీసంకనోబిడ్డ, ఆసంకనో సంటిపిల్ల, ముంగట ఇద్దరో ముగ్గురోగుంటలు ఎనకాతల మిగిలినోళ్లు! అలాగ అందర్నీ ఎంటేసుకు తిరిగింది.

''అది నల్లా ఎలాంటి బాదలుపెట్టినా అతరవాత్తరవాత అత్తకీ మొగుడికీ కూడా దీనిమీద అబిమానాలు పుట్టినాయి, ఓపిల్లని తీసినట్టూ, ఓకోకగుడ్డకొన్నట్టూ, కాలూ సెయ్యీ నొచ్చినప్పుడు 'ఉన్నావా తిన్నావా'అని అడిగినట్టూ, యినాగ మారతన్నారు, ఇంతలో ఒకేడాదీ వరదలొచ్చినయి

"మొట్టమొదట మనకు ఓట్లురానేదా, అంతకి రెండుమూడేళ్లముందు పెద్దసెట్టున బూవీ అకాసాలు ఒక్కటైపోయినట్టు ఊఁ ఒకటే కుండపోత ఇంక గంగేటీ-ఏళ్ళూ గడ్డలూ ఏకమైపోనాయి. ఎన్నివూళ్లు మునిగినాయో నెక్కనేదు.

"అత్తల పద్దేరు, యిత్తలసిన్నేరు, ఇల్లిక్కడ రంగన్నపేటకాడ పెద్దగడ్డ నేదా, దాన్తో కలుపుకుని అన్నీ ఒక్కసారి పొంగిపోనాయి. అది పశువుల సావేకాదు, మనసులసావేకాదు, ఎన్ని పాంవులు కొట్టుకొచ్చినాయో, ఎంత మంది మడుసులు కొట్టుకుపోనారో లెక్కలు తెలవ్వట.

"అయితే వరదలదెబ్బ మనకునేదు. దాన్తరవాతొచ్చిన మసూచికంవుమన్ని తినీసినాది, మసూచికంవొచ్చి అంతకు పదిరెట్లజనం దుల్లిపోనారు.

"మనూర్లో ఊరంతటికీ పాతిక శవాలుపోతే ఒక్క మాలపేటలోనే పదారు పోనాయి. పేటంతటి దెబ్బా ఒకైత్తే దీని ఒక్కంటిదే ఒకెత్తు.

"దీనికిద్దరు సిన్నపిల్లలూ, ఎదిగొచ్చిన కొడుకొకడూపోనారు. దుక్కనాటి అత్తముండకి కాళ్లపోనాయి, నడివయసులో, గడించే మొగుడికి, రెండుకళ్ళూ ఒక్కపాలి పోనాయి.

"ఆదెబ్బకి యింకోళ్లా మరికోళ్లా అయితే యేటవుదురో— యిది మాత్తరం అలాగే నిలబడింది. తాత్తంౘ్రులు గడించిన మూరా చారా మడిసెక్కలు అప్పటికే తాకట్లపాలైనాయి. నాలుగైదేళ్ల ఏంతిన్నారో ఎలాగున్నారో, ఎవ్వరికెరికెనేదు, అందరి సంగతటుంచు, అన్నిటికి ఇదొక్కర్తేకదా— ఏనుగునాటి మనిసి పీనిగై సాకిరీలుసేసింది.

"రోజులకొద్దీ పస్తులేవుందా, కట్టుకోనానికి మారుగుడ్డనేక ఏళ్ళతరబడి ఒక్కొక్కకోకతోనేవుందా, పొగలూ రేలూకూలిసేసి పొద్దుటా పొద్దోటా వూళ్లొ వాకిళ్లే తుడిసిందా, ఇంకెన్ని పాట్లు పడ్డదో దానికే యెరిక, ఆ బగమంతుడికే ఎరిక।

"అలాగే ఆ సిన్నపిల్లల్ని పెంచుకుంటా. కళ్లలేని మొగుడుకీ, కాళ్ళలేని అత్తకీ ఒక్కమాటనకుండ ఒక్కమాట పడకండ సాకిరికి సాకిరీ. పోసవర్గానికి పోస వర్గం— రెండూ నడిపింది.

"ఇంతలో ఒకేడాది, అమ్మోరు పండక్కి కావాలె— అడుక్కుంటే ఎవరో నాయురాలు అరిసి ముక్కెట్టింది అది తిన్నరాత్తిరికాణ్ణుండి అత్తముండకి బేదులట్టుకున్నాయి. అందులో ముక్కలే పిల్లలూ తిన్నారు. దాని బొంది పోనానికి ఇది నిందయ్యింది. అవీడాదో, ఆ మరసటేడో గుడ్డోడు సెరువుగట్టుకెల్లి తిరిగొస్తన్నాడు, దావయ్యగోరునేరా అళ్ళకోకర్రి బేపివుండేది ఏపీ నేదు, కాళ్ళకడ్డంపడ్డాదని కర్రితో యినాగన్నాట్ట అంతే. అది కరిసీసింది అన్నెల్లు తిరక్కుండా ఆ మొగుడుకూడా పోనాడు అక్కడికి దాని కట్టలు, ఆశకట్టాలుకూడా యిరగడైనాయి "

తరువాత గుక్కతిప్పుకోవడానికి సూరయ్య కొంచెంసేపు ఆగినట్టుంది. ఊపిరి తిరిగేక—

"పుట్టినోళ్లు పుట్టగా, పోయినోళ్ళుపోగా, దీనికిప్పుడు యిద్దరు మగపిల్లలూ ముగ్గురాడపిల్లలూ కావోల దక్కినారు."

"అందరికన్న పెద్దోణ్ణి మీరెవ్వరెరగరు. నాపెద్దకాడుకు తోటోడు సిన్నప్పుడు ఆళ్ళ నాయనమ్మఏటో అందని కలకత్తాకో, కాశీమట్టో పారిపోనాడు, దార్లకాడ పవిదొరికిందంట, ఆళ్ళమతంపుచ్చుకుని అక్కడే ఓపిల్లని పెళ్లాణ్ణాడు. పాతికేళ్ళకింద ఒకపాలొచ్చినాడు. వస్తాపోతా వుంటానన్నాడు కాని మరి రానేదు.

"ఎన్నాలో ఆడికోసం ఏడిసేది." ఆ తరవాత ఆశలొగ్గుకుంది.

"తరవాత ముగ్గురాడపిల్లలు. ముగ్గురకీ ఇదే పెల్లిల్లుసేసింది. కలిగినకాడికి రాకాపోకానడిపింది."

"ఒకత్తెను సోంపేట ఇచ్చింది. దానిమొగుడక్కడ కొబ్బరితోటలకాపాల, కాపలావని. దానికి నలుగురో అయిదుగురో పిల్లలు."

రెండోదాన్ని ఇజానారంకాడ జొన్నలవలసిచ్చింది. ఆవూరు బారికోడు పెళ్లాడినాడు. దానికీ వుండాల యిద్దరో ముగ్గురో మగపిల్లలూ ఒకాడపిల్లా.

మూడోదాని సంబందమే కసింత తిరకాసైపోనాది. దగ్గిరని సిలకపాలెంలో, సిన్ననరిసిగాడి బామ్మరిదినేడా, ఆడికిచ్చింది. ఆముండాకొడుకు తాగుముచ్చోడు. ఆడు పెట్టేబాదలు పణ్ణేక ఏ తాళ్ళకుర్రాడుతోనో, గంవల్లాయనతోనో, సరీగ్గురునేదు— ఎవరితోనో లేచిపోయిందన్నారు. 'నాకూతురలాటిదికాదు. నిప్పులాటిది. ఎందలోన పడి సావనైన సస్తాదికాని, అలాటి తప్పుడుపన్లు సెయ్యదనేది ఈముసిల్ది. మొత్తానికి అళ్ళక్కడానేదు, మనక్కడానేదు. ఎక్కడున్నాదో తెలీనూ తెలీదు.

అంటూ— "అవునా్రి మళ్లా దానికబురేమేనా తెలిసిందా?"అన్నాడు ఎరకయ్య నుద్దేశించి.

ఎరకయ్య గొంతుసర్దుకొని అంతలో మనసు మార్చుకున్నవాళ్ళా.

''ఊ.... హు....''అన్నాడు మూలుగుతున్నట్లు.

''ఇంక తెలిస్తేటి తెలకపోతేన్నే— దాని బతుకేదో అది బతకతంది. ఒక అయ్యసేతిలో ఎట్టిందాకే ఆడపిల్ల మంచి సెడ్డలు వుట్టింటియ్యి. ఆ తరవాత అది ఏంవయ్యనా పలానోళ్ళ కోడలంటారుకాని, కూతురనరు. అయినా మన మనిసన్నాక, మో। అంతే''—.

అంటూ సూరయ్య ఆగిపోయేడు.

కొంత సేపుపోయేక పొరుగింటి పాపమ్మఅంది

'ఏనాటిముచ్చట్లు, ఏనాటికబుర్లు. మా మామకియన్ని ఎంతగేపకంవో।'అది.

''మరింక పనా, పాటా? ఈకాళ్లు వుత్తైపోయినకాణ్ణుండి అలాగ మంచం మీద సాగోరడం, యిలాగ యీపేట పేటంత కలుపుకొని యీసుట్టుపట్లజరిగిన సంగతులన్నీ నెమరేసుకుంట తొంగోడం— యిదేనాపని''అన్నాడు సూరయ్య.

సూరయ్యకు పదేళ్ళకిందట పట్టుకున్న ఏనుగ్గజ్జి ఎన్నిమందులుపెట్టినా మరొదల్లేదు. కొడుకులు ఊర్జితమంతులూ, పెద్దవాళ్ళూ— అంచేత తండిర్రి యింటిపట్టున కూచున్నా గడిచిపోతోంది.

రాత్రి ముందుకి సాగినకొద్దీ చలి అంతకంతకూ పెరిగిపోతోంది. దుప్పట్లు సగం మేరకు మంచుకి జుంవునుకుని బరువుగా చల్లగా తగుల్తున్నాయి.

వయసులోవున్న తననే గజగజలాడిస్తున్న చలినిచూసి రాజయ్య, సూరయ్య సంగతి ఆలోచించేడు.

"అయ్యా. మాపంచ"లో ఎండుగడ్డి ఉంటాది. కసింత తెమ్మీ" అన్నాడో కుర్రాడితో.

కాని. సూరయ్య ఒప్పలేదు—

"ఒద్దొద్దు, యిప్పుడుకాదు" అన్నాదు సూరయ్య.

* * *

కర్రలకెళ్ళిన అయిదుగుర్లోనూ ఇద్దరు తిరిగొస్తున్నారు.

"ఏంవిరయ్య, కాయా, పండురా?" అంది లచ్చువమ్మ.

"కాయంటె కాయాకాదు, పండంటె పండూకాదు. దోరపదునుకొచ్చి ఆగిపోనాది" అన్నాడు సీతయ్య.

ఆతడితో వచ్చిన అప్పారావు మాట్లాళ్ళేదు. సీతయ్య కప్పుకున్న దుప్పటి దగ్గిరగా లాక్కుంటూ పెద్దలకెదురుగా కూర్చున్నాడ.

అప్పారావు కూర్చోలేదు. అరచేతులు జబ్బలమీద వేసుకుని ఓ వారగా నిలబడ్డాడు.

"తిన్నగ సెప్పరా! ఏమాట దగ్గిరా సెంవత్కారమేనా?" అంది. పంచలో కూర్చున్న సీతయ్య తల్లి.

సీతయ్య బుద్దికుదిరింది. జరిగినసంగతి సజావుగా ఆరంభించేడు.

... బారిక కన్నయ్య రెండు మూడుచోట్ల చిన్నచిన్న రైతుల్ని లేపి అడిగేడట. సందెడూ మోపిడైనా ఎవళ్లదగ్గరాలేవు. అందరూ పెద్దనాయుడింటికో, కరణంగారింటికో, లేకపోతే సుబ్బారాయుడుగారింటికో వెళ్ళమన్నవాళ్ళే.

"—అరవగా అరవగా అరగంటకి నాయురాలు నెగిసింది. నెగిసినాక ఎలెక్ట్రి నైటు లోపల్నుంచే ఎలిగిచ్చింది. అదెలిగిచ్చిన యింకోగంటకి తలుపు తెరిసింది.

తెరిసి యినాంగ, సిన్నపిల్లిలు దాగుడు మూతలాడతారు సూసినా, అనా తొంగిసూసి 'ఎవరోళ్ళూ... ?' అంది.

సీతయ్య ఆమె గొంతుకూడా వినిపించేడు.

"నానమ్మ. పెదబారికి"నన్నాడు మనోడు. కొంత నిబ్బరంవయిందికావాల. తలుపు దగ్గిరేసి లోపలికెళ్లిపోయింది.

నాయుణ్ణి నేపుతాది. నెగుత్తాడో నేవడో. ఏటంటాడో, ఏటౌతాదో అనుకుంటా మాంవలాకూకున్నాం.

మరోపావుగంట బోనాక, సూసినా, గోరీల్లోంచి నెగిసొస్తాయి తురక దెయ్యాలు– అనాగ 'ఉహూహూ'అంటూ ఎర్రసేలవా, తెల్లదుప్పటీ జోడించి బయలెల్లింది నాయురాలు.

ఇత్తలికిరాగానే, తలుపుదగ్గిర నొక్కేసింది. నొక్కేసి మెట్లకాడకొచ్చి–

"నాయుడు నెగడంనేదురా, యీరాత్రిప్పుడేటాగ్రి?"అంది బారికోడితో.

"నాయెడెందుకమ్మా, నువ్వున్నావుగావా. ఇనాగ మాసెడ్డ ఆపదొచ్చింది. నీమీన పుట్టెడాశతో ఒచ్చినాం. ఇడుగో, సచ్చిపోయిందాని మనవడు. దిక్కుదిబాసు లేనోల్లు. గేమానికి తలిదండులు మీరేకాయాం!" అంటా ఈ జరిగిన సంగతంతా ఒక డొదిల్తే ఒకడందుకుంటూ, ఒయినాలవారీ, ఆయమ్మ మణుసు కరగా సెప్పినాంవు.

"సెప్పినంత సేపూ సెద్దగిందిరయ్యా. సచ్చిపోయిన మనిసినికూడాపోల్సినాది. 'పాలికేళ్ళకిందట మాకూ, మా మరిదిగారికీ వాకిళ్ల తుడిసిందికాదా?'అంది, 'దాని పెద్ద కొడుకే కాదా యిల్లొదిలి పారిపోనాడంది.' 'దానత్తకే కదా మసూచింకంవొచ్చి కాళ్ళు పోనాయంది'; దాని మొగుడేకదా బేపికరిసి సచ్చిపోనాడంది'; 'పాపం, మంచిముండ నానా కష్టాలు పడ్డదంది' కర్రిలకాడి కొచ్చేసరికి, యీ నారాయన్నారాయనంతా బొల్లి గెద్దై గబాల్న ఎగిరిపోనాది.

"కర్రిలా" అంటూ సతికిల్లపడిపోనాది తల్లి. "అమ్మ! ఏమైపోద్దో" అని మాకూ గుండెలు నొట్లొట్లాణ్ణాయి.

"తల్లి, తల్లి! నువ్ కాదంటె మాం సచ్చిపోతాం. మరేటనకు, మరోమాటే అనకు"అంటా కన్నయ్య మాంవ పంపారంబించినాడు. కసింత సేపయీసరికి మాటొచ్చింది.

"కర్రిలింకెక్కడ దొరకవటాగ్రి, వూరందర్నాగ్గేసి, మాకాడికేవొస్తారూ?" అంది నాయురాలు.

"అమ్మ పున్నెంవేకదా, యిలాటిదానికి సాయంసేత్తే ఎన్నో గుళ్లు కట్టిచ్చిన పలితంవంటారు. అందులో పేదముండ, నీ వోకిలి తుడుసుకు బతికిన గులాప్‌ముండ" అంటా అటుకాసిటు కాసనకండ అన్నిదిక్కుల్నుండి దువ్వుతున్నాడు.

"అట్టై ఆలోసించి ఆలోసించి 'సరె, రేపు తెల్లారి నెగ్గానే రండి ఎనకింట్ల నాలుగు తాటి దుక్కలున్నాయి. పట్టుకుపోదురు" అంటా నెగిసిపోనాది.

"ఇదేటమ్మా, ఇంత సేపు సెప్పిందేటి, రేపొద్దన్నకయితె రేపేరావాం? ఈ అద్దమ్మరేత్తిరినీ తలుపేలం తట్టాం? నీగుమ్మంకాడ యీ శవజాగారమంతా దేనికి? అని ఎన్నిదాల బతుములాణ్ణాంవు?"

"ఇప్పుడటకెవరెక్కుతారూ? అటకమీద కుండలం మండలున్నాయి. మైల పడిపోవా—?"

"మీ కాపోణ్ణే తెస్తా"వన్నాం.

"ఒక్కడేటి దించుతాడు? అటకమీద పురుగూ పుట్రీ ఉంటాదేవోం?"

"నలుగుర్ని తెస్తాం. టార్సిలైటిత్తావన్నాం"

ఇంకెంతికీ ఒదలపోప్తే గబిక్కున కోపం తెచ్చేసుకుంది.

"ఏటి, ఎంతకీ మీరన్నదే మాటా, ఇత్తలోళ్లు అన్నం తింటన్నారా, గడ్డి తింటన్నారా! రేప్పొందలే రమ్మన్నానా? ఒస్తేరండి, నేపోప్తే ఎందల దూకతారో దూకండి— నాను మాత్తరం ఈ సల్లో మీతో సావలేను" అంటూ దబీమని తలుపేసేపింది.

జారికిమాంవ "అమ్మమ్మ...." అంటనే వున్నాడు. 'మీదిమండ మింగేజాతి, అందుకే మీకేసి ఏలెవ్వరూ ఎత్తిసూవరంది.'

పైగా ఆయమ్మ అంటాదీ—

'ఔనార్రీ, మీరెంత తక్కువకులంవోళ్లైనా రాత్రుళ్ల శవాన్నితీస్తార్రా? రాత్రుళ్ల శవాల్ని కాల్సొచ్చా? మాలో అలా కాల్చంవేం? శవాల్ని కాల్చినాక తానాలో? ఆమంచు నీళ్ళల్లో మునగ్గర్లా? అందికే మీలో శవాలకాడ తాగుతారు....!'

"ఇనాగ మాటాడితే ఈ అప్పారావుకొక్కపంవ్వూ

"ఇచ్చేమాటైతే యియ్యరాదా, నేపోప్తే ఆ వుద్దేశం నేదనరాదా? ఆమె లికలన్నెందుకు, యీ ఎత్తిపొడుపు లెందు"కంటాడు.

''అమ్మమ్మ! అయమ్మనాటిదికాదు. ఆ తల్లిది యెన్ననాటి మనసు. మన మీద జాలికొద్దె అనాగంది. పొద్దున్నొస్తె నిబ్బగే యిస్తాది. ఈ అద్దరాతిరి సల్లో మనంవంటె సవ్వగలంగాని ఆయమ్మ సవ్వగల్దా? మనంవేన అల్లా కూలీ– ఆతరతకొద్ది యీసల్లో సావనాని కొప్పుకున్నం; కాని సన్నీల్లలో మునిగితె, రేపొద్దున్న సంకటా లొత్తె, ఆమీన ఏటేనైతే ఆపాపం ఆయమ్మదికాదా? అందికే అనాగ మెలేసిందంటాడు కన్నయ్యమాంవ.

''మద్ది నీళ్ళద్దరు మొగుసుకు పోతన్నారు. ఇలాక్కాదని నానీణ్ణిలాక్కొచ్చీసి నాను''అంటూ సీతయ్య ఆగిపోయేడు,

''మరాళ్లో?''అన్నాడు రాజయ్య.

''ఆళ్ళింక సుబ్బారాయుడుగారింటికా, కరణంగారింటికా. అసలెల్లడంవా, మానడంవా అని ఆలోసిత్తన్నారు– అదిగో ఆళూ ఒచ్చీసినారు''అంటా వట్టిచేతుల్తో తిరి కొస్తున్న కన్నయ్యవంకా తక్కినవాళ్ళవంక చూస్తూండిపోయేడు.

కన్నయ్య కర్రకింద పెట్టి,– 'మరెక్కడ కుదిరింది కాదురయ్యా. తొంగు న్నోళ్లు నెగేనేదు, నెగిసినమ్మ ఏటందో యినేవుంటారు. మరీ రాత్తిరేల కర్రలు దొరక సద్దే''అంటూ చతికిలబడిపోయేడు.

ఉన్న ఆశలన్నీ పోయినట్టు అందరూ అట్టే ఆలోచిస్తూ కూచుండిపోయేరు. కొంతసేపయ్యేక యింకో ఆలోచన చెప్పబోయేడు–

అప్పారావు గద్దలా అందుకున్నాడు.

'ఒరేయ్, ఓరె పొట్ట నంజకొడక! పొట్టబుద్ది నంజకొడక! నీ పొట్టాలోన న్లింక సాలుగాని కసింత ఆపు'అన్నాడు అప్పారావు. అని పెద్దలవంక తిరుగుతూ–

'నాను మీకన్న సిన్నోణ్ణె కాని మిమ్మల్నొమాటడుగుతాను తిన్నగసెపతారా!' అన్నాడు అందరితో.

అప్పారావు సంగతి అందరికీ తెలిసిందే. ఏదో ఉప్పెన తెచ్చేముందే అలా మాటాడుతాడు అంచేత ఎవ్వరూ మాటాల్లేదు–

'నిజంగ మీకీ శవాన్ని కాల్చాలనుందా? నేపోతే సచ్చిందాని జీవుడికీ, బతి కున్న దాని బందుగులుకీ, కళ్లు తుడవాలని యీ నాటకవాడతన్నారా? మీగుండె మీన సెయ్యేసుకు మరీ సెప్పండి'అన్నాడు అప్పారావు.

రాజయ్య, బారిక్కన్నయ్య, చివరకు సూరయ్యతోసహా ఎవ్వరూ మాటా ళ్లేదు. వింటున్నవాళ్ళకేదో వెలక్కొట్టేస్తైె అందరూ మతులు తెచ్చుకున్నారు.

''కాదు, మాయామల్మాలొద్దు. విబ్బగ సెప్పండి— ఎక్కాడో ఒక్కాడ నిజంగా కర్రిలు తెచ్చి ఈ శవాన్ని దానపరుతవనుందా? నేపోతే యినాక్కసింతసేపు తిప్పి తిప్పి 'కర్రిల్దొరకనేదయ్యా' అని కప్పెట్టేస్తారా?

అప్పారావు అంత మాయామర్మంలేకండా అలా అందరిమధ్యా అడగడం బాగులేదనే అనిపించింది కొందరికి.

సూరయ్యకు మనసు నొచ్చింది—

తక్కినవాళ్ళ సంగతెలాగున్నా అతడికిమాత్రం 'ఎక్కడేన కఱ్ఱెలు దొరికితేనె బాగుణ్ను' అనే మనసులో వుంది. ఆసంగతే యింకోలా చెప్పేడు, 'అనాగైతే దేనికిరయ్య యీ పత్రాకులన్నీ? ఏం యింటికాడ ఎచ్చగ తొంగోనేవా?' అన్నాడు విదానంగా.

'ఏం, కప్పెట్టేత్తే పనికిరాదా?'

'—మించొచ్చినప్పుడో, మరెందుకు శకితి లేనప్పుడో యేంసేసినా తప్పు కాదు. కాని కాల్పడం పే మన కులాచారం. కొన్నలాగ, కొన్నిలాగ జరగతన్నాయంటే- మరీలోజుల్లో, ఎనకట్నాగ, దేన్లోనీ 'పట్టు'నేదే.'

'ఏం కప్పెట్టేత్తే ఏటొద్దీ?'

'ఏటొద్దంటే ఏటీకాదు. పెద్దలు సెప్పడం ఆ జీవుడు పైకిపోదంటారు, దెయ్యంవౌతాడనీ, ఏడుస్తు ఇందంబడె తిరుగుతాడనీ రకరకాలుగనుకొంటారు.'

'మీకానమ్మకం గట్టిగానేవుంది— అవునా?'

సూరియ్య జవాబులేదు.

'మరి అనాటప్పుడు యీ ఒంక సూపులన్నీ దేనికీ? తిన్నగ ఆలోసించరాదా?'

దానికెవ్వరూ జవాబివ్వలేదు.

'మీక్కర్రిలే కావిలిస్తే, అదీ యీయాలప్పుడే కావిలిస్తే, అక్కర్రలెక్కడ దొరుకుతాయో, ఏ బాదానేకండ, ఎన్ని కావిలిస్తే అన్నీ ఎక్కడ దొరుకుతాయో మీకు తెల్దా?'

....

"ఇంటింటికీ ఆవులవీ, దూడలవీ కట్టుకొయ్యలుంటాయి. ఎవ్వర్ని నేప క్కర్లేదు. ఎవ్వర్నడగక్కర్లేదు. పదిళ్లు తిరిగినారా, ఇనాటిశవాళ్ని పదింటిని తగ లెయ్యొచ్చు.

"అవుసరం— నిజంగ నీకవుసరం కావాల. అప్పుడు మనిసిదేనికేనా సిద్ధ పడతాడు—

"కాదు— ఇది దొంగతనం. మాం దొంగతనం సెయ్యఁవంటారూ, పదండి పందిరి అప్పయ్య కళ్ళఁవుంది— ఒల్ల కాడుకి ఎంతో దూరంనేదు. కూతురు పెళ్లికని ఆరుబళ్ళ కర్రిలు కొట్టిచ్చి కుచ్చిలెత్తిచ్చినాడు. ఆ పెళ్ళెప్పుడో మాఘమాసంలోనో, వొయ్యాక మాసంలోనో అగుతాది. అడగండి— పొద్దుటోయేనోగా కానో, ఇంకోకాడ అడుక్కానో ఆయనకర్రిలాయనకిచ్చేవొచ్చు. ఇవ్వనఁటాడూ. ఆడ్నీ ఆడి కర్రిల్నీ కలిపి ముసిల్దాయితోపాటు కాల్సిసిరండి.

"మీకు దొంగతనఁవూ కిట్టకపోయి, దొరతనఁవూ కిట్టకపోద్దీ— పదండి. మళ్ళీ అందరఁవెల్లి నాయురాల్నేసేపి, "ఏఁవమ్మా. మాయింట్ల శవం పోగానేంది. మాఁవింతమందిమి తెల్లార్లూ పడిగాపులుండగానేంది. రేపు పేటపేటందరికీ ఓ రోజు కూలు పోతాయమ్మా! అని బతిమాల్నప్పుడుకూడా. గంట నిద్దర దండుగా, సాలువ కప్పుకొని పక్కని కూకోడఁవే అంత కష్టఁవా"అని నిలదీసి అడగండి.

"ఓరయ్య అంతపనే"— అంటే—

"అప్పుడీ జీవుడు దెయ్యం అవనానికొప్పీసుకోండి."

అని—

"ఇందల ఏదిట్టవోఁ సెప్పండి"అన్నాడు మాటావపోతే ఒప్పనన్నట్టు.

దెయ్యాని కెదురెళ్ళడఁవా— పెదల్తో కయ్యానికి సిద్ధపడ్డవా? దెయ్యఁవైనా అడో పేద ముసీలి అడముండ దెయ్యం!! పెద్దలా, అమ్మో!

అంచేత—

"ఒద్దొద్దు. అతరవాత వొచ్చీ సికాకులన్ని మనం పళ్లేఁవు. తురకల్లా కప్పెట్టరా? మనోళ్లే, కంసాల్లూ, కొంతమంది బేమ్మర్లూ పాత్తారు. కప్పెట్టేటుం. మరేం పరవానేదు"అన్నాడు ఎరకయ్య.

"ఏం అడిగితె తప్పేట్రా?"అన్నాడు ఎరకయ్య పెద్దకొడుకు— అప్పుడప్పుడే మారుతున్న మగగొంతు—

''మీరందరొల్లకండి— నువ్ సెప్పరా తాతా— నువ్వే నలబయ్యేళ్ళబట్టో, యాభైఏళ్ళబట్టో యీ కులానికంతకీ పెద్దవు. ఇంతకాలవయ్యీ యీ జనవంత— జీవుడనో, బొందనో నువ్ సెప్పిందే నమ్మి, నువ్ సెయ్యమన్నట్టే పెతీదీ సేసినారు. అన్నదమ్ములు కలిసుండడంకాణ్ణుండి, మొగుడు పెళ్లాలూ యిడిపోడంకాణ్ణుండి, అన్నీ నీసేతిమీనే జరిగినాయి. నువ్వగ్గిం దూకమన్నప్పుడు దూకి 'ఆఁ' అన్నప్పుడు ఆగిపోనారు.

''జనాన్నందర్నీ యింతకాలం ఒక్క తాటిమీద నడిపినావు. మంచిదే. ఎప్పటికేనా అనాగేవుండాల అందుసేత నువ్వేసెప్పు. కర్రలుకావాలా, అక్కర్నేదా? శవాన్ని కాలుత్తావా, కుళ్ళనిత్తావా? నువ్వే అన్నావట రేపిటిదాకా యీశవం నిలవదనీ?''

అంటూ ఆగిపోయేడు,

సూరయ్య అట్టే ఆలోచిస్తున్నట్టు కూచుండిపోయేడు. అప్పారావు ఆవేశం అతడికి చాలా యిబ్బందిగా వుంది.

''....నీకు తెల్దురయ్యా. పెద్దోడు జొరావరి సేసిందానికీ, సిన్నోడు సేసిం దానికీ తేడా వుందొరే. ఏడిమీద ఏడెక్కి వురికేత్తే ఏడిసల్లార్నాక ఏడవ్వాలసొస్తదిరా. నా నెత్తిమీద ఎన్ని ఎంటికలున్నాయో అన్ని ఎవ్వారాలు సూసినానురా—'' అంటూ తన అనుభవసారం చెప్పాలనుంది— కాని ఎందుచేతో చెప్పలేకపోతున్నాడు. అతడు మాట్లాడకపోవడాన్ని అప్పారావు సరిగానే అర్థంచేసుకున్నాడు. సర్రున వెనుతిరిగి, పది అడుగులువేసి, మళ్లా వెనక్కి తిరిగొచ్చేడు.

''ఒరేయ్ ఓరి సూరయ్య తాతా, నిన్ను తిడ్డానికి నాకు నోరురాదు. కాని తక్కిన లంజకొడుకులంత ఇనండి

''ఒందతరాలే అయిందో, రెండొందలతరాలే అయిందో, ఇంకా ఎక్కువ కాలఁవే అయిందో— ఆల్లక్కడ, మనఁవిక్కడ; ఆల్లనాగా మనమినాగా వుండడానికి కారణం సెపతాను.

''మనఁ పెవ్వారం ఎవడిమట్టుకాడు లిన్నగా సూడం. అక్కడోడో ఎవడో ఒకడొచ్చి మనకి దారి సూపాల. మన్లో సూడగల తొత్తుకొడుకెవడేనుంటే మ న్నా దే ఆల్లల్లోకలిసిపోతన్నాడు మనోల్లల్లో వున్నాల్లందరు యీజ్ఞాటోల్లే.

''ఈ— ఈడే శవంకాల్సపోవ్వతే దెయ్యవవుతాదంటాడు. కర్రిత్తెస్తువంటే జొరావరి కూడదంటాడు. రేపైనా కర్రిలెనాగ తెస్తారు? కొనడానికీవ్వాల్లో కర్రిలు కొట్టుమీస దొరుకుతాయా?

"అంచేటి? మనఁవెల్లి ఎవడిపాదాలమీనోపడి ఆడు 'సీ,పో'అంటే 'సిత్తం బాబ'ని మల్లి దయతలిసిందాక. ఆల్ల గుమ్మాలకాడ అనాగ'బాబ్బాబు, నాయన్నాయనా' అంటా బేపుల్నాగ కూకోవాల. అనాగ తప్ప ఇంకోనాగ మనక్కారిగ్లేపు.

"ఇదేకాదు. ఏపేనా అంతే. అందికే— ఆల్లెట్టినా ఎట్టకపోయినా, ఏఁవో, ఎవడికి, ఎప్పుడేటి ఇనాటి అవుసరం వస్తదో, బతికినంతకాలం కలిగినోల్లందరికి, కలగబోయీవాల్లక్కూడ ఒంగొంగి, ఒదిగొదిగి ఒంకదణ్ణాలెడ్తా ఆళ్ళెన్నన్నాపడి, ఏ పని సెప్పినా తలతోసేస్తాఁవు—

"మరాడు యజమానీ మనం ఆడికింద తొత్తులం అయినాఁవంటే ఆడిది తప్పా, యీడిదితప్పా నేపోవ్తే నీదీ, నాదా తప్పు? ఆలోసించండి"అన్నాడు.

ఎప్పుడు గందికి మొదలయిందో, ఎప్పుడు అప్పారావుగొంతు పెరిగిందో అప్పుడు జనం పోగవడం ఆరంభించేరు. ఎగువీధి, దిగువీధుల్లో మనుష్యులు పరుగెడుతూంటే తెలివొచ్చిన వాళ్ళందరూ ఎమిటో ననుకుంటూ పక్కవాళ్ళనిలేపి మరీ తీసుకొచ్చేరు. ఆ అందరిమధ్యా అప్పారావు చెపుతున్నాడు—

"ఒరేయ్, ఓరితాతా! ఇందాక నాయురాలు పుమ్మల్నేవని దెప్పిందోఎరికా?"

"అవున్రా! పంటలు కిందా మీదైతే, పన్లెక్కడా లేవమ్మా"అంటూ గింజా గిట్రికీ మాయక్కడికే పారొస్తారు; ఏ పండుగొచ్చినా పున్నఁవొచ్చినా, ఓగుడ్డ పాత బడీనా, కసింత బువ్వఎట్టపా, అని మామీనోనే ఒచ్చిపడతారు; ఎక్కడేనా యిళ్ళోగిళ్ళో కాలిపోతే కమ్మరేకులకీ మామీనే ఓల్తారు; సివరికి మీరు సచ్చినప్పుడు కర్రలూమాఁవే సపిలీసెయ్యాలిరా" అందా అమ్మ

ఆయమ్మకు దణ్ణంపెట్టాల!

ఆ యమ్మ నన్ను దెప్పినా, నాపుటకని దెప్పినా, నాకు ససిబాటురాదు. మనిసంత మనిసినై కాలూసేతులూ వున్నా నానోకుక్కనీకాను. గొడ్డునీకాను; సెట్టుమీద పిట్టకన్నా. నానన్నాయఁవని సెప్పిందాతల్లి.

ఒరేయ్, ఓర్లంజకొడుకుల్లారా! మనఁవందరఁపేటనుకుంటాఁవంటే అడుక్కు తిన్నైనస తింటాఁవుకాని, అన్నాయం నాకొద్దనుకుంటాం. ఎందుకురా, అన్నాయం ఒద్దంటే, ఒచ్చే జలమలో కుక్కనో, పందినో కాకుండ! ఇప్పుడు నీబతుకు అంత కన్న ఏటిమెరుగు?

నీకీకబురు సెప్పినోడు నీలాగ నాయంగబతుకు తన్నాడా?

ఇయ్యాలా రేపూ పేదోడెవడు? ఎవుడైతె నాయంవని, దరమంవని, ఆపెద్దోళ్ల సెప్పిన కట్టుబాట్లుకి ఒనలకంట మందంత నడిసిన మార్గాన నడుస్తాడో అతల్లపేదోడు. ఎవుడైతే నాయంవూనేదు, దరమవూనేదు, నాను పెద్దోడ్నికావడంవొక్కటే నాకు నాయంవనుకుని, పదికొంపలార్పనానికీ, పదిమంది పొట్టలు కొట్టనానికీ జంకడో, అడే యీనాడు గొప్పోడు.

మంచోడు అడుక్కుతిన్నానికీ, సెడ్డోడు రాజ్జంవేలేకాడికీ వొచ్చింది— ఆడు సూపేదారీ, మనం నడిసేదారీ.

"ఇది విన్నాగమన్నాను. ఎందుకు? అన్నాగమనంవూ కోటికి పడగెత్తనానికి కాదు. కుక్కనాగ. గొడ్డునాగ కాకన్నా కసింత మనిసినాగ బతకనానికి— అందుకూ"

అంటూ - ఆఖరిమాటగా అన్నాడు.

"ఈ శవాన్ని మీరెనాగ ఒదుల్చుకున్నా నాకొక్కటే, ఎందుకంటె

నీట్లో ఒడేసినా, నిప్పుల్లో కాల్చినా, గొయ్యితీసి పాతిపెట్టేసినా— ఏంవీనేదు. కాష్టాల్లో గాలికొదిలేసినా ఈశవం శవం నా గుండిపోదు. ఎందులసేరవల్సిది అందలో ఎనాగూ సేరిపోద్ది. జీవుదేడుత్తాడనీ నాననుకోను. సచ్చిన శవం కోసం నానేడవనూ ఏడవను.

"నా ఏడుపల్లి బతికున్న శవాలకోపం. ఎంతకాలం మీరిలా కుక్కల్లాబతుక్కు తారు? బూమ్మీద పడ్డది నగాయితూ బూవిలో కలిసిందాకా ఈకుళ్ళడవెందుకు? 'జీవుడు నరకానపడకండ' అంటారు, మరి జీవుడు నరకాని కెల్తిందంటె 'బొందికేంవాపదొస్తదో' నని మీ బెంగ.

మీకు జీవుడు మీనానేదు, బొందిమీనానేదు— నాకగపడ్డకాడికి మీకున్నదల్లి ఒక్కటే— సలి సంకటం.

"ఈ సలిసంకటం మీ ఎన్నుపూసల్లో పట్టేసి ఎంవుకలు దొలసేసి. రక్తమాం సాలంరించీసి మిమ్మల్ని బతికుండగానే శవాల్ని సేత్తాంది. తక్కిన జీవుళ్ళన్ని ఒక్కపాలేసత్తయ్. మీరు నూరేళ్ల సత్తారు. ఒక్కపాలి సావడంవంటే మీకు ఒణుకు. కసింత కసింత సవ్వడం మీకు శవాసుగుంటాది ఘొండి, అనాగే సావండి మీ బిడ్డ బిడ్డ తరసంతరానికిదే తరిపీదు యియ్యండి" అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయేడు.

మూగిన జనంవందరూ 'ఏటంటె' 'ఏటంటూ' ఘోగట్టాలారంభించేరు.

"అఁ ఏటినేదు. ముసిల్ది సచ్చిపోనాదికదా. కఱ్రలడుక్కోనానికెల్తె, నాయు రాలేటో అంది. దానిమీనిక్కడకొచ్చి. పేదోల్లంకాబట్టికదా అనాగంత మాటంది, మన పెంతకాలం పతతాఁవంటాడు అప్పారావు" అన్నారు కొందరు.

కాదు, కాదు. యింకా శానావుఁది సూరయ్యతాత నేదా. అణ్ణడిగితే కాలుద్దువనీ సెప్పడు. కప్పెడుదువనీ సెప్పడు. సందీ మందిగ గోడమీద పిల్లినాగ సెప్పినాడు. నీకేటఱియ్యా. అంత బయ్యం. తిన్నగసెప్పరాదా? కాల్సపోతే జీవుడు దెయ్యఁవైపోడా? అనాగని యీడ దెబ్బలాడతన్నాడు"అంటూ ఆడవాళ్ళకి ఆడవాళ్లూ, పిల్లలకు పిల్లలూ ఎవరికర్థఁవైనట్లు వాళ్లు చెప్పుకున్నారు.

మరికొందరు కుఱ్రోళ్లు మాత్రం బిఱ్రబిగుసుకొని ముసలాళ్లేమంటారో, ఏ నిర్ణయానికి వస్తారో చూస్తూ అలా చుట్టూ నించున్నారు.

చాలాసేపలా కూర్చుని బారికకన్నయ్య "మరేటాఱ, పెద్దోడా, ఏదో ఒకటి తెల్సీ"అన్నాడు సూరయ్యతో.

"నానేటి తేలుస్తాను. ఇప్పుడా ఎల్లినోడు ఏటన్నాడో అంత ఇన్నారుగదా, మీరేసెప్పండి. నాకేఁపనడానికీ, ఎటు సెప్పనానికీ తోసదు"అన్నాడు సూరయ్య.

"నాయురాలందనేకాదు. ఆయమ్మని నానెనకేసుకొచ్చినాను. అదీ నాఒల్ల తప్పు. ఆకోపం యీకోపం అంతా నీమీన ఒలిపినాడు. అంతేగాని, నువ్వంటె ఆడి కెప్పుడూగురే. ఇన్లేదా నిన్నొదిలి మమ్మల్నే తిట్టినాడు"అన్నాడు కన్నయ్య.

"నువ్వలాగంటావు. నన్ను తిట్టలేక మిమ్మల్ని తిట్టినాడని నాననుకున్నాను. ఏది నిజం?"అన్నాడు సూరయ్య

....నిజం సిగ్గోసిరినిజం? నిజానిజాలసంగతి ఆతరవాత చూడ్రాదా. ముఁదు ఈ శవాన్నేంచేస్తారు? అది తెలిస్తే బాగుణ్ణు— అనుకుంటున్నాడు రాజయ్య

బారికకన్నయ్య లోకంచూసినవాడు. అందుచేత అతడు ఏవేళా తల్లకిందులు కాడు. ఒక్కొక్కళ్ళనే తమ తమ అభిప్రాయాలు చెప్పమన్నాడు. పెద్దలందరిదీ ఒకటేమాట. అ శవాన్ని ఏదోఒకవిధంగా పాతిపెట్టేడఁవే మంచిదన్నారు.

"ఏఁవీ, ఈపని తొల్లాఁవునే పేస్తేకాదా? ఇప్పటిదాకా యీ జాగరాలేల?"

"అదంతే. సదుర్లో తేల్చడఁవంటే ఏటి? నువ్ గుంటడివి నీకుతెల్దు. ఇలారా."అన్నాడు చఁవత్కారసీతయ్య. పెద్దవాళ్ళెవరూ గమనించిలేదు. అరడజను మంది కుఱ్రోళ్లు ఎరకయ్యగారి జంతిలోంచి ఎటో వెళ్తున్నారు.

*   *   *

అప్పారావు కొయ్య. అతడి తండ్రి చిన్నప్పుడే పోయేడు. తల్లీ తనూ, ఆ తల్లి ఒకళ్ళజోలికి పోదు. ఒకళ్ళ శొంఠికిపోదు. తనమీదకొస్తే దేవుడికొడుకునైనా క్షమించదు.

అప్పారావుతండ్రి పోతూ పోతూ రవంత మడిచెక్క మిగిల్చేడు. దాన్నే దున్నుకుంటూ దానిమీదే కూరా నారా పండిస్తూ, ఒకచిన్న బర్రెనూ, రెండు మూడు మేకల్నీ మేపుకుంటూ ఎన్నికష్టాలొచ్చినా, యముడు వాకిట నిలబడ్డాకానీ అప్పుచెయ్యకుండా, ఆభూమి నిలుపుకుంటూ, ఆదిని తల్లీ, యిప్పుడు కొడుకూ, ఆ చిన్న సంసారాన్ని యీదుకొస్తున్నారు.

ఆ వూళ్లో బడివుందికాని అప్పారావులు చదువుకోలేరు. అతడు కొన్నాళ్ళు పశువులుకాసేడు. కొన్నాళ్ళోనాయుడుగారింట కంబారిగా వున్నాడు. మరికొన్నాళ్ళు పట్నానికి పోయి బరువులుమోసేడు.

ఇప్పుడు కూరగాయలు పండిస్తు, దొరికినప్పుడు కూలిచేస్తాడు. అతడికి పెళ్ళికాలేదు. నారెమ్మలాంటి ఆడపిల్లలెందరికో అతడిపై ఆశ. అప్పారావింకా ఆలోచిస్తున్నాడు.

* * *

తలాబేడా, పావలా చొప్పున వేసిన డబ్బులన్నీ వీరి శవానికి బొడ్డుమూట కట్టేడు దండప్పగాడు

డబ్బులు లావుగానే దొరికేయి. అప్పారావుచేసిన 'గందిక' ఎందుకు పనికొచ్చినా రాకపోయినా యిందుకు పనికొచ్చిందనుకున్నాడు దండప్పగాడు.

శవాన్నిఎత్తేవరకూ సాంవాలు మామ్మోలుగానేవుంది. ఎత్తి పాడెమీద పెడుతూవుంటే ఆమెకు దుఃఖం పొర్లుకొచ్చింది.

అది గొంతులోంచి వచ్చిందికాదు. నిలువు నిలువునా మనిషిని కుదుపుతూ వచ్చేది. ఇంకొకప్పుడైతే గొల్లుమని దాని పీడ వదిలించుకునేది. ఇప్పుడలా చేయడానికి ఆమెకు సిగ్గయింది. లోపల నట్టింటకూచుని పోలమ్మ ఏడుస్తోంది.

"ఓలెఓలె ఎర్రిదాన నీకేం మతిపోయిందే!" అంటూ ఆడవాళ్ళంతా లోపలికి పరిగెత్తేరు.

"కాల్చనానికి కర్రిలు దొరకనేదు. అదొక్కటే మెర. అది తప్పిస్తే దానికింకేవన్న నోటున్నాదా? మనవలు, మనవరాళ్లు, మునిమనవలు— ఎన్నాళ్లు బతికితె

మాతర్రం ఎప్పుడో ఒకప్పుడు ఎల్లక తప్పుతాదా— ఒత్తి మనసిపేన కావు. ఒల్లకో ఒల్లకో—"అన్నారు కొందరు.

"అందరం ఏనాటికైన అక్కడకు సేరవాలసేవాళ్ళంవే. కసింత ముందూ యెనక—"అంటూ తమని తామే వూరడించుకున్నారు కొందరు.

పడమటి చంద్రుని వెన్నెలలో పాతికమంది పాడెవెంట చెరువుగట్టుకొచ్చేరు.

గాలీ, మంచూ, ఇవే చల్లనంటే కాలికింద మెత్తని యిసక గాలికన్నా మంచుకన్నా చల్లగావుంది.

చెరువుకి మధ్యగా స్మశానం. తాడెత్తుమంచు సముద్రంకింద, ఆవల్లకాడెక్కడో అట్టడుగునుంది.

"ఎందుకింతమంది? ఇదేటి.... పగలా? దిగడండి, దిగడండి" అన్నాడు బారిక కన్నయ్య.

"అయితే మాంవుండిపోదువా?"అన్నాడు పొట్ట పాపడు.

"నువ్వురా, నువ్వూ, దండప్పిగాడూ, గటాన్ని మోసినోళ్ళూ, ముందు నడిసినోళ్ళూ, కాక మాంవో ముగ్గురుం— యీళ్ల సాలు కొందరెల్లినారు" అన్నాడు కన్నయ్య.

జనం గట్టుమీదనిలబడిపోయేరు, పాడె, పాడెతో మనుష్యులు మంచులోకి మాయమౌతున్నారు.

ఇద్దరు మనుష్యులు గునపాలతో పొడుస్తుంటె యింకో యిద్దరు పారలతో మన్ను విసురుతున్నారు. దానికి నాలుగుబారల దూరంలో మసిపారిన పాతరైటు, అ పక్కనే తల్లి శవంతో ఎరకయ్య, వాళ్ళకి కొంచెం యిటుగా పెద్దవాళ్లు ముగ్గురూ కూచున్నారు.

'అ నక్కలు సూడు. ఎనాగ సంగీతాలు పాడతన్నాయో'అన్నాడుఎరకయ్య.

దూరదూరంగా రెండుజట్ల నక్కలు ఒకటొదిత్తే ఒకటి వూళలేస్తున్నాయి.

''అందికే కంపలు. కంకల్దాక గొయ్యితీసి పాతెట్టినాక మన్ను పూడ్చాం— మూరళ్ళోతున యీ ముళ్ళకంప పరిసి దానిమీన మళ్ళా మన్ను— అప్పుడీనక్కలు పరి తప్పనేవు.''అన్నాడు కన్నయ్య.

రాజయ్య విపరీతంగాకురిసే మంచుగురించీ, తడిసిపోతున్న దుప్పట్లగురించీ చెపుతున్నాడు.

''జీవుడికి, ఎండాకాన్దే, ఓనాకాన్దే— అయితే ఆటిదెబ్బ ఎదూరుగా కనబడతాది. మంచు, సలి అనాక్కాదు. సన్నసల్లగా జీవుడిని తినేస్తాయి. సూడవా యీ శీతాకాలంవొస్తే గడ్డికాణ్ణించి ఆకూ అలవాకాణ్ణించి యినాగ మాడిపోతాది—''అంటున్నాడు సూరయ్య.

అవతల పని ఆగిపోయింది.

''ఏ'విరయ్యా ఏటో జాలంవూ?''అన్నాడు రాజయ్య.

జాలంవే, మరి. ఐదుకాయల సారా వచ్చింది. ఆటి బిరడాలింకా తియ్య లేదు.

''ఏటితవ్వుతాంవూ? సలికి ఏళ్లు కొంకర్లుపోతన్నాయి''అన్నాడు నలుగురిలో ఒకడు.

''ఏళ్ళు కొంకర్లుపోవా? సారాసీసాలెదురుగ కనబడతన్నాయి. రండి రండి మాపనీ అనాగేవుంది''అన్నాడు రాజయ్య.

గునపాలూ, పారలూ అక్కడ పారేసి చేతులకూ కాళ్ళకూ అంటిన మట్టి దులుపుకుంటూ ఆ నలుగురూ బయల్దేరేరు.

మట్టివాసన. అందులో స్మశానాల్లోని వేడి మట్టివాసన.

రాజయ్య రెండు సారాసీసాలు ముందుకి తీసేడు. కన్నయ్యలేచి లాంతరు తెచ్చేడు. నీళ్ళకుండ మధ్యకొచ్చింది. అందరూ వాటిచుట్టూచేరేరు.

"ఏంవిరయ్య రావూ?" ఎరకయ్యనుద్దేశించి అడిగేడు సూరయ్య

"నానిప్పుడుకాదు, ఇప్పుడుకాదు"అన్నాడు ఎరకయ్య.

"పోనీ ఆణ్ణోణ్ని. అందాక ఒకొక్కగిలాసే— ఆ తరవాత— అందర్రావాల, తానాలున్నాయికావా?"అన్నాడు కన్నయ్య.

తలోగ్లాసు తీసుకునేసరికి శరీరాల నంటిన చలి విరిగింది

...మరికొక్కగిలాసు. ఆ తరవాత మరి మాకొద్దునే ఓ- ఆపాటిసాలు, ఆపాటిసాలు— సలి తుక్కుదుళ్ళినట్టు దుల్లతంది- మరి బేగినెగండి. గబగబ నాలుగు పోట్లుపొడిసి నాలుగు పారలు తవ్వేత్తురా అప్పిటికి పీకనోతౌతాది. పీకనోతు ఎక్కి తొక్కి. ఏంవిరయ్యా! సరిపోదా— శానశాన. అదే అశంకం— సాలపోవ్వితె యిప్పిడే సెప్పే— మరెర్రిందుపోట్లు పొడిసేస్తాం— సేతులో పనేనా— మళ్లపోవాలా, మాన్నేలు పోవాలా? మళ్లా ఆ నక్కలొకటి ఎలా క్కా సుకూక్కసున్నాయో సూడు. ఊళ్లే పాడతన్నాయి. ఓం... ఓ ఓ ఓ ....

"తొత్తుకొడుకురికి ఏడెక్కింది" అన్నాడు రాజయ్య.

"ఎల్లండెల్లండి" అన్నాడు కన్నయ్య.

అట్టే తరమక్కర్లేకుండానే బయల్దేరేరు తప్పేవాళ్లు.

కొంతసేపు పోయేక—

"ఇందాకల్నుండి ఆ గుంటడిమాటలే నాకు సెవుల్లో గింగురుమంటున్నాయ్–" అన్నాడు సూరయ్య. ఆడేటంటాడంటే, మనకిక జొరావర్నేపోతె మనం బతకనేఁవంటాడు.

"నిజఁవే. తల్లి బూదేవత దీనిమీదుండే పొలాలు పుట్రిలు, సెట్టూ సేఁవా, గొడ్డూ గోదా— మనిసి బతకటానికేటేటైతె కావాలో, ఎన్నెన్నైతే వున్నాయో అన్నీ, ఒక్కటి మిగల్సకండ. నాదంటె నాదంటా. జోరావరితనం ఉన్నోళ్ళందరు, ఎవడి జోరకిందికి ఆడు నాగీసుకున్నాడు. ఇప్పటికీ నాగేస్తనేవున్నారు"

ఇయ్యేల ఆలు కూల్లుకి పిలిస్తె మనఁవంతా బతికినట్టు నేపోతే యీ పేదోల్లంఁత అనాఁగ బిడ్డాపాపా ముసిలీ ముడగా కలిపి, పల్లిగరగరుసుకు సవ్వవలసిందే, పేదోళ్ళ కింకోదారకంనేదు.

అయితే రాజ్జెఁవలాగుంది. దాన్ని నువ్వూనానూ మార్చగలదుఁవా? పెద్దోడు జొరావరి సేస్తేపేదోళ్ల ఆపనేరు కోరుట్లు కెల్లాల. వుంకో పెద్దోడితో సెప్పకోవాల. మనకాడ ఆ కోర్టుల్ల కెల్లనానికి డబ్బూనేదు మనమాటమీన ఎవురికీ కాతరానేదు. మనకి జొరావారీకిదిగనానికి గుండెలేనేవు సస్తంటె మరేటని దిగతాఁవనుకో. ఆ పనానికి ఆలకాడ ఎన్నుండాలో అన్నీపున్నాయి. డబ్బు, దనం, మనసులు, యింకాకావిలిస్తే పోలీసులు అన్నీను!

నాకు బాగ్గేపకం. నాకు గ్యానం వొచ్చిన్నాటికి యీవూళ్ళో బాపనా, కోఁవటీ కాపూ, కమ్మా, గొల్లా, శగిడీ, మాలా, మాదిగా, యీల్లాలనకు అందరికీతోలెఁవో, లావో పొలఁవంటా వుండేది. పండినా పండపోయినా ప్రతీ ఒకడికీ నాకేఁవనే బరోసావుండీది.

మళ్లా యీ పాతికముప్పై ఏళ్ళలో పంటలు పెరిగినాయి, పశువుల మేతకేన నేకండా బంజర్లు, పోరంబోకులు అన్నీ దున్నిసినారు. మిసీన్లు, గిసీన్లు, ఎరువులు. గిరువులు వొచ్చీచ్చినాయో సెప్పనేఁవు—

"అయితె యిన్నొచ్చినా జరిగిందేటయ్యా. జనానికి తిండినేదు. జనంవప్పుల పాలైనారు. ఎండి బంగారాలు ఎప్పుడో పోనాయి. సూజ్జాస్తుండగే గొల్లలు, శగిడీలు, మాలమాదిగ సిన్నరైతులందరు దుల్లిపోనారు. ఎవ్వరికీ సెంటుముక్క మిగ ల్నేదు. కాపోళ్లు బాగునేరు, అందల పెద్దనాయిళ్ళకీ సావుకోర్లకీ సెందిపోయింది యీ బూదేవతంతా!

మా తాత్తండ్రుల్నాడూ కరువులూ కాటకాలు వొచ్చీవిట. ఒస్తే ఆ దెబ్బ అందరికీ తగిలీదట. ఇప్పుడనాక్కాదే— కొందరి బతుకులేంవో రోజురోజుకి దిగనాసి పోతన్నాయి. ఇంకొందరు యియ్యేల బుక్కాపకీర్లు— తెల్లారి నెగిసీసరికి నచ్చాది కార్లవుతున్నారు.

ఈ కాపులనగ, పడిశాలోళ్ళనగ, కోవటిబేమ్మర్లకీ రాజులికీ ఆదినుంచీ ఉందినే, యీ ఎలట్రీసైట్లు, యీనగిసి నగిసీ దిరేసులు, వోచీలు, రేడియోలు, మోటారు బళ్లు, తెల్లారి నెగిస్తే పట్నానికి రాకపోకలు, అక్కడ రాత్రి పొగలూ జలసాలు, యియన్ని పూర్వం ఎరుగుదురా? ఆశకా సొమ్మంత ఎక్కణ్ణిండొస్తాంది; మనంపీసచ్చిన మనిసికి కరిశ్రిలేన ఏల పోగుసెయ్యలేక పోవాల?!

ఆడన్నట్టు వొందతరాలే అయ్యిందో ఏలతరాలే అయ్యిందో ఆశక్కడా మన పక్కడా వున్నావు. ఉన్నా ఆదిని పంచుకున్న బూదేవత అనాగేవుండీది. అటు కదిలి యిటు కదిలి యీ యిన్ని తరాలుగడిసినా ఎక్కడదక్కడే వుండేది.

ఈ నలభై యాభై ఏళ్ళబట్టే, అందులోనూ యీ సివర పాతికేళ్ళయే— మీన ఎక్కడేటయిందో తెలీదు, శకాశ్రిలు తిరిగినట్టు తిరగతన్నాయి జాతకాలు. ఇయ్యేళ ఉన్నోళ్లు పదిమంది రేపిటికి లేనోళ్ళు. ఇయ్యేళ జరగనోడు ఒకడు రేపిటికి మారాజు. ఒకడు నెగిసీసరికి వొందమంది; పదిమందినెగిస్తే ఏలకొద్దీరాల్తన్నారు— జనం!

ఈ పద్దతంత ఎపుడుతెచ్చినాడు— ఎప్పుడొచ్చింది?—తెనీదు— ఎందుకు తెచ్చి నారు, ఎలాగ నడపతన్నారు తెనీదు.

"ఈ పద్దతికి పెద్దలేసినగట్లు గోడలన్ని తెగిపోతన్నాయి, తెగిపోవడం మంచా సెబ్బరా? ఎవిరికి మంచి ఎవరికి సెబ్బర? అదలాగుండగ మళ్లా కొత్తగోడలు, కొత్తగట్లు నెగుస్తున్నాయి— యియి దేనికి?

"ఈ కొత్తకి తగినట్టు నడవడం జనానికి తెలవాల. అదెనాగో ఆతెచ్చినోలకి తెల్సు. మనకి తెల్దంనేదు,

"పెద్దోడి జోరావరీ ఆ తేడంకాడా, నడపడంకాడా వుంది. అది మన కంటికి కనబడదు, అది సూణ్ణానికి మనకంతపాటి గడుస్తనంనేదు.

"అయితే అన్నేయ్యం కొనదాకా సాగుతాదా– అడ్డపోతే? సాగదనే అనుకుంటాను–" సూరయ్యకళ్లు జవాబుదగ్గిరకొచ్చేసరికి మూసుకుపోయేయి. కొంచెంసేపు మగతగా ఆలోచించి అన్నాడు.

మన తాతతండ్రులసీవోరు– ఎవడిమట్టుకాడు నాయంగ దరమంగ నడిస్తే ఏడెలాగజరగాలో ఆ బగమంతుడే అన్నీ సూస్తాడని. నాకిప్పటికీ ఆ మాట నమ్మాలనే వుంటాది. కాని అట్టే సూస్తే ఆడున్నాడో నేడో? ఆడుంటేగదా అన్నీ సర్దనానికి, ఉంటే యీ అచ్చాచారవంత ఏటి? మనిస్సచ్చిపోయినప్పుడు సిన్నపిల్లలికి పెద్దోళం మాయికబుర్లు సెపతాం సూసినా– అనాగ యీ తెలిసినోళ్ళు మనకూరుకోపెట్టనానికి అణ్ణొకణ్ణి సూపుతున్నారేఁవో, ఆడునేడే నేడేఁవో– అనిపిస్తాది,

"ఇంకోపాలి– ఆడున్నాడు, ఏదానికైన పాపం పండాలిగదా, దానికోసం ఆడలాగ సూస్తున్నాడనిపిస్తాది.

"మొత్తానికి ఆడున్నాడో నేడో! ఆడున్నాడని పెద్దలు దేనికన్నారో! ఇనాగ నాకు బతుకంతా అనుమానఁవే!" అన్నాడు సూరయ్య.

దేవుడికాడికొచ్చేసరికి కన్నయ్యకి తెలివొచ్చింది–

"ఆఁ.... అనాక్కాదనాక్కాదు –" అంటూ నోట్లో పొగాకు రసం వూసి కసింత ముందుకుజరిగి చెపుతున్నాడు.

"పెద్దలేటంటారంటే కాలం సందీ మంది కొచ్చినపుడల్లా ఆడున్నాడా లేదా అన్నకాడికొస్తాదట. అనాటప్పుడు ఆడింకమీద నుండట్ట బూమ్మీనకే దిగతాట్ట

అయితెనాగ? ఆ శంకూ శక్రం గదాగిదా యియ్యేటుండవు. దేవుణ్ణాగరాడు. మనిసినాగ, మనిసికడుపున పుట్టే, మనిసి సెయ్యగలిగినపన్లే సేస్తాడంట మరలాగ ఆడొచ్చినప్పుడు ఆడెంటసావుకూడా బూమ్మీనకొస్తాదట.

ఇప్పుడు మన ముసిలి కరనం నేదా– ఆయనకో బాప్మరదుండోడు ఒకపాలి కరనమింటికొచ్చినారు,

తగువేడో అయితుంటె రైతులూ మాఁవూ అందరం కరనంగారిక్కడ పందిట్లో కూకున్నాఁవు, సగంకానిచ్చి ఆలుబోజనానికి నెగిసినారు. బోజనాలైనాక బావ

మరుదులు లోపలేటో మాటాడుతుంటె, పంతులు యీతలకొచ్చినాడు. ఏటీ తగువు దేనిగురించంటె ఎవరో బాగార్ల తగువని సెప్పినారు.

అత తగువూ, బూఁవి తగువూ, మాకానివంటూ పంతులు కొన్ని కతలు సెప్పినారు.

రావణాబ్బెమ్మటా గొప్ప దైవబక్తుట్ట. ఉదయం నెగిసినాక కోటిలింగాలికి బంగారప్పువ్వులెట్టి పూజ్జేసీవోడు.

అయితేటీ సీతా అమ్మవోర్ని దొంగిలాడినాడు.

సీతంటెయేటి? బూదేవికూతురు; నాగేటిసాల్లో పుట్టింది; తల్లి లచ్చిఁవీదేవి. ఆయమ్మని యిడిపించనానికి ఎందరెన్ని రకాలుగా సెప్పినా ఆ రావణాబ్బెమ్మయిన్లేదట. ఆడి పదిసిరసులూ నేలమీన దుల్లిందాక ఆడు సీత నొగ్గనేదుట.

అనాగే పాండవుల్దీ ఆళ్ళ బాగార్లదీ రాజ్జింకాడ తగువు.

అప్పుడు కిష్ణావతారఁ వెత్తి ఆ బగమంతుడే సాయాంగెళ్ళి నానింతోణ్ణి సెపుతున్నానినుకోండా9, అంటూ తన అవతారాలన్నీ సూపినాడు. ఐతె యిన్నారా నెత్తు ఉేళ్ల పార్నాయిట.

మంచిగ సెపితే మనిసి యినుకోడు— అన్దానికి ఆయన ఆ కతలన్నీ సెపతన్నాడు. ఇంతలో కరనంగారి బామ్మరిదినేడా ఆయన దిగినాడు. ఆయనకి పట్నంలో వుద్యోగం. పెద్ద సదువులే సదివినాడు.

రాఁవుడూ దేఁవుడు కాడు, కిష్ణుడూ దేవుడుకాడు ఆలూ మన్నాటిమనసులే. మంచికోసం పాటడ్డారు కామట్టి దేవుళ్ళన్నారు. పురాణాలన్నీ కతలే అంటాడు ఆయిన.

మనసులు. మంచికోసం పాటడీనోళ్లు. ఎంతమంది నేరు అందర్ని దేవుడన్నారా ఎవుడైతె దరమం నిలపనానికి అన్నీ ఒగ్గేసి అడ్డొచ్చినోణ్ణవణ్నైనా సంపనానికి జంకడో ఆణ్ణె దేవుడంటారు— ఎందుకు? ఆళ్లో దేవుడుంటేగాని అంతపని సెయ్యనేడు. అందుకు! అంటాడు పంతులు.

దానిమీద యిద్దరికీ పెద్ద వోదనయ్యింది. సివరికి పంతులే నెగ్గినాడు. నెగ్గీ సివార్న అన్నాడు

ఈ కలికాలంలోనా బగమంతుడు అవుతారం ఎత్తుతాట్ట. ఐతె యీ పాలి ఆ బాణాలు గీణాలు, ఆ శకార్లిలు గికార్లిలు అన్నీ ఒగ్గేసి కత్తొట్టుకు నెగుస్తాట. నెగసి

యినాగ ఊరుదు ఎళ్ళి; ఎనాగ? గుర్రిం మీన; యీ పాపాలు సేసినోళ్ళందర్నీ నరికి పోగులెడతాట్ట.

ఇప్పట్నాకో అనుమానఁవు. ఈ కత సెప్పి శానాకాలవయ్యింది. అప్పటికీ యిమానాలు గిమానాలు యీ బాంబులు యియ్యన్ని యిన్ని నేవు. ఇప్పుడివన్ని ఒచ్చి నాయి కదా? ఎంత దేవుడైతేమాత్రిం యీ యిన్నిటితో సాలగల్డా? సాల్నెపోతే ఏటి సేస్తాడు?"

ఈ ప్రశ్న వేసి ఆగేడు.

ఎవ్వరూ జవాబివ్వకపోయేసరికి తనే చెప్పేడు.

అప్పుడు ప్రళయంతేవాల. అది తేవడంతప్ప ఆదికింకో దారినేదు. దాని కాడ తుపాకులు గిపాకులు బాంబులు ఇమానాలు యియ్యేయీ ఆగవు. అది జొరావరి లన్నిట్లోనీ పెద్ద జొరావరి. దానికి తిరుగునేదు.

అదొస్తె అప్పుడెనాగుంటాది ఎరికా? ఈ మేడలూ నేవు, ఈ మిద్దిలూ నేవు. ఈ గట్టులూవుండవు, యీ పుట్టలూవుండవు. అప్పుడున్నవ్వు పెద్దాకాదు, నాను సిన్నా కాను. అంతా మూలమట్టఁపైపోయి నున్నగ సమానంగ అయిపోతాఁవు.

అది రావాల. అదొస్తేనే మెరుగు.

అయితె! అది రావడఁపెలాగొస్తాదొ ఎరికా?—

మాట పూర్తి కాకుండానే "ఏట్రియ్యా!"అంటూ తుళ్ళిపడ్డాడు కన్నయ్య.

దుభీమని ఆకాశంలోంచి వూడిపడ్డట్టు ఓకట్టెలమోపు అతడిముందు పడింది.

తుళ్ళిపడి తలెత్తితె— రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు కట్టెల మోపులు ఒకదానితర్వాత ఒకటిగా నేలనుపడి, ఆ అదుటుకి కట్లు తెంచుకు చెదురుతున్నాయి.

చిక్కని పొగమంచు— వెన్నెల్లో, అవితెచ్చిన కుర్రాళ్లు చుమ్మగుడ్డలు దులుపుకుంటూ మెడలు సవరించుకుంటున్నారు.

"ఏట్రియ్యా?"

"ఏట్రిది?"

"ఎక్కడివిరా?"

"దొంగతనఁవేసినాం! ఎక్కడివైతే నీకేఁవి? నీపని కానీరాదా?" అన్నాడు ముందున్న ఎరకయ్య పెదకొడుకు ఆవేశంతోనూ ఆయాసంతోనూ. అతడు ఘూపోస్తున్నాడు.

ఆవెంట ఇంకో పదిమంది దిగేరు.

"సరిపోతాయిర దద్దా!"అన్నాడొకడు కర్రిలకేసి చూస్తూ.

గొయ్య తవ్వుతున్నవాళ్ళతోసహా అందరూ అప్పటికి కట్టెలచుట్టూమూగేరు.

"సరిపోతాయా? తెమ్మంటె ఇంకా తెస్తాం బోల్డు!"అన్నాడు ఇంకొకడు. పెద్దలందరూ ఎక్కినకైపులు దిగిపోతుండగా అటు ఎండుకట్టెలు వంకా ఇటు కుర్రకారు వంకా అయోమయంగా చూస్తున్నారు.

"ఏవిరయ్యా నిండా తాగినారు కావాల. తాగినప్పుడైనా మీకు దైర్యాలు పాలవా."అన్నాడు మందలో ఒకడు.

"కాదుకాదు. ఆలోసిస్తన్నారు ఆలోసించనీ ఆలోసించనీ"అన్నాడుఇంకొకడు ఆలోసనా లేదు పాలోసనాలేదు. శవాన్ని అందలేసి కాలుస్తురో నేపోవ్తే అల్లనే కాల్సీమన్నారో అడగండి"అంది వెనకనుంచి ఓ గొంతు.

రాజయ్య అదిరిపడ్డాడు "ఎవుడ్రా తొత్తుకొడుకు?"అన్నాడు కోపంగా.

"అదిగద్దిర మాంవా! పౌరుసమంటే అనాగుండాల శబాస్!"అన్నాడు చమ త్కారి సీతయ్య—

"నీవోడిమీదకైతే నీ కర్రినిగుడుతాది. అత్తలోడే అ మాటంటే 'బాబ్బాబు, నీకెందుకంత సెంవ? నానే కర్రిలు పేర్సీసుకుని నానిప్పునానే అంటించుకుంటాను, కోప్పడకంటావు. గాంధీబాబు మరెక్కడికీ పోనేదు. ఎన్నాళ్ళయినా మన్ని పట్టుకొని ఒగ్గడు. నాకు నచ్చినాప్"అన్నాడు సీతయ్య.

సూరయ్యకు పరిస్థితి అర్థంవైపోయింది.

"ఏడీ అడేడి? అప్పారావు రానేదా?"అన్నాడు దగ్గరేవున్న ఓ కుర్రాడితో.

"ఇక్కడికైతే ఆడు రానన్నాడు. అప్పుడు మాంవే బైలెల్లినాం" అన్నాడు ఎరకయ్య పెద్దకొడుకు.

"బాబ్బాబు, నామాటినండ్రి. కాల్సినా పాతినా ఒకటేనాణ్రి?...." ఇంకా మాట పూర్తి చెయ్యలేదు ఎరకయ్య.

"అందుకే కాల్సమంటన్నారణ్రియ్యా. నీకు పాతడంవే యిష్టంవైతే అరో జొచ్చినపుడు నిన్నలాగే పాతెత్తాంనే. మా నాయనమ్మని ఈపాలిక్కాల్సీ" అన్నాడు ఎరకయ్య పెద్దకొడుకు—

'వాళ్ల ధోరణి విపరీతంగావుంది. అంతగా ఐతే నాయుళ్ళకి నచ్చజెప్పడఁవే సులభంలాగుంది. కాళ్ళావేళ్ళాబడి, తప్పైపోయిందంటే, అట్ల కాదన్రు'— సిగ్గుపడు తూనే సూరయ్య మనసులో యీ మాట అనుకున్నాడు—

తర్వాత యింకో అరగంటకి చిటచిట పటపట పెళపెళమంటూ భుగభుగల్తో మంటలు పైకిలేచేయి. చిక్కి చచ్చిన ముసిల్దాని శవాన్ని చితిమీద మంటలు గబగబా చుట్టుముడుతున్నాయి ఆ మంటలుచూసి అటు కంపకి వెళ్లినవాళ్లూ యిటు మాలపేట నుండి కొందరూ పరుగెత్తుకొస్తున్నారు.

సగంగొయ్యి తవ్వి ఆపిన మనుషులికి ఓకుర్రాడు, ఆ కఱ్రలకోసం వాళ్లెలా బయల్దేరేరో చెప్తున్నాడు.

అప్పుడే రెండోసారి చెర్లో మునిగొచ్చిన ఎరకయ్య తడితలతో తడిగుడ్డతో వచ్చి తల్లికాష్టం వద్దనించున్నాడు తక్కినవాళ్లు అటూ ఇటూజరిగి అతనికి చోటిచ్చేరు. ఎర్రని మంటల వెలుగు అతనిమీదా ముఖంమీదా ప్రతిఫలిస్తోంది.

అతడి ముఖంమీద ఎప్పుడూ, ఏంజరిగినా, కనిపించని ఒక ఆనందం వెల్లి విరుస్తోంది. అతనిలో నలుపంతా చెదిరి అతనివెనక నీడగా పడబోతోంది. మంటలు ఆ నీడనికూడా చెల్లా చెదురు చేస్తున్నాయి.

చలికి వజ వజ వణికే ఎరకయ్యకెవరో సారా గ్లాసు అందించబోయేరు— "నాసలి నన్నొగ్గి ఎక్కడికో పారిపోనాది. బైటికొనుకుతున్నానుకాని నాలోపట సలెక్కడ నేదు. సారా నాకోద్దు. నానీయేల సారా తాగను. ఎవర్నేనా తాగీమను'' అన్నాడు ఉషారుగా.

తల్లికాష్టం మంటల్తో ఒళ్లు కొంచెం వేడెక్కితే ఆ తరవాత చెపుతున్నాడు,

నా కొకడికీ, నాసినకొడుకున్నాడే— ఆడికొకడికీ, మాయమ్మకొకత్తికీ, ఈ సీతాకాలం పేరుసెపితే మాసెడ్డ బయం. ఈ సీతాకాలఁవన్నాళ్ళూ మాం ముగ్గురుం పెందిలి నెగిసింది లగాయితు అనాగ ఎండలోనే తారట్లాడతాం. పొద్దుపోతందఁటె మా ముగ్గురికీ దడ. మంచుకురిసిన రాత్రియితె మరీ నిద్దరట్టదు తెల్లారూ— యీ సలీ సీక ఎప్పటికి పోతాయి, ఎర్రిగా పొద్దెప్పుడు పొడుస్తాది. ఎప్పుడెండలో సేరిపోతామనే వుంటాది. ఇదిగినాటి రాత్తిరొస్తే నానూ నా సిన్నకొడుకూ మా యమ్మా ఒక పది పన్నెండు పరాయాలయినా మద్దెమద్దెన్నెగుస్తుంటాం.

"అనాటప్పుడు ఒక్కోపాలి మాయమ్మనీది 'అయ్యా నానెప్పుడేనా యీ సలికే సచ్చిపోతాన్రా. ఈ సలిసంకటంతోనే సచ్చిపోతాను. సీతాకాలం కఱ్ఱలెక్కడ

దొరకవు. కర్రల్దొరకవని కప్పెట్టేకిమి— ఎక్కడేన కానో, అడుక్కునో, సివరికి దొంగతనఁవేనాసరే, నన్ను కాల్సెయ్యాల. బండెడు కర్రిత్తెచ్చి కాల్సి. నా యిన్నాళ్ళ సలీ కాష్టమ్మీనైన కాలిపోవాల"అనీది మాయమ్మ.

అందుకే కప్పెట్టేద వంటె. నాకామాటలు గుర్తుకొచ్చి ఆటుపోనేను. ఇటు రానేను. అనాగ నాలోనేనే కుల్లిపోతన్నాను.

ఇప్పుణ్ణా కొడుకున్నాడు— ఆడు నాకన్న శానా మెరుగు. ఆసలీకాలపు కుర్రోళ్ళే మెరుగు.

తరవాత ఏటన్నాకానీ యిప్పిడీ కర్రిలు తెచ్చినారా— ముండీశవాన్ని కాల్చ డఁవైపోనాది. నేపోతె నాను బతికున్నంతకాలం కుల్లుతునేవుందును. బైటికి అన్లేను. అయినా కుల్లుతాను.

"రేపు పెదనాయుడు పిలిపిస్తె నానామాటె సెపుతాను. అయ్యా మరింక మించొచ్చింది. ఇదిగిలాగ, మాయమ్మ అనీది. అందుకని నాన్నే యీర్ని బతిమి లాణ్ణాను. ఆ గుంటలేఁవెరగరు. అది తప్పేఅయితె, ఆ తప్పునాది. ఆన్నేటనకండి. తన్నాలంటె నన్ను తన్నండంతాను. అంతేకాని గుంటల్నప్పగిస్తాఁవేటి? ఏఁవిరయ్యా?" అన్నాడు కన్నయ్యతో.

వెర్రివాడు ఎరకయ్య. అతడి వెర్రితనం నవ్వు తెప్పించాలి.

"దేవుడన్నాడొకడుంటె యీళ్ళసేసినపనికి ఆడు నిజంగ మెచ్చాల. మెచ్చ పోతె ఆడు దేవుడుకాడు. నాన్సెప్పుతున్నాను కానా ఆడు మెచ్చుతాడు"అంటున్నాడు ఎరకయ్య.

కురాళ్ళకామాటలు చిరాకూ జాలీ కలిగిస్తున్నాయి. ఆందులో ఒకడు—

"ఒరే ఓరే దద్ద, ఇంక నువ్వాపు. మాఁవుసేసింది నువ్వో నీ దేవుడో మెచ్చుతారనికాదు. అది నాయఁవని తోసింది. ఆపని సేసినాం. అంతే" అన్నాడు వెనకనుండి— అని.

"కన్నయ్యమాఁవా, మాట్టాడు"అన్నాడు కవ్వింపుగా.

కర్రిలొచ్చినదగ్గర్నుండి కన్నయ్య మనసు ఆఁవుతిన్నపసరంలా కదుల్తోంది. ఆ తొత్తుకొడుకు చెపితే గుంటలు చెయ్యడం చేసేడు. రేప్పొద్దున్న దీనిగురించి ఏమొచ్చినా ముందు తనపీకమీదికొస్తుంది. ఏదానికీ ముందు నాయుడు తననే అడుగుతాడు.

తెలిసిన నిజం— చెబితే ఒక తప్పు. చెప్పకపోతే ఒక తప్పు. అంతా తన పీకమీద కొచ్చింది. ఇదంతా సేసినోడు ఆడు— మనసులో కుళ్ళుతున్నాడు కన్నయ్య.

గోతులు తవ్వేవాళ్ళెప్పుడూ మాట్లాడరు.

అదిగ్రహించి కుర్రాళ్ళలో ఒకడన్నాడు.

ఓరేయ్ ఓరి దద్దా. మాఁవేం ఇదిరగస్పెంగ సెయ్యడంనేదురా. దొంగపన్లు సేసీవోల్లకే ఒదుగు— రగస్పెంగ ఎవరికంటా పడకండ సేస్తారు. మాఁవేంసేసిన పబ్లిగ్గసేస్తాం. నాయం సెయ్యనానికీ. మంచిపనిసెయ్యనానికీ దొంగతనం దేనికి?—

బతికున్న మనిసైతే నీదీ నాదీ. సచ్చినశవం— ఇది అందరిదీను. అందికే బతికినంతకాలం ఎవ్వరు పలకరించకపోయినా సచ్చిన శవాన్నెత్తడానికి పగవోడుకూడ రావాల.

దీనిక్కర్రిలు కావాల. అవాక్కాడున్నాయి. నిన్నా, నిన్నా అందర్నడిగినాం. మీరెవ్వరివ్వనేదు. మాఁవవసరానికి అట్నె తెచ్చినం.

అయితే జొరావరేటీ? జులుంకు మందు జొరావరీ.

ఈ కర్రలు పందిరి అప్పయ్యగారి బాబుగారిసొమ్మా— అయితే ఎలాగైనాయి? అయన్ది కంటిక్కనపడనిదో తెరిపి!

కూతురి పెళ్ళిపేరుసెప్పి, సిననాయుడికి తాను ఊరకాణ్ణని, పెదనాయుణ్ణి అడిగి రెండూ, అడక్కొకటీ, అదిగాదా, ఈ సెరువుగట్టునే అల్లాకాడ తుమ్మమోళ్లు— మూడు కొట్టించినాడు. అదెవ్వడిసొమ్ము? ఊరందరిదీను.

ఆ కొట్టడఁపైన తను కొట్టినాడా? అడిగో ఆసిన్నసీరిగోడూ అడిబామ్మరది బోడిగాడూ కొట్టినారు. దమ్మిడీ కూల్నేదు. కంబార్లుకాబట్టి ఎట్టి సాకిరే.

''మరా కర్రిలమీన అయనకున్న అతికారమేటి? మనకి లేన్దేటి? నాయుడిచ్చిన అతికారఁవేనా? ఇయ్యనానికి ఆయనెవరు? దానికీ ఏవో రూల్సుంటాయి— అవన్నీ సూసే ఇచ్చినాడా? రమ్మను. ఆరూల్సే టోసెప్తే, ఆయన అవి సూణ్ణేదని నానూ సూపుతాను''అంటూ ఆకుర్రాడు తమ పనిని సమర్థిస్తున్నాడు,

ఇంకొకడు అతణ్ణి ఆపి ఒక్కమాటలో తేల్చేసేడు,

"ఓరయ్య. వాదన్లొద్దు పన్లు సెయ్యడం ఇష్టంలేనప్పుడే తర్కాలొస్తయి. మనకది మంచిపనని తోసింది, సేసేసినాం. 'కాదదిసెడ్డ, అది సేసినందుకు మీపని పడతాం'అంటూ ఆళ్ళొస్తారూ రానీ— ఆళ్ళపని మనఁవూపడతాం. ఇయ్యేళ నిండి

యిదేనెక్క. ఒకపనిసేస్తే నాయుడేటంటాడో, కరణంవేటంటాడో బారికేటంటాడోకాదు మంచిపనా, సెడ్డపనా? మంచిదయితే సేసెయ్, దేవుడుకాదు, దేవుణ్ణిపుట్టించిన జేజెమ్మైనా దెబ్బలాడు. అదీ మన పద్దతి. పదండి పదండి ఒక్కనుకేన తీస్తేకాని, రేపు తెల్లారి పన్లోకెల్లలేం. పదండి'' అంటూ ఒక్కొక్కళ్ళనే కదిలించుకుపోతున్నాడు.

వాళ్లు పది పదిహేను బారలు వెళ్లేసరికి గొంతుల వినికిడేకాని మంచులో మనుషులు కనిపించరు.

చితిమీదికెక్కించిన శవం కాలకపోతుందా? అయినా అది విధాయకం, కాబట్టీ— దానితో వాళ్ళ అనుబంధాలు అంతకన్నా దగ్గరవి కాబట్టీ పెద్దలు కొనవరకూ దానిని వదిలిపెట్టలేరు— తెల్లవార్లూ స్మశానంలోనే వుండి తెలతెల్లవారుతుంటే యిళ్ళ కొచ్చేరు.

ముసిల్ది నిన్నపోయింది. మనిషి నిన్నపోతే యివాల్టికి రెండు, కాని సంధి కాలంలో అలా అనిపించదు నిన్నానేడూ అంతా ఒక్కలాగే వుంటుంది. ముసలాళ్ళ పని అలాగే వుంది.

ఏకరువు

— యస్. యస్. ప్రకాశరావు.

రావుగాడు నా పీకల మీదికి గొప్పగా తయారయేడు. నేను సాహితీరంగ ప్రవేశంచేసి పదేళ్ళే అయింది. కాని (ఈ స్వల్పకాలంలోనే) నేను యిప్పటికి ఇరవై మూడు నవలలూ, ఐదొందల నలభైరెండు కథలూ, పదహారు నాటకాలూ రాసేను. రావుగాడుకూడా యించుమించు యీ పదేళ్లాయి రాస్తున్నా, వాడిప్పటికి ఒక్క నవలా రాయలేదు. కథలు మాత్రం ఓ ముప్ఫయి రాసుంటాడు. అందుకని, వాడికి నేనంటే చెడ్డ జెలసీ

అవును. నాఅదృష్టం బావుంది; కాబట్టి నేనేదిరాసినా అచ్చవుతూనే వుంది, వాణ్ణెవడు రాసుకోవద్దన్నాడూ? వాడి చేతకాని తనానికి నామీద ఆడిపోసుకోడం దేనికీ?

సాహిత్యానికి ప్రయోజనం వుండాలి- అంటాడు రావు. అవున్నేనుమాత్రం కాదన్నానా? సాహిత్యం పాఠకుడికి సంతోషాన్ని కలిగించాలి; గిలిగింతలు పెట్టాలి; అయ్యో! అనిపించాలి; ఒక మనోహరమైన లోకంలోకి తీసుకు పోవాలి— ఇవన్నీ నాకూ వున్నాయి. కాని రావుగాడు మాత్రం వుడుకు మోత్తనంకొద్దీ, సాహిత్యంగురించి నాకున్న భావాలన్నీ సరైనవి కావు అంటూ వుంటాడు. ఇంతకీ రావుగాడికి సాహిత్యాన్ని గురించిన వుద్దేశాలు ఏఁవిటో తెలుసా? సాహిత్యం జీవితానుభవాన్ని కాచి, వడబొయ్యాలిట. (ఈ కాచడం ఏఁవిఁటో, వడబొయ్యడం ఏఁవిటో నాకు అర్థఁ కాలేదు. అమాటే వాడితో అంటే. అది నాకూ, 'నాలాంటి'వాళ్ళకీ చచ్చినా అర్థంకాదన్నాడు. చూసేరా, ఎలా తప్పించుకున్నాడో?) సరే, సాహిత్యం జీవితాన్ని విమర్శించాలి-అనేవాడు. లోకంలో జరుగుతున్న అన్యాయాల్ని బట్టబయలు చెయ్యాలి— అనేవాడు.

అయితే, వాడలా పేల్తోవుంటే నేను వూరుకోలేదు. అప్పుడప్పుడు గట్టిగా తగులుకునీవాణ్ని.

లోకంలో ఏవోకొన్ని అన్యాయాలు జరుగుతున్నాయి— అని మీరూ, నేనూ అంతా వొప్పుకుంటాం. అసలు గట్టిగా చెప్పాలంటే పూర్వం వేదకాలంలో కూడా అన్యాయాలు జరిగీవిట. మరంచేత. అన్యాయాలు జరగని దెప్పుడూ? అయినా ఇది కలికాలం కదా! కలి తన మహత్యం చూపిస్తూనే వుంటాడుకదా! ఇహనిప్పుడు యీ రావుగాడూ, 'వీడిలాంటి'వాళ్ళూ బయల్దేరి అన్యాయ్యాల్ని చీల్చి చెండాడితే మాత్రం కలి మహత్యం ఆపగలరా ఏఁవిఁటి— వీళ్ళమొహం!

కాకపోయినా; ప్రజలందరికీ అన్యాయాలు జరుగుతున్నట్లు తెలుసు. అలాగని వాళ్ళంతా ఆత్మహత్యలు చేసేసుకుంటున్నారా? ఏదో కలో గంజో తాగి, బతికి బట్టకడుతున్నారా, లేదా? అలాంటప్పుడు అసలే బాధల్లోమునిగి తేల్తున్న వాళ్ళకి మళ్ళీ వాళ్ళ బాధలు, కష్టాలు, వీటిగురించే కథలు చదవండంవల్ల ప్రయోజనం ఏఁవిఁటుంది? హాయిగా— ప్రకృతిశోభ; స్త్రీసౌందర్యం; ప్రేమా; ఆత్మవికాసం—వీటినిగురించి రాస్తే, పాపం వాళ్లు అది చదువుకునీ కొంచెం సేపైనా, వాళ్ళ కష్టాల్ని మర్చిపోగలుగుతారు. నేను ఇదే రావుగాడితో చెబితే,—

'ఒరే! ఇలాంటి సాహిత్యం సృష్టించి ప్రజలకి మీరెంతహాని చేస్తున్నారో కూడా మీకు తెలియదురా!.... బాధలు పడుతున్నవాళ్ళని జో కొట్టడం వల్ల, నువ్వు సాయం చేస్తున్నది బాధలు పెట్టేవాళ్ళకి తప్ప మరొకళ్ళకి కాదురా!'అన్నాడు వాడు.

అయ్యా! నాకు తెలీకడుగుతాను ఏఁవిఁటండీ మా రచనలవల్ల కలిగేహాని? పే....ద్దవాడికేదో తెలిసినట్టు చెప్తాడు! పాఠకులేవఁన్నా గొర్రెవెధవలా, (పద ప్రయోగానికి క్షమించాలి) రచయిత లేదిచెప్తే అది విండానికి? వాళ్ళకి నా రచనలు నచ్చేయి గనక నా నవలలు మూడో ముద్రణకికూడా వెళ్తున్నాయి. పాఠకులకి తెలీదూ, వాళ్ళకేం కావాలో? మఁలాంటప్పుడు, వాళ్ళకి కావల్సిందేదో నేనూ, 'నాలాంటి వాళ్ళూ' రాస్తున్నాం. అదివాళ్లు అభిమానిస్తున్నారు. మధ్య ఈ రావుగాడికెందుకూ ఏడుపు?

రావుగాడికి నామీద ఎంత కసీ, కార్పణ్యం వున్నాయో చెప్పడానికి మచ్చుకి ఒక్క వుదాహరణ చాలు. వాడోసారి నాతో, 'ఒరే, నీకు తెలిసిన విషయాలగురించి రాయడం మానీసి, తెలీని వాటిగురించి ఎందుకురా రాస్తావూ?' అన్నాడు.

అమ్మ నాయినా! కడుపులో ఎంతవిషం వుందిరా నీకు?! నువ్వు కొంపల్తీసే కొరివ్విరా బాబూ! అనుకున్నాన్నేను.

ఎందుకంటే ఓసారి, రావుగాడు వాళ్ళ ఆఫీసరు ఏవోలంచాలు పుచ్చుకుంటున్నాడని తెలిసి, పేర్లూ గట్రా మార్చి, ఆ ఆఫీసరుమీద కథ రాసీసేడు. ఆ తరవాత దాన్ని గురించి పెద్ద తగువైపోయింది. వాణ్ణి వుద్యోగంలోంచి తీసేస్తారేమోనని మేఁవంతా హడిలి చచ్చేం కూడాను. కాని, పాపం, ఆ ఆఫీసరెవడో మంచివాడు, వీడికి ప్రమోషను మాత్రం రాకుండాచేసి, మొత్తం మీద వుద్యోగం వూడిపోకుండాచేసేడు.

ఇంకోసారి రావుగాడు వాళ్ళదగ్గిర బంధువేనట, ఎవరో ఏదో వెధవపని చేసేట్ట. అందుగురించి వీడు ఆయన మీద ఓ కథ బరికేడు. దాంతో, ఆ బంధువు వీళ్ళింటికి రాఁపోకలు మానుకున్నాడు.

నేనూ వాడిలాగే మా ఆఫీసర్లమీదా: బంధువులమీదా కథలు రాసేస్తే, నా బతుకూ వాడిలాగే అయిపోతే చూసి సంతోషిద్దామని వెధవ విషపు కోరిక!

నేనెందుకు రాస్తాను? రాయను. మనకి భగవంతుడు ఇచ్చిన ఈ శక్తిని— మనకి అయిన వాళ్ళమీదా, కావల్సిన వాళ్ళమీదా కథలు బరకడానికిటండీ?

ఇలాంటివాడితో వాదించి మాత్రం ప్రయోజనం ఏఁవుంది? అందుకే నేను ఇలాంటి వుడుకుమోతు వెధవల మాటల్ని కేర్ చెయ్యడం మానీసేను, కాని నక్షత్రకుడిలా వాడూరుకుంటాడా? నాదేదైనా రచన పడగానే మా ఇంటికివచ్చి మరీ నన్ను విమర్శిస్తాడు.

ఓసారి వాడికీ నాకూ 'అంకితాల'గురించి పెద్ద తగువయిపోయింది.

"అంకితం ఇస్తున్నానంటున్నావు: ఏఁవిఁటి దీనివల్ల నువ్వు సాధించేది? నానా చెత్తా చెదారం రాసేసి వెంకట్రఁవణమూర్తికి అంకితం యిచ్చేస్తావు. నోరులేని దేఁవుడు కాబట్టి సరిపోయిందికాని, అదే నోరున్నవాడైతేనా?....'నీ కంపుసాహిత్యాన్ని అంకితం పుచ్చుకుందికి నా ఖర్మేంకాలిపోలేదు పోపో?'అనుండును"అన్నాడురావుగాడు.

నాకు మా చెడ్డ కోపం వచ్చింది. వాడు నాస్తికుడు. అంచేత ఏమైఁనా వాగుతాడు. దానికో అర్థం పర్థం వుండదు. అసలు నేను పోటీలకి పంపించిన నవలల్ని వేంకటేశ్వర స్వామికి అంకిత మిస్తానని మొక్కుకున్నాను.అవును నేను ఆస్తికుణ్ణి. నా నమ్మకాలు నావి. నాకు నవలల పోటీలో వచ్చిన డబ్బులో సగం తిరపతి హుండిలోనే వేసేను. అందుకే, ఆ స్వామికి అంకితం ఇచ్చేను. మరోసారి బాబా గారికి మొక్కుకుని నా నవలని పోటీకి పంపించేను. దానికి బహుమతి వచ్చింది. మరి, దాన్ని బాబా గారికే అంకితం ఇచ్చేను. ఇవన్ని రావుగాడికి తెలుసా? ఏదో నోటికొచ్చినట్టు పేల్తాడు అసలింకా చెప్పాలంటే, నేనో నవలని అనాదలకి దరిద్రులకి కూడ అంకితం ఇచ్చేను, వాడికి ఆ సంగతి తెలుసు కూడాను.

"ఒరే! 'అనాధలకి అంకితం'అన్నావు. అంటే ఏఁవిటి చేస్తావు? నీనవలకి పత్రికవాళ్ళిచ్చిన దాంట్లోగాని, పబ్లిషరు యిచ్చినదాంట్లోగాని ఒక్కపైసాఅయినా వాళ్ళ కోసం, ఖర్చుపెట్టేవా! ... అదెలాగాలేదు పోనీ ఆ 'అనాధలూ దరిద్రులూ' అలాగే ఎందుకున్నారో, వాళ్లు అలా వుండడానికి వెనకవున్న కారణాలేఁవిఁటో నీ నవల్లో ఒక్క ముక్కయినా చెప్పేవా?.... మరెందుకురా ఈ అంకితాలు?" అన్నాడు వుడుకు మోతు రావుగాడు.

బావుంది. ఇది మరీబావుంది. ఏదో సాఁవెఁత చెప్పినట్టు— కాలికేస్తే మెడకీ, మెడకేస్తే కాలికీను!

రావుగాడికి మన రచయితలమీద ఇంకో అభిప్రాయంకూడా వుంది. మన రచయితలకి (అంటే రచయిత్రిలకి కాదని కాదు, వాళ్ళకీను) చాలామందికి అసలీనాటి సమస్యలన్నింటికీ మూలకారణం— 'డబ్బు'అంటే ఇప్పుడున్న ఆర్థికవ్యవస్థ— అని తెలియనే తెలియదు అంటాడువాడు. రావుగాడు వుత్తి డబ్బుమనిషి. డబ్బుతోటే గౌరవం, హోదా, మంచీ, చెడూ అన్నీ వస్తాయంటాడు నేన్నమ్మను. మన పవిత్ర భారత దేశంలో డబ్బుకి అంత విలువ ఇచ్చేవాళ్లున్నారని నేను అనుకోను, పైదేశాల్లో అంటారా, వొప్పుకుంటాను వాళ్ళకిమనలాగా దేఁవుఁడూ, ధర్మచింతనా, స్త్రీధర్మాలూ, వివాహ వ్యవస్థా, మడీ, ఆచారం, నీతీ, నియమం— ఇవేవీలేవుకదా!

మరోసంగతి చెప్పమంటారా? రావుగాడికి మన రచయిత్రులంటే మంట. వాళ్ళలో ఒక్కరికీ సరైన 'అవగాహన' లేదుట. ఏవేవో కల్పనాలోకాల్లో విహరించి, నేలకి నాలుగు కిలోమీటర్ల యెత్తునించి రాస్తారుట. ఇలా వాళ్ళమీద ఎన్నో 'విట్లు' వేస్తూనే వుంటాడు.

కాని నన్నడిగితే. ఇదికూడా అన్యాయమే అంటాను. అసలే మనదేశంలో స్త్రీ ఎంతో వెనుకబడివుంది. ఈనాడు ఇందరు రచయిత్రులు వస్తున్నారంటే మనం ఎంతో గర్వించవలసిన విషయం అని అనుకుంటూ వుంటాన్నేను. అంచేత. ఏదో రాస్తున్న వాళ్ళని పట్టుకుని— అవగాహనలేదు, అదిలేదు. ఇదిలేదు అని విమర్శించడం అన్యాయం. అసలింతకి రావుగాడి ఏడుపల్లా ఏమిటంటే— వాళ్ళు, గోటితోపోయే సమస్యలకి గొడ్డళ్ళతోనూ. మహాప్రళయం ముంచుకొస్తే తప్ప తీరని సమస్యలకి గోటితోనూ పరిష్కారాలని కాయితం మీద సాధించి పారేస్తున్నారని ! సరే, వాళ్ల రాసిందీ పోనీ, 'హానిచేసే సాహిత్యమే' అనుకోండి. అయితే మాత్రం?.... ప్రజలు అభిమానిస్తున్నారా, లేదా? సాహిత్యం ఎవరికోసం? ప్రజలకోసమే కదా? అలాంటప్పుడు ప్రజలు అభిమానిస్తున్న సాహిత్యం 'చెత్త సాహిత్యం' ఎలా అవుతుందో నాకొక్కసారి చెప్పండి వింటాను.

ఇంకా గట్టిగా చెప్పాలంటే, మా రచనలు 'నాన్సెన్సు' అయినట్టయితే, సంపాదకులెందుకు వేస్తున్నారు? పాతికో పరకో ఎందుకిస్తున్నారు? జెలస్ వెధవ రావుగాడు ఇవేవీ ఆలోచించడు. ఎంతసేపూ నన్నేదో ఏకేద్దామనే ధ్యాసేతప్ప, మరో ఆలోచనలేదు వాడికి. అసలు ఈ పదేళ్లలో వాడు ముప్పయ్యే రాయడమేం?.... ఎన్నో రాసుంటాడు. కాని తిరిగొచ్చేసుంటాయి. అందుకే ఆ ఏడుపు.

నాకు శరత్ బాబంటే ఇష్టం, అందువల్లే నేను అప్పుడప్పుడు బడదీదీ, దేవదాసులాంటి పాత్రల్నీ; పార్వతి, సావిత్రిలాంటి పాత్రల్నీ సృష్టిస్తూ వుంటాను, నాకు ఆ పాత్రలంటే ఎంతో అభిమానం. అంతేకాదు; ఎందరో పాఠకులు నన్నందుకు మెచ్చుకుంటూ వుత్తరాలు రాసేరుకూడాను. అందు గురించి కూడా రావుగాడికి నేనంటే జెలసీ.

ఇలా ఎన్నని చెప్పమంటారు మేష్టారూ? నేను నా కథల్లో అందమైనస్త్రీలని వర్ణిస్తూ వుంటాను. అదీ వాడికి పడదు. నా రచనల్లో 'సెంటిమెంటు'మీద విజయం సాధిస్తానని నన్నోసారి వెక్కిరించడానికి ప్రయత్నించేడు.

నాస్తికముండాకొడుకు వాడికి సెంటిమెంట్లేంవిటి? ఏంవీం వుండవు. అమ్మా నాన్నా, చెల్లీ, తమ్ముడూ, పెళ్లాం పిల్లలూ అన్ని సంబంధాలకీ మూలం ఆర్థికవ్యవస్థ; డబ్బు. డబ్బు, డబ్బే అనేవాడు— వీడికి సెంటిమెంటు ఒకటా!

ఓరోజు రావుగాడు— నేనింగ్లీషుకథలు కాపీకొట్టేస్తున్నానని నాదగ్గిరఏడ్చాడు.

నిజంవేనండీ, కొన్ని చక్కని కథలూ, మనోహరమైన భావాలూ ఇతర భాషల్లో వుండిపోతే, మన తెలుగు పాఠకలోకానికి అవన్నీ ఎలా అందుతాయి? అందుకనే, నేను కొన్ని కథల్ని తెలుగులో రాయకపోలేదు. రాసేను. అయితే కొందరిలాగా సుబ్బరంగా కాపీకొట్టేసి, మళ్ళీ సొంత రచనల్లాగ పోజు కొట్టలేదే నేను? ఆఒరిజినల్ రచయితకే నా రచనని అంకితం ఇచ్చేస్తున్నానే? అయినా రావుగాడికి ఎందుకీ ఏడుపు?

సందర్భం వచ్చింది కాబట్టి చెప్తున్నాను: నేనురాసిన నవలల్లో— రాజనాల, ఎన్టీరామారావు, నాగేశ్వరావు, జమున, గుమ్మడి వుండి తీరతారని, పెద్దకనిపెట్టిన వాళ్లా. నాతో చెప్పేడు రావుగాడోసారి.

అవును. నేను నవల రాసినప్పుడే పాత్రలస్వరూప స్వభావాల్ని వూహించుకుంటాను. నా నవలని సినీమాగా తీస్తే ఎలా వుంటుందో అనుకునే రాస్తాను. ఏం, తప్పా?

ఇలా చెప్పుకుంటూ పోతే, తెల్లవారి పోతుంది. నాకు సాహిత్య ఎకాడమీ బహుమతి వచ్చిందని రావుగాడికి ఏడుపు. ఆ బహుమతి కోసం నేను ఎన్నిపాట్లు పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు. ఈ రావుగాడికేం తెలుసు?.... నన్ను వెక్కిరించడం తప్ప!

మరో సంగతి. నా గొప్ప చెప్పుకోడం కాదుకానీ. నేను నా కథల్లో మంచి మంచి ఆదర్శాలూ, త్యాగాలూ వీటి గురించి ఎక్కువగా రాస్తూ వుంటాను. ఒకవేళ వాస్తవ జీవితంలో అది వేరే అనుకోండి. పోనీ. నా కథలు చదివేకైనా వున్న మనుషులు మంచికి మారొచ్చును కదా! వుదాహరణకి, నాకు మొన్న ప్రయిజొచ్చిన కథలో చూడండి ఆ కోటీశ్వరుడు. తన కన్నకొడుకు కమ్యూనిష్టయి పోయేడని ఆవేదనతో తన ఆస్తంతా పేద ప్రజానీకానికి పంచి పెట్టేస్తాడు. ఇలాంటి మహోన్నత త్యాగబుద్ధిని గురించి నేను రాస్తే, రావుగాడు.— వీడి నోరు పడిపోను—వెర్రెత్తి పోయి ఏంవన్నాడో తెలుసునా, "ఒరే, బాబు! గుడ్డి కళ్ళు పెట్టుకొని నిజం నీకు కనబడక పోతె పోయింది కాని, అబద్ధాలు మాత్రం రాయకురా, నా తండ్రి!" అంటూ ఏడిచేడు.

ఇంతదాకా చెప్పేనుగనక మరొక్కమాట ... నేను చెప్పకుంటే ఎలావుంటుందంటే, "చూసేవా, వింటున్నాం కదాని వీడు సొంతడబ్బా కొట్టేసుకుంటున్నాడు"— అనేస్తారు. కాని నిజం చెప్పాలంటే నాది మొదట్నించీ గొప్ప జాలిగుండె. 'నీ రచనల్లో ప్రధానరసం ఏది?' అనిగాని ఎవరైనా నన్ను ప్రశ్నిస్తే 'కరుణరసం' అని తడుముకోకుండా చెప్పేస్తానన్నమాట, అసలు 'కరుణశ్రీ' అని పెన్‌నేమ్‌లో రచనలు చేద్దామని కొన్నాళ్ళకిందట అనుకున్నాన్నేను. ఆ పేరుతో ఎవరో కవి వున్నారని రావుగాడే నాకు చెప్పేడు.

ఇంతకీ చెప్పేదేవిటంటే, ఈ మధ్య నేనొకకథరాసేను. నేనిన్నాళ్ళూరాసిన కథలన్నీ ఒకెత్తూ, అదొక్కటీ ఒకెత్తూ అనిపిస్తోందినాకు. ఎందుకంటే, ఆ కథకి ఆ పత్రికవాళ్ళు బ్రహ్మాండమైన పబ్లిసిటీ ఇచ్చి వేసేరు. ఆ సబ్జెక్టుమీద మరికొన్ని కథలు రాయమనికూడా నన్ను రిక్వెస్టు చేసేరు.

ఆ కథలో సబ్జెక్టేవిటంటె. మీకు తెలుసుకదా, మేష్టారూ! ఈ రోజుల్లో న్యూసుపేపరు తెరిచ్చూద్దామంటేనే భయం వేసిపోతోంది. అదేదో రాజ్యం స్థాపించదంకోసమని. అక్కడెక్కడో తలకాయలు తెగనరుకుతున్నారటకదా! ఈ మాట పేపర్లో చదివితేనే చాలు నాకు కళ్ళంట నీరు తిరిగిపోయి. అన్నంకూడా సాయించడం లేదు. ఓరాత్రిప్పుడు నిద్రలో తెలివొచ్చి, అదంతా తల్చుకుంటే తలగడా తడిసిపోతోందన్నమాట.

నేను ఆ సబ్జక్టునే తీసుకుని ఆ కథరాసేను. మీకు చెప్తే నమ్మరుకాని, గురువుగారూ, ఆకథని ఓచేత్తో రాస్తూ, మరోచేత్తో కళ్ళు తుడుచుకుంటూనేవున్నాను. కథ పూర్తయేక మళ్ళీ ఫెయిర్ కాపీరాయడానికికూడా నాకు మనసంతా అదోలా అయిపోయింది. మా ఆవిడే, పాపం, ఫెయిర్ చేసిందిలెండి. దాన్దీ నాలాగే జాలిగుండె. అది రాస్తున్నంతసేపూ, గుండె చెరువయిపోయిందని చెప్పిందికూడాను.

సరే, ఇంత దీన్తో మనం రాస్తే. పత్రికలవాళ్ళు సరేసరి; పాఠకులుకూడా వుత్తరాలమీద వుత్తరాలు కుప్పించేరు. మనవాడేకదా. పోనీ నేను అనడం కాదు, ఇందరు 'మంచి కథ' అంటున్నారుకదా అని చెప్పి, రావుగాడికి ఆ కథని తీసికెళ్ళి చూపించేను.

వాడు అంతా చదివి, కన్నింతా ముక్కింతా చేసేసుకుని, వూపిరి గట్టిగా పీల్చుసుకుని, నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ—

"రామాయణం ఎవ్రరాసేర్రా?" అన్నాడు.

వెధవ జోకు. "వాల్మీకి రాసేడ"న్నానేన్నేను.

"నువ్వు గొప్పా? వాల్మీకి గొప్పా" అన్నాడు వాడు.

వాల్మీకి ముందునేనెంత? ఏనుగుముందు ఎలక పిల్లని. "వాల్మీకి గొప్ప" అన్నాను.

"అయితే విను." అంటూ మొదలెట్టేడు. "ఆ వాల్మీకిదీ నీలాగే గొప్ప జాలి గుండే. చూడు కావాలంటే రామాయణం మొదలుపెడుతూనే అక్రౌంచ మిధునానికి జరిగిన అన్యాయానికి ఆయన గుండె కరిగిపోయింది. కాని నీలాగ బాల్చీలకొద్దీ కన్నీళ్లు కారుస్తూ కూచోలేదు. 'అయ్యో! అయ్యో!!' అంటూ వెదవ కథలు రాయలేదు. ఏ పాపం ఎరగని ఆ పక్షుల జంటకి వాటిల్లిన కష్టానికి కారణమైన వాణ్ణిపట్టుకు తిట్టేడు. శపించేడు. బోధపడిందా? అదీ ఆయన చేసింది— మరింకపోతే నీ రెండో పాయింటు - తలకాయలు తెగనరకడం. రావణాసురుడి తలకాయలు రాముడు ఎన్నిరా నరికేడు? ఒకటికాదే! రెండుకాదే! పదిరా బాబూ, పది. మరా పదీ నరికితే వాడు చచ్చేడా? మళ్ళీ మరో పది తలకాయలు మొలిచేయి. మళ్ళీ ఆ పదీ నరికేడు. మళ్లీ మొలిచేయి. మళ్లీ నరికేడు.... వాల్మీకి ఇదంతా విని, నీలాగ 'అయ్యో! తలకాయలే! నరికీడ(వే!? రక్త(వే?!' అంటూ గోల గోల చేసేసి, గగ్గోలు పెట్టేలేదే? మరైతే, ఏంచేసేడు?.... అధర్మాన్ని పడగొట్టి, ధర్మాన్ని నిలబెట్టడానికి రాముడంతటి వాడు కూడా తలకాయలు తెగనరకడానికైనా వెనుదియ్యడు సుమా అని చెప్పేడు. ఆ ముక్క చెప్పడానికే అంత రామాయణ(వూ రాసేడు. అంచేత అప్పుడు వాల్మీకికయినా, ఇప్పుడు నువ్వయినా మరోడయినా చెప్పవలసిందదీ. అంతేకాని వెధవ జాలి కథలు రాసుకుని జనాన్ని తప్పుదార్లు పట్టించడంకాదు........ అయినా, జనం కన్నీళ్లని కేష్ చేసుకునీ వెధవ్వి నీకు ఎంత చెప్తేమాత్రం లాభం ఏ(వి(టి?" అనీసి చంచరా వెళ్ళిపోయేడు రావుగాడు.... చూడండి వెధవ వాదన! జనం కన్నీళ్లు కారుస్తూకూడా నారచనల్ని మెచ్చుకుంటూవుంటే వీడొక్కడే జనాన్ని తప్పుదారి పట్టిస్తున్నావో అని గోల పెట్టేస్తాడు! వాడలా వెళ్లిపోడంతో నేను అవాక్కయిపోయి, అలా వున్నచోటే నించుండి పోయేను.

ఇంతలోనే మళ్ళీ. ఏవో కొంపలు మునిగిపోతున్నవాళ్లా వచ్చి. "ఒరే! ఇప్పుడు కాకపోయినా, మరోనాటికైనా పాఠకులు వాళ్ళకి నిజంగా కావలసినసాహిత్యం

ఏదో తెలుసుకుంటారురా! అప్పుడు మీ రచనలు పొయ్యిచేసుకుందికీ, గంజివార్చుకుందికీ కూడా వుపయోగించరు. తెలిసిందా?.... ఈలోపుని ఆపత్రిక వెధవ ఇలాంటివే మరోనాలుగు కథలు రాయమన్నాడని చెప్పి నువ్వురాసేస్తే. అవన్నీ కలిపి ఓ పుస్తకం వేసేస్తే, సాహిత్య ఎకాడమీ వాళ్లు నిన్ను మళ్ళీపిలచి, మరో స్పెషల్ బహుమతి యిస్తారు. పో! పోయి, తెచ్చుకో!" అనేసి మళ్ళీ వెళ్ళిపోయేడు. వాడికి నామీద అంత మంటవుంది. మొండివాళ్ళతో మనకి వాదనేంవిఁటి చెప్పండి? మెరిట్‌ని ఎప్రిషియేట్ చెయ్యలేని సినికల్ రాస్కెల్.

వీడు 'జనం జనం' అంటూ ఏ వెధవపని చేసేస్తాడోనని నాకు పక్కబెదురు వుంటూనే వుంది. సరిగ్గా అనుకున్నట్టే ఆదేదో విప్లవ రచయితల సంఘంట, దాన్లో చేరిపోయేడు రావుగాడు ఈమధ్యనే. మాజీ సాయెబు వుండుండి తురకల్లో కలిసిపోయేడని.... బా-గానేవుంది. కాని యిప్పుడు వాణ్ని కలవడానికే నాకు భయం వేస్తోంది. ఏదో నాలుగు కాలాలపాటు బతికి, నాలుగు నవల్లు రాసుకుందామనుకుంటున్నవాణ్ణి.... నిన్న వాడు రోడ్డుమీద కనిపిస్తే, మరోదారంట వెళ్ళిపోయేన్నేను.

.... ఇంత చెప్పేక నాదొక చిన్న మనవి. ఈ రావుగాడూ, వీడిలాంటి వాళ్లు బయల్దేరి, 'జనం, తప్పుదారి పట్టించడం' అంటూ ఏవో అర్థంపర్థంలేని మాటల్తో నామీదా, నాలాంటి వాళ్ళమీదా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిసింది. నాకుతెలుసు. నా పాఠకుల మీద నాకు నమ్మకంవుంది. ఈ రావుగాడు కాదు వాడిలాంటి వాళ్ళు వంద మంది వచ్చినా నా పాఠకులు నన్నే అభిమానిస్తారు.... తమరుకూడా గిట్టనివాళ్ళ ప్రచారానికి లోపడి పోవద్దని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. ఇక శలవా?

సాహిత్య ఝంఝ

— అట్లూరి రంగారావు.

ఝంఝ కవితా సంకలనం తెలుగు కవిత్వంలో ఒక నూతన దీర్ఘకాలిక శకానికి ఆరంభం. ఈ ప్రారంభానికి పూర్వరంగంగా దిగంబర కవితలు, తిరుగబడు, విప్లవకవుల 'మార్చ్' సంపుటి వచ్చినయ్ అయినా సాధికారంగా సమిష్టి బాధ్యతతో నిర్మాణయుతంగా ఒక ఉద్యమంగా 'విరసం' ఏర్పడటమూ అందుతోబాటు సంకలనం బహిరంగ పరచబడటమూవల్ల ఝంఝ విప్లవ తెలుగుకవిత్వంలో కొత్తపుటఅవుతుంది;

చరిత్ర గమనంలో యిపుడు ఏయుగం। ప్రజల ప్రస్థానం ఎటు సాగవలసి వున్నది? అందుకు కవిత్వం ఏపాత్ర నిర్వహించాల్సివుంది? అనే మౌలిక విషయాలు నిర్ణయించు కొంటేనే ఆ ప్రాతిపదికపైననే యీ సంకలనంలోని కవిత్వాల్ని అంచనా వేయగల్గుతాం.

ఇది ప్రపంచానికి భారత దేశానికి తెలుగుప్రాంతానికి ప్రజల విప్లవ సామ్యవాదయుగం. జాతీయ స్వాతంత్ర్యాలూ; అర్థం సారంలేని Socalled ప్రజా స్వామ్యాలూ, పార్లమెంటులూ, పార్టీలూ, ఎన్నికలూ, కోర్టులూ ప్రజలకు అన్యాయంజేసి ఉన్నతవర్గ ప్రయోజనాలకే ఊడిగంచేశాయి. యంత్రాల అభివృద్ధీ, సాంకేతిక విజ్ఞాన ప్రగతి, వ్యక్తిగత ఆస్తి, వ్యక్తుల ఆర్థికపోటీ, ప్రజాబాహుళ్యానికి కష్టాలనూ, చిక్కులనూ, అవస్థ-నూ, ఆసమానతలను, అన్యాయాలనూ ఎక్కువజేశాయి. ప్రజల పేరుతో హోదాలను, పదవులను అధికారాలనూ పొందినవారూ పొందని ప్రతిపక్షాల వారూ గుర్తింపుపొందిన రాజకీయ పార్టీలూ, సాంఘిక సాంస్కృతిక సంఘాలూ ప్రజలకు అంటే తమశారీరక మానసిక శ్రమశక్తిని అమ్ముకొనిబతికే అసంఖ్యాక కార్మిక రైతుకూలీ విద్యార్థి మేధావి ఉద్యోగ వర్గాలకు ద్రోహంచేసి అధికార దోపిడీముఠాకు వర్గాలకూ అమ్ముడుపోయినయ్.

సామ్యవాదమే అందరూ జపిస్తున్నా సర్వత్రాసాగుతున్నది వ్యక్తి అస్థివ్యవస్థా వ్యక్తిలాభ పోటీ అనే అమానుష వికటాట్టహాసమున్నూ.

సమూలమైన సామ్యవాదంవైపు సమాజాన్ని మళ్ళించాలి. అతుకులబొంతగా అంతోయింతోపంస్కరణలతో సమూలమైన మళ్ళింపు జరిగదు, సమూలమైనది విప్లవాత్మ

కంగనే వుంటుంది. విప్లవాత్మక సామ్యవాద సమాజస్థాపనే యీనాడు ప్రజల మహాప్ర స్థానం అయిన యుగమిది. ఇందుకొరకు అలాంటి విప్లవంకొరకు విద్యార్థీ విజ్ఞానీ తప్పక ముందున నిలబడతాడు. అదే యువకవుల కర్తవ్యం. ప్రజాకవుల కర్తవ్యం. అసలు కవుల కర్తవ్యం.

ఇందుకోసం కలం పట్టిన పూర్వమే పట్టిన కలాన్ని పదునుపెట్టిన కవుల గేయాల సంకలనం ఝంఝ. విప్లవ ఝంఝ. తెలుగు కవిత్వంలో విప్లవ ఝంఝ ఆరంభమైంది. ఝంఝ అందునా విప్లవ ఝంఝ తుదిచూడక అంతనూ చుట్టబెట్టక ఆగదు. రేపో ఎల్లుండో, పదేళ్ళకో యిరవై ఏళ్ళకో దేశం అంతా యీ ఝంఝ వ్యాపించి జయించిగాని తీరదు. అందుకే యీ సంకలనం తెలుగు కవిత్వంలో మహా గొప్ప నూతన శకానికి నాందిపలికే గర్వస్థానాన్ని చరిత్రలో పొందుతుంది.

విప్లవసామ్యవాద భావాలూ సిద్ధాంతాలతోపాటుగానే ఏనియమాలూ సూత్రాలూ లేని విశృంఖల స్వచ్ఛందమైన కవితారీతి వచనశైలిగా సంపూర్ణంగా చలామణీలోకి వచ్చేసిందికదా. మాత్రాఛందస్సులో రాసేవాళ్లూ యివాళ ఛాందసులే అనుకోవాల్సి వస్తున్నది. ప్రత్యేకంగా పాడేకోసమో, ఏప్రదర్శనకోసమో ఉద్దేశించినవిమాత్రమే మాత్రాఛందస్సుల్లో లయసహితంగా రాయాల్సి వస్తున్నది. కనుక యీఝంఝఅంతటా స్వచ్ఛంద వచనశైలియే అమలు జరగటం సహజమే.

ముందుమాట విరసం కార్యదర్శి కె. వి. రాశారు. ఒక విమర్శకుడురాసి నట్లు ఆర్వియార్ విరసం ప్రోగ్రామ్‌నూ విప్లవ కవితాలక్ష్యాలనూ సుదీర్ఘంగా ఆయన వివరించనిమాట నిజమే. ఆ అవుసరం యీనాడులేదు. ఆ ఫార్మాలిటీస్. కొలబద్దలు అన్నీ ఎగిరిపోతున్నకాలం యిది. అకడమిక్ సూత్రాలూ, పడికట్టురాళ్ళూ పద్ధతులూ ఎగరగొట్టటం విరసం. ఝంఝల కార్యక్రమాల్లో ఒకటికూడా. అందుకే ఆర్వియార్ లాంటి లాక్షణికులకు యిందులో ఎక్కువ నచ్చకపోవడం. ఇవాల్టికీ మాత్రాఛందస్సు లనూ, ఆ ఛందస్సుల్లో యిరికించేకోసం వాడే కృతక గ్రాంథిక వ్యవహారికంకు బందీ లయిపోయిన అభ్యుదయ నామధేయ రచయితలకూ యిది అంతగా నచ్చకపోవటం సహజమే. ఆఫ్రోఏషియా సంఘీభావంకోసం రాసిన కవితల్లో ఒకటీ భారత ప్రజల గురించి రాయలేనివాళ్ళకు యీ ఝంఝ నచ్చదు. భారత ప్రజలు పోరాడాల్సివుందనీ. పోరాడుతున్నారనీ ఆపోరాటం విప్లవయుతంగానే వుంటుందనీ అభిప్రాయపడేరచయిత

లకూ (ఘంయు రచయితలు) భారతదేశం విముక్తి అయిపోయి ఒడ్డున వున్న దేశంగా భావిస్తూ కాంగో వీట్నాం వగైరాలకు మొసలి కన్నీళ్లు ఒలకబోసే అభ్యుదయ రచయితలకూ అదేభేదం.

కవిత్వాలసంగతి. అన్ని గేయాల్లోనూ నిజాయితీ ప్రజలకొరకు తహతహ విప్లవ మార్పుకోసం ఆరాటం. విప్లవం సాయుధంకాకుండా వుండదనే సత్యదర్శనం. ప్రజలకు ఆయుధధారణ ప్రజాహింస అనివార్యం అవశ్యం అనేబోధ ప్రతిగేయంలోనూ ప్రతి రచయితలోనూ స్పష్టమయినదే.

మొదట చెప్పాల్సింది శ్రీశ్రీ 'నిన్నటి జట్కావాలా', 'మహాప్రస్థానం'లో అభ్యుదయ పహాప్రస్థానం ఆరంభించి, ఖడ్గసృష్టిలో విప్లవయుగానికి నాందిపలికిన మహాకవి, మూడోదశగా కవిత్వాన్ని ప్రజాయత్తంచేసే మహాకార్యానికి నాందిపలికారు యీ 'నిన్నటి జట్కావాలా'లో. ప్రజలకోసం ప్రజలభాషలో ప్రజల జీవితసమస్యల్లో ఉన్నత కవితగా ఉత్తమ కళాఖండంగా ఆశయనిర్దేశంగా ఆదర్శం దిక్సూచిపేదిగా ఎలా కవిత్వాన్ని నడపొచ్చునో శ్రీశ్రీ యిందులో కవులకు దారిచూపాడు. అన్నీపోగొట్టుకుంటున్న తాను రెక్కాడినా డొక్కాడే నమ్మకం లేని అతను చచ్చిపోదామనుకుని, ఒట్టిగా చచ్చేకంటే దుర్మార్గులను చంపటంలోనే ఆహుతవుదామనే నిర్ణయానికొచ్చి శ్రీకాకుళం వెళ్ళిపో నిర్ణయించుకున్నాడు జట్కావాలా.

రైట్ టు ఓట్ కాదు ఫైట్ టుది లాస్ట్ అంటాడు లోచన్, ఇది నినాదంగా కనిపించొచ్చు నినాదాలు కవిత్వంకాదని కొందరనవచ్చు. కాని యిలాటి కవి గేయ పాదాలు నినాదాలుగా రూపొందే అవకాశం ఏర్పడటం కవిత్వంయొక్క గొప్పతనానికే గుర్తు.

'తెరవెనుక'లో ఎక్స్‌రే, విప్లవానికి వివిధరకాల పనులు ఎలా దోహదం చేస్తాయో సూచనమాత్రంగా చెప్పారు. తెరవెనుకవుండే వాళ్లు కూడా గట్టివాళ్లే అయుండాలి.

"గ్రీన్‌రూంలో చాణుక్యుల్నే వుంచాలి
నెత్తురుతో హామీరాసి బోర్డుకట్టుదాం, రా."

నిఖిలేశ్వర్ "భయం చావులాంటిది
వచ్చే ఉపద్రవాన్ని
ఊరించి ఊరించి

నరాలలో నీరు పారిస్తుంది"
చావు ఒక భౌతిక పరిణామం
యీ క్షుద్రమైన వ్యవస్థను
మార్చే పోరాటంలో
నీ జీవితాన్ని వెచ్చిస్తేచాలు."

శివుడుగేయం సత్యం చావదు(డు)లో వీరుడు మరణించినపుడు సహవీరులకు కన్నీళ్ళుగాక విప్లవదీక్ష యినుమడించటమే ఎలా జర్గుతుందో చెప్పారు.

Statement about ownership and other particulars about newspaper

SṚJANA

1.	Place of publication	Warangal-2.
2.	Periodicity of its publication ...	Monthly
3.	Printer's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	P. B. 67 Warangal-2
4.	Publisher's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	(As Above)
5.	Editor's Name	Varavara Rao
	Nationality	Indian
	Address	(As Above)
6.	Names and addresses of individuals who own the newspaper add partners or shareholders holding more than one percent of the total capital.	

I, Varavara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- Varavara Rao,
Publisher.

తుఫానుకోసం ఎదురు చూస్తున్నాను

—అద్దేపల్లి రామమోహనరావు

నిరుద్యోగభూతం విజృంభిస్తోంది—
రికమండేషన్ల ఎముకల దండలు ధరించి
లంచాల పుట్టెలు చేతులో పట్టుకుని
పలుకుబడి నెత్తుర్ని ఒళ్ళంతా పులుముకుని
దోపిడీ నరాల్ని మెడకి చుట్టుకుని
వర్ధమాన దేశ దరిద్ర రంగస్థలం మీద
వికార తాండవం చేస్తోంది—
కహ కహో వికటాట్టహాసాలు చేస్తోంది—
దేశ సంపద నంతా కంచంలో పెట్టుకుని చుట్టూకూర్చుండి
ధన స్వాములంతా భక్షించి త్రేనుస్తూ
జుట్టి విదిలించిన ఎముకముక్కలు ముఖానికి కొట్టుకున్నా
ఈ కర్మ దేశంలో పేదవాడికి వేడి కలుగలేదు—
నీ సంపద పెంచడమే నాజన్మ రహస్య మంటూ
గాఢంగా కౌగిలించుకున్న మహానాయకులు
పారవశ్యం కలిగించి కళ్ళుమూసి
జేబులో ఉన్న చిల్లర డబ్బులు గూడా దొంగిలించుకు పోతున్నా
ఈ సాంప్రదాయిక దేశంలో సామాన్యుడు కళ్ళు తెరవ లేదు—
తాను పదో అంతస్థు అంచు మీద నిలబడి
కింద పడుస్తున్న ఆకల్ని పేగుల్ని చూస్తూ
కన్నీటితో స్నానం చేయిస్తూ
" డబ్బులో సుఖమేమీ లే " దని
లక్షాధికార్లు కుహనా కరుణతో ఓదారుస్తున్నా

ధనికుల్నే గౌరవించే ఈ దేశంలో
ఆకలి తిరుగుబాటు చేయ్యలేదు—
అందుకే ఈ నిరుద్యోగ భూతాన్ని చూస్తే
నాకి ఈనాడు ఆశారేఖ చిగురుస్తోంది—
లక్షలాది యువకుల చేతుల్లోని సర్టిఫికేట్లు చెల్లని నోట్లై
తమ జీవితాల్ని చూచి వెక్కిరిస్తున్నప్పుడైనా—
మాసిన చిరిగిన దుస్తుల మీద
ఎండిన రేగిన జుట్టు మీద
కాలిన మండిన కడుపుల మీద
యౌవనం వైఫల్య గీతాలు రచిస్తున్నప్పుడైనా
అక్షరం ముక్కరాని మహానుభావులంతా
నెత్తి మీద కూర్చుండి
విషసర్పాల వలె బుసలు కొడుతున్నప్పుడైనా
ఇంటిల్లపాదీ చేస్తున్న ఉపవాసాలు పెచ్చుపెరిగిపోయి
అస్తిత్వం మీదనే నిప్పులు పోసి అంటిస్తున్నప్పుడైనా
రోడ్లపక్క యిరువైపులా ఠీవిగా నిలబడ్డ మేడలు
నెత్తురు నాలికలుజాపి
వికృతహాసాలు చేస్తూ
భవిష్యత్తును మింగబోతున్నప్పుడైనా—
ఈ నిరుద్యోగభూతం
తన జడల్ని సమాజంమీద కొరడాలుగాచేసి
తన పళ్ళమధ్య సమిష్టి సౌఖ్యాన్ని నమిలేస్తూ
వికార తాండవం చేస్తున్న సమయంలోనైనా
ఈ దేశంలో పేదవాడు తిరుగుబాటు చేస్తాడని
యువతరంలో విపరీత విప్లవజ్వాలలు లేస్తాయని
సంపూర్ణ నూతన వ్యవస్థా నిర్మాణానికి
మహోజ్వల చైతన్యం తుఫానులా వ్యాపిస్తుందని
నాకి ఈనాడు ఆశారేఖ చిగురుస్తోంది!

పరిణామం

— కాళూరి హనుమంతరావు

ఇదేమిటీ గాఢతమో
గర్భం ప్రసవిస్తున్నది
నిత్యనూత్న స్వచ్ఛమూర్తి
నహస్కరుని ! లోకబాంధవుని !

ఇదేమిటీ రోదః కుహ
రవ్యాప్తము మృత్యుతుల్య
నిశ్శబ్దము తొలగించుచు
కిలకిలమను పక్షుల రుత
ముల జీవన సంగీతము వినిపించును !

ఇదేమిటీ ఉషోవేళ
శీర్ణ ల్లీన సుమగర్భం
లో దాగెను జీవశక్తి
బీజక్రియ ! సంతత జీవ వికాస వ్యాప్తిక్రియ !

ఇదేమిటీ పరిణామం !
ఇదేమిటీ క్రొత్తదనం !
తలవిరిగిన వృక్షంవలె
మ్రోడై పెనురాయివోలె
ఎడారివలె తమస్సువలె
పడి ఉండిన నా హృదిలో
కావ్య రసామృతలహరీ కల్లోలమ్ములులేచును !
కవితాభావన అనలమువలె క్రాగును లోలోపల !
ఇదేమిటీ ఉత్సాహం !
ఇదేమిటీ చైతన్యం !
ఇదేమిటీ పరిణామం !

నక్క(ర)లోకం

— జంపన పెద్దిరాజు

నక్కలు— నక్కలు— నక్కలు
నడివీధులలో
నరనరాలలో
నవ్వునవ్వులో
నాగరికతలో
నక్కలు— నక్కలు— నక్కలు

టెర్లిన్, డెకరాన్
కావ్యం, కనకం
ఖద్దరు శిల్కులు
తొడుక్కు తిరిగే
నక్కలు— నక్కలు— నక్కలు

ఎలక్షన్లలో
సెలక్షన్లలో
స్ట్రైకుల వెనుకా
మైకులముందూ
నక్కిన నక్కలు పెక్కులు

కళల పేరుతో
కిలం పులుముతూ
మతం పేరుతో
మనిషిని దోస్తూ

సంధులలోను
విందులలోను
ఎక్కడ చూసిన అక్కడ నక్కలు

ప్రేమల క్షేముల
డాముల నిర్మాణంలో
నక్కిన నక్కలు పెక్కులు
నక్కలు— నక్కలు— నక్కలు

నడివీధులలో
నరనరాలలో
నవ్వునవ్వులో
నాగరికతలో
నక్కలు— నక్కలు— నక్కలు

జాతీయంత

ఎస్. నారాయణ చౌదరి

నా దేశానికి
హిమాలయాలూ సముద్రాలూ
సరిహద్దులు కాకూడదు;
నా దేశ నైసర్గిక స్వరూపం
పర్వతాలు, అరణ్యాలు, లోయలు కాకూడదు:
మానవత్వం పొలిమేరలుగా
సౌభ్రాత్రం, సమానత్వం, నైసర్గిక స్వరూపంగా
నా దేశం భూగోళంగా
నా జాతి మానవ జాతిగా
రూపొందటానికి
నా తరం విప్లవిస్తుంది

లేవనీయ్ం

— బి. భారతి

కొట్టకు
ఉప్పెనలా లేస్తున్న
యువతరాన్ని జోకొట్టకు:

కాకమ్మ కథలు చెప్పి,
తెగిపోయిన
ఆధారాల దారాలతో,
వాళ్ల చేతులను కట్టకు!

తల్లివై తండ్రివై,
మానసికంగా ఎదిగే పిల్లలకు
పిరికి మందు పెట్టకు:

నిర్భయంగా,
గర్భగుడి వదలి,
కదలి వచ్చే
దేవుళ్లను వెనక్కు నెట్టకు:

పంజా విప్పిన యీ హరీంద్రాల,
కుళ్లిపోతు కుంజరాలపై
దూకనీయ్:

గంజాయి తాగి పడుకున్న
జాతి జబ్బ మీద దెబ్బగొట్టి,
లేపనీయ్::

వడిసేల

— సత్తెయ్య

తిప్పండి వడిసేల
కొట్టండి పుసిగా
పట్టండి కొడవల్లు
ఎత్తండి కసిగా

రివ్వుమని రాయెల్లి
లేపాలి కాకుల్ని!
సర్రుమనా కొడవల్లు...
కలుపు మొక్కల్ని!!

తుంచి పారేయండి
సీడ పట్టిన ఆకు!
కొట్టి పారేయండి
సేను మింగే కంచె!!

దొంగ గొడ్డుకు
బడితె పూజలే సెయ్యాల!
పందికొక్కుల పొట్ట
పగిలేట్టు కొట్టాల!!

ప్యానమొక యెత్తుగా
పండించినా పంట
నాశనం అవతంటె
దూరతామా యింట??

తిప్పండి వడిసేల
కొట్టండి పుసిగా!
పట్టండి కొడవల్లు
ఎత్తండి కసిగా!!

సమీక్షలు :

రెండు నెలలకే రెండోసారి వెలువడిన 'ఝుంఝుం'

నెల్లాళ్ళక్రితం 'ఝుంఝుం' సమీక్షించాలనుకున్నాను. ఆలస్యమయింది. ఐనా అక్టోబర్‌లోనే వచ్చిందిగదా, అప్పుడే ఏంతొందర అనుకున్నాను. ఇంతలోకే డిసంబర్‌లో రెండవ ముద్రణ వచ్చింది. మళ్ళీ ఆలస్యంచేస్తే మూడవ ముద్రణ రావచ్చు.

రెండో కూర్పుకు కె. వి. రమణారెడ్డి చాల ఘాటయిన పీఠిక రాసాడు. ముఖ్యంగా దాశరథి గురించిరాస్తూ.... 'దురహంకార పూరితమయిన 'జాతీయ' వాద ఉన్మాదం మూలధనంగా ఇతరులనందరినీ పరాయిదేశపు కిరాయి మనుషులుగాఎంచే,' వాళ్ళందరికీ మంచివాత పెట్టాడు. ఒక్క దాశరథేగాదు ఈ దేశంలో 'జాతీయ' కవుల మని విర్రవీగుతున్న వాళ్ళందరూ 'దేశభక్తి' వమనంలో పుట్టి అందులోనే ఈగలా కొట్టుకుంటున్నవాళ్ళే....' వీళ్ళకు 'ఈ దేశంకోసం ఈ ప్రజలకోసం రక్త తర్పణాలు వదులుతున్న యువవీరుల స్మృతిని కళంకిత'చేసే అర్హతగాని, అధికారంగాని లేవు.

రెండవ ముద్రణకు 'కొసమాట'రాస్తూ శ్రీ శ్రీ 'వి ర.సం. మీద ఒక పెద్ద బాధ్యత ఉంది. ఇంకా, నూటికి 75 శాతం నిరక్షరాస్యులుగా ఉన్నవారికి ఎటువంటి సాహిత్యం అందజెయ్యాలనేదే వి.ర.సం. పరిష్కరించుకోవాల్సిన సమస్య'అన్నాడు. అంతేకాదు, ఎటువంటి సాహిత్యం ఏరూపంలో అందచేయాలి అన్నది ప్రధానసమస్య. శ్రీశ్రీ సూచించినట్లు 'భగవంతుడనే ఐడియామీద విడుపులేని యుద్ధం, సొంత ఆస్తి అనే మమకారాన్ని అందరిహృదయాల్లోంచీ తొలగించడం' (నిజానికి సొంత ఆస్తిమీద మమకారం పెట్టుకోడానికి యీ దేశంలో ఆ 75 శాతం నిర్భాగ్యులకు సొంతఆస్తిఅంటూ వుంటేగదా! ఇక వున్న వాళ్ళకు ఆ 'మమకారం' 'హృదయాల్లోంచి' తొలగించడం మళ్ళీ గాంధీజీ చెప్పిన ధర్మకర్తృత్వ సంస్కార వాదానికి దారితీయదుకదా!) ఇంకా సాహిత్యమంతా వర్గపరమైందని చెప్పడం యీనాటి కర్తవ్యంకావచ్చు. కాని డెబ్బై అయిదు శాతం నిరక్షరాస్యులదగ్గరికి పోవడానికి 'ఝుంఝుం'కు వాళ్ళభాష వస్తుందా? వాళ్ళబాధ తెలిస్తే చాలదు. వాళ్ళను ఓదార్చడానికి, వాళ్ళనడుం కట్టించడానికీ వాళ్ళ భాషరావాలి. అంటే నాటకం, సినిమా, బుర్రకథ, పాటలు, యింకా అనేకమయిన ప్రజాబాహుళ్యంలో ప్రచారంలోవున్న ప్రచార సాధనాలు, ప్రక్రియలు చేపట్టాలి.

నగర జీవితము, సిద్ధాంత పరిజ్ఞానము, కవిహృదయం, మధ్యతరగతిమేధావిత్వం—కార్మిక, కర్షకులదగ్గరకు పోవడానికి ఎంతో 'అనాగరికత, ఎంతో ఆచరణ, ఎంతో జనహృదయం, ఎంతో అటగాయిత్వం అలవర్చుకోవాలి.

ఈదృష్టితో చూచినపుడు'ఝుంఝు'లో అసలుసిసలైన విప్లవగేయం'నరుడో! భాస్కరుడా!' తెలంగాణలో సామూహికంగా 'ధూల' ఆడుతూ పాడే జానపద గీతం. ఈ గీతానికి స్పందన. 'భాస్కరుడు సర్వనామంకాదు కాలేదు.' నాదేశంలో వర్తమానాకాళంలో ఉదయిస్తోన్న నూతన మానవునికి మహోజ్వల సంకేతం'అయిన భాస్కరుడు ఎట్లా 'కన్నెరర్రసేసి' ఉదయించాడు, ఎట్లా కదనాన దూకాడు అన్నదగ్గర్నుంచి 'అస్తమయం'దాకా ఎంతో హృదయవిదారకంగా, ఉత్తేజంగాకూడా చిత్రించి 'నీవు సూపిన బాట నరుడో! భాస్కరుడా! మాదొడ్డ బాటయ్యె నరుడో! భాస్కరుడా! నీ బాటనే మేము నరుడో! భాస్కరుడా! బంధూకు పడ్తాము నరుడో! భాస్కరుడా!'అని సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తాడు.

'బంధూకు సేతబట్టి నరుడో! భాస్కరుడా!'

'బంధాలు తెంచ్తివయ్యె నరుడో! భాస్కరుడా!'అని భాస్కరునిమీద అధీనమయి ఆరంభమయిన గీతం (లేదా ఉద్యమం) 'బంధూకు పట్టాము నరుడో! భాస్కరుడా! బందాలు తెంచాము నరుడో! భాస్కరుడా!' అని ప్రజాపరమయిపోయింది శిల్పము, కళావిలువలువంటి ఏ సాహిత్య కొలమానాలతోనయినా కొలవండి- కదిలించే గీతం యిది. శ్రీకాకుళం ప్రాంతంలో మాట్లాడుకునే మాండలిక వాడుకభాషలో శ్రీశ్రీ రాసిన 'జట్కావాలా'కూడా జనానికి చేరువగా పోతుంది అయితే 'కవిగోరూ యినండి నాగోడు'....దగ్గర్నుంచి 'కాదు నాయేడుపే కావాలంటావా' అన్నదాకా రాసిన భాష జట్కావాలాదేకావచ్చు. కాని భావంకాదు. అది అతనికి పట్టనివిషయం. పైగా కృత్రిమంగా వున్నది, కవిగోరు 'యెల్లమన్న వొద్దన్నా' సికాకుల్లోపడిన కష్టజీవి 'సికాకులంయెల్లక మానడు' అది సత్యం.

ఈ రెండూ యికముందు విప్లవ రచయితల పక్షాన రానున్న సాహిత్యానికి ఒరవడిగా పెట్టుకోవాల్సిన గేయాలు. వచన గీతంకూడ పాడగలవాడుంటే ప్రజలను అంటుకుంటుందనే విశ్వాసం జ్వాలాముఖీ. 'ఆకాశం ఎర్రబడుడూంది' (ఈ కవిత ఝుంఝులోవున్నది)లోచన్ 'ట్రిగర్ మీది వేళ్ళతో' వాళ్ళ స్వయంగా చదివితే విన్నపుడు నాకు కలిగింది. ఏక ఊపు, ఆవేశం. నిజమైన ఆవేదన, గొంతులో బాధ జీర,

సాహసం-ముప్పిరిగొన్నపుడు పైనచెప్పిన కవితలుకూడ ప్రజాహృదయాల్లోకిపోతాయి. అయితే నేను సమీక్షకొరకు చదివినపుడు మాత్రం 'ఆకాశం ఎర్రబడుతూంది'లోఉన్న ఆలంకారికత, సంస్కృత సమాసరచన, సాగదీయడం, ఒక్క బలమైనమాట చెప్ప డానికి ఎంలో అల్లుకరావడం కనిపించి ఇదికూడ మధ్యతరగతి వాళ్ళకొరకే అని అని పించింది.

మధ్యతరగతి వాళ్ళకొరకు, మేధావులకొరకు కూడ యీ దశలో యిలాంటి కవిత్వం చాల అవసరమే. మొదటివాళ్లు పైతరగతికి అమ్ముడుపోకుండా వాళ్ళ కళ్ళు తెరిపించాలి, వాళ్ళహృదయాల్లో విప్లవ సత్యాన్ని ఆవిష్కరించాలి. ఇందులోని 'ఎర్ర చేపల మహాసభ', 'సత్యం చావదు(డు)' ఆ అవసరాన్ని చాల సమర్థవంతంగా నెర వేరుస్తాయి.

'కలంతో కాలాన్ని గెలిచి కదనం'లో నేలకొరిగిన శ్రీకాకుళ గిరిజనోద్యమ కవి సుబ్బారావు పాణిగ్రాహి అరుణామరస్మృతికి' అంకితమయింది యీ ఝంఝ. ఇలా అంకితంకావాలన్న యీ సంకల్పం ఆయనవలె జన ఛందస్సులను స్వీకరించాల్సిన సవాల్‌ను వి ర సం పై మరింత ఎక్కువ చేస్తున్నది. ఇది కె. వి. రమణారెడ్డి వంటి మేధావులకు ఒక పెద్ద బాధ్యత. ఈ సమీక్షను ఆయన ఎంతో చక్కగా చెప్పిన మాట లతో ముగిస్తాను. '....సాహిత్యమూ జీవితమూ పెనవేసుకపోయే సంప్రదాయం మళ్ళీ తలెత్తుతూంది. పాఠకుడే సద్విమర్శకుడవు తున్నాడు. కవికీ పాఠకుడికీ మధ్యగల దూరం కరిగిపోతున్నది. సూటిగా వాడిగా ఉండే కావ్యాలు పాఠకుల మనస్సులమీద బలంగా పనిచెయ్యగలుగుతున్నాయి. సంకేతాలద్వారా డొంకతిరుగుడుగా భావనిర్దేశం చేసే పద్ధతిపట్ల కంటగింపు కలుగుతూవుంది? భాషలో సారళ్యం సాధారణత్వం ఎన్ని కౌతున్నాయి ఇవి రాబోయే సాహిత్యదశకు సూచనలు".

— ఎం. రామానుజం

[ఝంఝ— విప్లవరచయితల సంఘం- కవితా సంకలనం- రెండవముద్రణ. సంకలన కర్త— కె. వి. రమణారెడ్డి. వెల: ఒక్కరూపాయి. ప్రతులకు: నిఖిలేశ్వర్, 46, విద్యానగర్ కాలనీ, హైదరాబాదు-13.]

ఎవరిదీ 'వసుధ'?

తెలుగు సాహిత్య రంగంలో ఆరోగ్యకరమైన సంచలనం మాత్రం నానాటికీ దేశ్యంగా బలవత్తరమవుతున్నది. ఈ సంచలనంవల్ల వర్గ సమాజంలో తమ తమ స్వభావాలనుబట్టి ఏ వర్గానికో చెందకుండా ఉండడమనేది ముప్పాళ రంగనాయకమ్మవంటివారికికూడా సాధ్యమయ్యే పనికాదు. 'మానవుడే మా వస్తువు, మానవతే మాసందేశం, మానవ పురోగమనమే మా ధ్యేయం, ఈ లక్ష్యానికే 'వసుధ' అంకితం' అన్నారు సంపాదకీయంలో. దోచుకుంటున్న మానవుడా, దోపిడీకి గురవుతున్న మానవుడా వస్తువు? దోచుకుంటున్నవాడు మానవుడు ఎట్లా అవుతాడు? కనుక కాలక్షేపం కలిగించడం ఆశయం కాద'న్నపుడు 'ఏదో ఒక సిద్ధాంతాన్ని నూరిపోయక' తప్పదు, మానవ పురోగమనమే ధ్యేయంగా లక్ష్యంగాగల పత్రికలు. సంపాదకీయంలో వ్యక్తమయిన పరస్పర విరుద్ధభావాలు చూసినా, ముప్పాళ రంగనాయకమ్మ గారే రాసిన 'తెలుగు నవల—సంఘ సంస్కరణ అనే వ్యాసంలో '....సంస్కరణకు సిద్ధంగాలేని సంఘాన్ని ఏ చట్టాలూ, ఏ ఇజాలూ నిర్దేశింపలేవు'వంటి వాక్యాలు చూసినా ఈమెకు ఇజమ్ అంటే ఒక భయం, మానవతా వాదం అంటే ఒక భ్రమ ఉన్నాయని స్పష్టం. ఇది పరిపూర్ణమైన సాంఘిక అవగాహన (సాంఘిక అవగాహన అనే మాటలో ఆర్థిక, రాజకీయ అవగాహనకూడా యిమిడి వుంటాయని రంగనాయకమ్మ వంటి వారికి విడమరచి చెప్పక పోతే మళ్ళీ పొరబడుతారు) లేకపోవడంవల్ల ఏర్పడిన అపోహ. అయితే ఆమెలో చాలా మంది రచయితల్లో లేని నిజాయితీ; ఆలోచనా వున్నాయి. ఇవి ఏ వర్గానికి ఉపయోగపడుతాయి అన్నది ముఖ్యం. సంపాదకీయంలో '... కాలక్షేపస్థాయినిదాటి ప్రయోజనాత్మక స్థితికి మనకథా సాహిత్యం ఇంకా చేరుకోవలసిన స్థితిలోనే వున్నది....' 'ఎవరూ దేనికీ కట్టు బడినట్లు కనుపించరు....' వంటి మాటల్లో వ్యక్తమయిన ఆవేదన 'వసుధ' తనకు తెలియకుండానే తనలోవున్న నిజాయితీవల్ల కమిట్ కావాలనే 'కట్టుబడాలనే' అనుకుంటున్నదని, ఈ కట్టుబడడమే సిద్ధాంతమని, ఇదినేరమేమీ కాదని, పైగా ఆరోగ్య లక్షణమని గ్రహించే రోజులు ఎక్కువ దూరంలేవు. ఆప్టిమిస్ ఇందులోవుంది. ఉత్తమశ్రేణి కథాసాహిత్యాన్ని అందించి పాఠకులను చైతన్యవంతులను చేయాలన్న 'వసుధ' లక్ష్యం కథల్లోకన్న వ్యాసాల్లో ఎక్కువ సిద్ధించింది, ఇందులోవున్న ఐదు వ్యాసాలుకూడా సామాన్యంగా

మాస పత్రికల్లో ఉండే వ్యాసాలకు భిన్నమైనవి. 'పరిణామ వాదంలో వెనుకడుగు' అనే వ్యాసంలో కుటుంబరావు తమకు సహజమైన వ్యంగ్యధోరణిలో '....పరిణామం అనేది బాణంలాగాపోదు అది రెండడుగులు ముందుకువేసి ఒక్కడుగు వెనక్కు వేస్తుందని నేను గట్టిగా చెప్పగలను.....' అంటారు. అందులోనే తెలుగులో వస్తున్న కాలక్షేప సాహిత్యానికి సినిమాలకు మంచి వాత పెట్టారు. "వీరేశలింగంగారు పుస్త కాలను ప్రజా వికాసానికి అంకితంచేసే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దానివల్ల ఆధునిక సాహిత్యంలో వచ్చిన పరిణామం వెనుకడుగువేస్తున్నది. ఇవాళ బళ్ళకొద్దీ వచ్చే సాహిత్యానికి ప్రజలను కాసేపు రంజింపచేయటంతప్ప మరే ఆశయమూ లేదు. పాతికేళ్ళక్రితం అభ్యుదయం కోసం కలం పట్టినవాళ్లు పాలకుల వేటకుక్కలుగా మారు తున్నారు. ఇదికూడా ఒక పరిణామదశే. సినిమాలు యీదశను ఏనాడో అందుకుని, జీవితసమస్యలను చిత్రించిన చిత్రాలను ఔటాఫ్ డేట్ చేసేశాయి."

'అతుకువేరు, దాస్యంవేరు'. జీవితంలో అతుకు తప్పదు. బతుకు బరువు యీడ్వడానికి బండచాకిరీ చెయ్యాల్సిందే. కాని మరొకరికి లొంగిపోవడానికీ, పాలేరు తనానికి కాదుగా జీవితం? ముందు మగాడు బానిస మనస్తత్వాన్ని మార్చుకుంటే తర్వాత సంగతి తర్వాత'అని కృష్ణాబాయిగారు యీనాడు స్త్రీల సమస్యలు వేరు, పురు షుల సమస్యలు వేరు అని భ్రమపడే రచయిత్రులకు కనువిప్పు కలిగించారు.

'మనం... సంఘం సంఘం అనుకుంటున్నది కేవలం మధ్యతరగతివ్యక్తుల సంఘమే. నిరుపేదలకీ, విద్యలకు దూరమైన గ్రామీణులకీ ఈసాహిత్యం తనకుతానై ఏమీ ఉపకరించదు. ఎవరిసమస్యలు పరిష్కరించి ఎవరి జీవితాలు ఉద్ధరించాలని రచ యిత రచన చేస్తాడో వారికి ఆ రచనతో ఏమీ సంబంధం వుండదు. సాహిత్యంవల్ల సంఘసంస్కరణ ఏమంతగా జరగకపోవటానికి ఇదేచాల పెద్దకారణం'అని ముప్పాళ రంగనాయకమ్మగారు 'తెలుగు నవల—సంఘ సంస్కరణ'అనే తమ వ్యాసంలో చాల మౌలికమయిన ప్రశ్న లేవనెత్తారు. ఇవ్వాల విప్లవం కోరుతున్న రచయితలందరూ యీ విషయం ఆలోచించాలి. 'ప్రస్తుతము తెలుగు నవల గురించి ఆలోచిస్తే యేమీ సంతృప్తికలుగదు. ఏ విలువలూలేని క్షణికమైన సినిమా ప్రభావంనుంచి, తెలుగునవల బయటపడకపోతే దానికి సంఘాన్నిగురించీ సంస్కరణగురించీ వూహించే అర్హతకూడ లేదు." ఇంక విప్లవం గురించిరాసే అర్హత ఎన్నడురావాలి మన రచయితలకు!

కథల్లో 'రాబందులనీడ' మంచికథ. వస్తువు పాతదైనా వాతావరణం, కథా కథనం పాఠకుణ్ణి ఆకట్టుకుంటాయి. 'పిచ్చుకలు' చాలా మంచి వస్తువు. పిచ్చుకలకు

తల్లిదండ్రులు ఆకాశంఅనే స్కూల్లో 'గింజలు తెచ్చుకోడం' 'గూడు కట్టుకోడం'వంటి బ్రతుకు పోరాటాలు నేర్పుతాయి స్వేచ్ఛనేర్పుతాయి. 'మాస్కూల్లో ఎందుకునేర్పరు?' అన్న పిల్లవానిప్రశ్నకు 'ఏంచెప్పను? అదో పెద్ద రాజకీయసమస్య' అంటాడు చాలా గొప్ప అవగాహన కథచాలా బిగువుగా, బలంగా, నేర్పుగా చెప్పాల్సివుండె 'తెలుగుతల్లికి మల్లెపూదండ!' కథా? ప్రాంతీయ, భాషాదురభిమానాలను రెచ్చగొట్టే నాన్సెన్స్. గరిమెళ్ళ సత్యనారాయణగారిని తెలుగువాళ్ళ సుబ్రహ్మణ్యభారతి అంటూ వుండే 'పెద్దపుస్తక ప్రచురణసంస్థ యజమాని' ఆమూగగుండె పాడిన యెన్నోపాటలు తానే ఎందుకు అచ్చువేసి ఆయన మద్రాసు వీధుల్లో చేయిచాచి అడుక్కునే స్థితినుంచి రక్షించలేదు? 'ఐదు రిక్షా కథలు'లో చెప్పబడిన రెండు కథలూ పచ్చిరియాక్షనరీ కథలు. మొదటి కథకు నీతి చెప్పలేదుకాని చెప్పాలంటే యిది నీతి— రిక్షావాళ్ళకు మంచి వుల్లెన్ చొక్కాలు, ఎర్రిమఫ్లర్‌లు (బహుశా మంచి ఉలన్‌వి) పెట్టెలోవుంటాయి. గిరాకీ కొరకు వాళ్లు చింకిచొక్కాలు వేసుకొని వానలోతడుస్తూ పేదవాళ్లవలె నటిస్తారు. దానివల్ల వాళ్ళకు రూపాయిపావలా న్యాయంగా రావలసినచోట రూపాయిన్నరవస్తుంది. అంటే రూపాయిపావలామీద పావలా, ఇరవైశాతం లాభార్జనవుండేవ్యాపారం. రెండవకథలో నీతి కథకుడే చెప్పాడు చదివి చూడండి.

కవితల్లో 'తొలిపొద్దు' మంచి కవితా వేశమూ, సిద్ధాంతావగాహనా, స్పష్టతా వున్న కవిత.

ఈ సంచికలో 'కాంట్రవర్షియల్'అనదగింది గ్రంథసమీక్ష. అయితే సమీక్షకుని తెలియనితనమే యీ కాంట్రవర్సీకి కొంతకారణం. సుబ్బారావు పాణిగ్రాహి కవి అని తనకు తెలియనంతమాత్రాన లోకానికే తెలియదనుకునే మధ్యతరగతి మేధావిత్వగర్వం యీ సమీక్షలో యితరత్రాకూడా కనిపిస్తుంది. 'విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించడంలోని సైద్ధాంతిక ప్రాముఖ్యాన్ని కొడవటిగంటి కుటుంబరావుగారు బాగావిపులీకరించారు వేరేసందర్భంలో' అనిరాసి కె. వి. రమణారెడ్డిగారు ఆపని అత్యవసర సందర్భంలో కూడ చేయలేకపోయారని చాలా విసుర్లు విసిరారు వీరిని సృజన-16 ఆగస్ట్-అక్టోబర్ సంచికలో రమణారెడ్డిగారి వ్యాసాన్ని చూడమని కోరుతున్నాను. 'ఈ సంకలనంలో వున్న శ్రీశ్రీ రెండుగేయాలు సామాన్యంగా వున్నయి'అన్నదికూడ చాలా పాక్షికమైన విమర్శ. 'నిన్నటి జట్కావాలా' నిర్ద్వంద్వంగా గొప్పకవిత. చక్కని గేయాలకోసం గొప్ప కవిత్వంకోసం వెతికిన సమీక్షకునికి 'శివుడు'రాసిన గేయాలు కనిపించకపోవడం దృష్టిలోపమే.

పత్రికసైజు చాల విశిష్టంగా, వినూత్నంగావున్నది. గెటప్, కూర్పుకూడ బాగున్నయి. కాని 'బాపు'బొమ్మలువేయడంలో శ్రద్ధచూపడం మానినపుడు ఆయనచేత బొమ్మలువేయించుకోవాలనే కోరిక మంచిదికాదు. ముఖచిత్రంలో చంద్రుడులేకుండా అంత కాంతి, ప్రసన్నత ఎట్లావచ్చాయి. వాతావరణం సరిపోయిందా? 'భాగ్యనగరం' లోని ఘట్టానికి రూపకల్పన సరిపోయిందా? 'వసుధ' ప్రోగ్రెసివ్ ప్రెస్‌వాళ్ళదిమాత్రమే కాదు, రచయితలు, పాఠకులు తమ బాధ్యతగుర్తించి సహకరించివాడుకుంటే ప్రోగ్రెసివ్ భావాలు కలవాళ్ళదికూడ అవుతుంది-. అనుకోవడానికి తగినంత ప్రామిస్ యీ తొలిసంచికలో వున్నది.

[వసుధ— సచిత్ర మాసపత్రిక— ప్రారంభ సంచిక, సంక్రాంతి 1971. వెల: ఒకరూపాయి. సంవత్సరచందా 12 రూ. మాత్రమే. 5—4—776, అబిడ్స్, హైదరాబాదు-1. గౌరవసంపాదకురాలు: ముప్పాళ రంగనాయకమ్మ]

ఎవరికోసం వేకువ

బ్లాక్ మార్కెటీర్లు, రాత్రి వ్యాపారాలు చేసేవాళ్ళు, గుడ్లగూబలు తప్ప ప్రపంచంలో అందరూ వేకువను కోరుకుంటారు. కాని చాలా మంది వేకువ దానంతటదే అవుతుందనుకుంటారు. కొద్ది మంది మాత్రమే వేకువ కావడంలో ప్రకృతి సిద్ధమైన సంఘర్షణ, ప్రయత్నం వున్నాయని గుర్తిస్తారు. అలా గుర్తించిన గెలీలియో లాంటి మహామహులు ఆ సత్యం చాటడానికి ప్రాణ త్యాగాలు చెయాల్సి రావచ్చు. కాని నూతలపాటి గంగాధరం వంటి చారిత్రిక జ్ఞానంలేని విమర్శకులు మాత్రం ఆ సత్యాల్ని, ఆ త్యాగాల్ని గుర్తించలేరు. (చూ॥ ఏది ప్రజాకవిత? పేజి 17) ఈ వ్యాసం లోని లోపాలను చర్చించడానికి అసలు ఇది వ్యాసంకాదు, అక్కసుతప్ప. హేతు బుద్ధిలేదు, అజ్ఞానం తప్ప. ఉపపత్తిలేదు— అమాయకత్వం తప్ప ఒకచోట వీరు 'మార్క్సిజాన్ని మనదేశ నైసర్గిక స్వరూప స్వభావాల కనుకూలంగా స్వీకరించి హేతుబద్ధమైన ప్రగతి' సాధించాలంటారు. మరోచోట 'మార్క్సు సిద్ధాంతాలు సమాజ ప్రగతికి ఉత్తమమయిన మార్గాలు' అని ఒప్పుకుంటారు. వాటిని తమకు అక్కర అయిన విధంగా మార్చుకొని ప్రవేశపెట్టినవే లెనినిజం, చౌనిజం?(అచ్చుతప్పా?)మావోయిజం

మొదలైనవి. వీటికన్నిటికీ పునాది మార్క్సిజమే' అనికూడ ఒప్పుకుంటూ 'ప్రగతి కోసం హింసాప్రవృత్తి నవలంభించే'ధోరణిని బలపరచే సాహిత్యమార్గాన్ని నిరసిస్తూ 'దీనికి మావోప్రవచనాలు ప్రమాణాలు. వారిమార్గం హింస, వారి ఆలోచనలు పైశాచికమైనవి.'అంటాడు. అంతేగాక 'సాయుధపోరాటం నినాదాల నాధారంచేసికొని లేచిన ఉద్యమం ఏదైనాకాని అది మనదేశంలో నేలవిడిచిన సామేఅవుతుంది'అని మార్క్సిజం నుంచి పుట్టిందే మావో ఆలోచనాధోరణి (తెలియక దీన్ని మావోయిజంఅని అన్నాడనుకోండి!) అని ఒకచెంప ఒప్పుకుంటూనే యీదేశానికి మార్క్సిజం పనికివస్తుందికాని సాయుధపోరాటోద్యమం పనికిరాదని చెప్పడం స్వవచనవ్యాఘాతం కాదా— లోపల అసలు మార్క్సిజంపట్లనే విశ్వాసంలేదు, భయంకూడ. ఆ మాట ధైర్యంగా అంటే 'రియాక్షనరీ' అనరూ! 'ప్రజాకవిత'పై రాసే అర్హతవుంటుందా!

ఇలాంటి పక్షపాతమే మరొకటి 'వర్తమాన సాహిత్యంలో పక్షరేఖలు' సృజనలో ఉన్న ఒక్కవ్యాసాన్ని పట్టుకొని సోమసుందర్ గోదావరిని ఈదేప్రయత్నం చేసారు. సోమసుందర్ రాతల్లో హేతుబద్ధతను వెతకడమే వెర్రిపని.

ఈ సంచికలో మంచి చారిత్రిక, సామాజిక అవగాహనతో తాను నిర్వచించుకున్న పరిధులు దాటకుండా చక్కగా రాయబడ్డవ్యాసం 'ఏది అభ్యుదయకవిత?' రామమోహనరావు పరిభాషమాత్రం అభ్యుదయంగా కాకున్నా ఆధునికంగా లేదు కొన్ని చోట్ల. ఇంతమంచి వ్యాసాన్ని ఇటీవల ఒక వారపత్రికలో సమీక్షకుడు పనికిరానిదాని కింద తోసేసాడు, బహుశా చదువకుండానే. విరసం ఏర్పడినతర్వాత ఏర్పడినకొన్ని ప్రిజుడిసిస్‌తో యిలాంటి అహంకారపు రాతలు రావడం చాల శోచనీయం. కుందుర్తి 'నేనూ, నారచనా'లో చెప్పుకోవలసింది స్వంతగొడవే కనుక కొంత సోది, కొంత సోత్కర్ష కనిపించక తప్పదేమో, అయితే 'సాహిత్యంలో నేను నూటికి నూరుపాళ్ళు ప్రయోజనవాదిని'అన్నమాటను కుందుర్తి నిరూపించుకోవాలి. 'రచన ఎవరికోసం'అని ప్రశ్న వేసుకొని 'ఈ వర్గసమాజంలో రచయితకూడ ఏదో విధంగా ఒక వర్గం'కొరకే రాస్తాడని సరిగ్గా జవాబుచెప్పిన నిఖిలేశ్వర్ ఆ జవాబును శాస్త్రీయంగా విశ్లేషించి చూపలేకపోయాడు. పత్రికల్లో 'కాలమ్'కోసంరాసిన వ్యాసంలాగుంది.

'రా'సమీక్ష ఎంతబలంగా నీళ్ల నములుడులేకుండా నిర్మొహమాటంగావుందో 'త్రివేణి' సమీక్ష అంత బలహీనంగా, మొహమాటంగా, తెలివితక్కువగా వున్నది.

ఇంక కవిత్వంగురించే ఏంచెప్పాలి. ఒక్క 'వేకువ'లోనేకాదు ఈనాడు అన్ని పత్రికల్లోనూ కవిత్వం చాల బోర్‌గా, మొనాటనస్‌గా వుంటున్నది. ఇదివరకు ఎంతో బాగా రాసిన కవులుకూడ తమను తామే కాపీచేసుకుంటూ, రిపీట్ చేసుకుంటూ, ఉపన్యాసాలు, ఉపదేశాలు రాస్తున్నారు. గెటప్ బాగులేదు. లోపల మేటర్ అరేంజ్ మెంట్ మొదలయినవిగూడ భావుకతా రాహిత్యాన్ని సూచిస్తున్నాయి. చివరన ఎం.ఏ. (లిట్) పెట్టుకుంటే పాఠకులు దిగ్భ్రాంతులవుతారనే మీడియాకర్ మనస్తత్వం'సంపాదకీయం'లోకూడ కనిపిస్తున్నది– 'ఇది మేం చేపట్టిన వేకువ బాకు. ఇది చీకటి గర్భాన్ని చీలుస్తుంది'. చీల్చి వచ్చాకనే కదా ఆ బాకు వేకువ అయింది. సరే బాగానే వుంది. వెంటనే ఆబాకు కాస్త కోడెఅయింది. అయి 'వెలుగురంకె(?)వేసింది'. అలంకార ప్రియత్వంకూడా వ్యాఖ్యాన నిరపేక్షంగా వుండొద్దా. చివరన ఒక మాట. 'వేకువ' సంపాదకీయంలో చెప్పినట్లు 'ఒకవేదికగానే మామధ్యకొచ్చింది' కాని ఈవేదికమీద ఎవరైనా సరే యిష్టమొచ్చినట్లు సిగపట్లుపట్టుకోకుండా సంపాదకవర్గంకూడ తన వేకువ కర్తవ్యాన్ని నిర్వహించాలి. లేకపోతే ఎవరికోసం యీ వేకువ అనే అనుమానాలు రాకమానవు.

— కె. వెంకటనారాయణ.

[వేకువ– సాహిత్య త్రైమాస పత్రిక, తొలిసంచిక జనవరి-మార్చి 1971, సంపాదకుడు : కె. శివారెడ్డి, ఎం.ఏ.(లిట్). విడిప్రతి : ఒక రూపాయి. సంవత్సర చందా: నాలుగు రూపాయలు. వివరాలకు: గౌరవనిర్వాహకుడు. 'వేకువ' సాహిత్య త్రైమాస పత్రిక, 1–8–17/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20.]

వచ్చే సంచికలో :

సృష్టి — తాడిగిరి పోతరాజుగారి కథ.

మరబ్రతుకులు — బి. టి. రామానుజంగారి కథ.

'భయం' కథ

ఆ ఊళ్లో పాములు తిరుగుతూ ఉంటాయి– మన దేశంలో ధనికుల్లాగ, వాళ్ల ధనానికి అమ్ముడుపోయే అధికారం లాంటి విషం నిండిన పాములు. పాములు కాటేసి చంపుతాయని అందరికీ తెలుసు, అందుకే అందరికీ విపరీతమైన భయం. చావుమీదిభయం చావుతో సమానం. భయపడే వాడికెప్పుడూ చావుతెలివే. ఎదిరించే ధైర్యంలేనప్పుడు మెట్టవేదాంతాలు పుట్టుకొస్తాయి. మంత్రాలు, తంత్రాలు, పూజలు, నమస్కారాలు– ఈ వికారాలన్నీ భయాన్ని ఎక్కువచేస్తాయే కాని, తగ్గించవు. జనం వినతి పత్రాలు పంపి, అభ్యర్థనలుచేసి, ఏడ్చి, మొత్తుకుని– ఎన్ని చేసినా, జనానికి అధికారపు విషం నిండిన ధనిక పాములవల్ల భయంతీరనట్టు.

"అయ్యో! పాపం ఎరమింగిన పాఁవర్రా? అలాంటిపాఁవుని చంపకూడదు" అనే భూతదయాపరులుకూడా ఉన్నారు ఆ ఊళ్ళో. గాంధీ పుట్టిన దౌర్భాగ్యంలో 'భూతదయ'కి, 'శాంతి'కి, 'అహింస'కి అర్థాలే మారిపోయేయి ఈదేశంలో. కాటేసే పాము మీదా, చంపి తినే పులులయెడలా భూతదయ చూపమనేవాడు మారువేషం వేసుకున్న పామో, పులో అయితీరతాడు. జనంలోని భయాన్ని ఆధారంచేసుకుని మంత్రాలూ, మాయ కబుర్లూచెప్పి మోసంచేసి, పబ్బం గడుపుకునే 'పాఁవుల రావులయ్య'ఉన్నాడు ఆ ఊళ్లో– దేశంలో చిన్మయానందులు, శంకరాచార్యులుఉన్నట్టు. ఇలాగ భయం మర్రిచెట్టులాగ భీతావహంగా పెరిగి పాములకి, 'రాబందుల'కి స్థావరమై ఆఊళ్ళో జనాన్ని చంపుకు తింటూ ఉండగా,

అనుభవంనేర్పిన గుణపాఠాలు నేర్చుకుంటూ, పాములకి సంబంధించిన విజ్ఞానాన్ని సంపాయించుకుని, చావుకీ, పాఁవులకీ కూడా భయపడకుండా పెరిగిన 'సత్యం' ఊరంతా తన కుటుంబఁవే ననుకొని, చిన్నా, పెద్దా అనకుండా, అర్థరాత్రి, అపరాత్రి లెఖ్ఖచెయ్యక, ఎక్కడ పాఁవుంటే అక్కడికెళ్ళి చంపి వచ్చేవాడు. మంత్ర తంత్రాలు మోసాలని, పది మందికే హానిచేసే పాఁవుపట్ల జీవకారుణ్యం చూపడం మూర్ఖత్వమని జనానికి నచ్చచెప్ప, భయంవల్ల మూసుకుపోయిన జనం దృష్టిని కర్తవ్యంవైపుకి మళ్ళించేడు ఇది పాఁవులకి కిట్టదని వేరేచెప్పఖ్ఖర్లేదు, పాఁవుల మంత్రి

గాడికూడా కిట్టదు. ఎవర్ని లెఖ్ఖచెయ్యని వీరుడై, సత్యం ఆ ఊళ్ళోని భయం అనే చీకటిని పోగొట్టగలుగుతున్నాడు.

ఆ ఊళ్ళోనే.

తనూ, పిల్లలూ సుఖంగా ఉంటేచాలు, ఊరంతా యేమైపోయినా పట్టించుకోని సుబ్బాయమ్మగారుంది ఊరివాళ్ళ బాధలు తనకఖ్ఖర్లేక పోయినా, తన అవసరానికి మాత్రం ఊరివాళ్ళంతా ప్రాణాలుకూడా యిచ్చేయాలనే స్వార్థం ఆమెగారి నైజగుణం. ఆవిడ స్వార్థానికి సత్యం బలికాక తప్పలేదు. సుబ్బాయమ్మగారింట్లోదూరిన పాంవుని,— చంపడానికి ప్రయత్నించడం ప్రమాదకరమని తెలిసికూడా, తెగించి, కాటుతిన్నా చంపి వచ్చినవాడు సత్యం అయితే; పాముకాటుతిని చావు బతుకులమధ్య ఊగిసలాడుతున్న సత్యం స్థితిని పట్టించుకోకుండా, "అయ్యో! కొస ప్రేణం యింకా ఉండిపోయిందర్రా!"అని గోలపెట్టే కరడుగట్టిన అమానుషం సుబ్బాయమ్మగారొఖ్ఖరేనా దేశం నిండా అటువంటి మధ్యతరగతి మనుషులెందరులేరు! వాళ్ళవల్ల, జనాన్నంతా తన కుటుంబంగానే భావించి, వాళ్ళకోసం జీవితాన్నే త్యాగం చెయ్యడానికి సిద్ధపడే వీరులకి ఎప్పుడూ ప్రమాదమే.

కథలకేం, రోజుకో పత్రిక, పత్రిక్కి నాలుగు కథలు. అరటిపండు మింగడంకన్నా, కథలు కక్కడమే సులువైపోయిందీ రోజుల్లో. ఇన్ని కథల్లో యే కథని గుర్తుపెట్టుకుంటాడు పాఠకుడు? అయితే, అందరూ నటులేఅయినా, ఎక్‌స్ట్రా వేషం వేసేవాడికి, హీరోవేషం వేసేవాడికి, తేడా ఉన్నట్టే, పేరుపెట్టుకున్నందుకు, పత్రికలో పడ్డందుకు కథలైపోయిన వాటికి, నిజంవైన కథలకి తేడా ఉంది. 'వేషం' అంటే రంగులేసుకోడంవే కానట్టే, కథంటే కల్పన మాత్రమేకాదు. పుస్తకాలు పలవరించేవాడు కాకుండా జీవితాన్ని అనుభవించినవాడు రచయిత కాగలుగుతాడు. అనుభవానికి తోడు సరైన అవగాహన కావాలి. అనుభూతికి రంగులద్దకుండా సూటిగాచెప్పే నిజాయితీకావాలి. నిజంచెప్పదల్చుకున్నవాడు కొన్ని మమకారాలువదులుకోవాలి. అప్పుడుగాని 'యజ్ఞం'లాంటి కథ రాదు; అప్పుడుగాని 'భయం'లాంటి కథ రాదు ఈ గుణాలన్నీ ఉన్నాయని తెలుసుకోవడానికి, ఆ వ్యక్తి జీవితాన్ని analyse చెయ్యఖ్ఖర్లేదు. ఆ కథలు చదివితేనే తెలుస్తుంది.

పాఠకుడి దృష్టిలోకూడా చదువుతూ ఉండగానే మర్చిపోయే కథకి, చదివిం తరవాత మరచిపోదాంవనుకున్నా మరిచేపోలేని కథకి చాలా తేడా ఉంది. రెండో కథకి

అతని భావాలమీద, అతని దృక్పథంమీద, అతని జీవిత విధానంమీద ఏదోఒక ప్రభావం ఉండక తప్పదు. 'భయం' అటువంటి కథ.

గ్రామీణ జీవితాన్ని వాళ్ళ భాషలోనే, వాళ్ళ నుడికారంలోనే, వాళ్ళ అలవాట్లతోసహా మన కళ్ళముందుంచే ఈకథ చదువుతున్నంతసేపూ, పాఠకుడెక్కడున్నా, ఆ గ్రామంలోనే ఉంటాడు. కథ చదివినంతసేపూ ఆ జీవితాన్ని అనుభవిస్తాడు. కళాకారుడి ప్రతిభ పరాకాష్ఠనందుకున్నదని చెప్పడానికిదే దృష్టాంతం.

కొన్ని కథలు చదివేక రచయితని అభినందించాలనిపిస్తుంది. కొన్ని కథలు చదివేక రచయితకి కృతజ్ఞత చెప్పుకోవాలనిపిస్తుంది. 'భయం'కథ రాసిన రచయితకి, నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు.

— మరువాడ రాజేశ్వరరావు.

[భయం. కథ- శ్రీ కాళీపట్నం రామారావు- యువ 1970 దీపావళి సంచిక]

SRJANA T Monthly March 1971 Regd. No. 10953/67

ప్రతులకు, వివరాలకు :
సృజన
పోస్టుబాక్సు నెం. 67
వరంగల్–2 (ఆం. ప్ర.)

సంవత్సర చందా : పది రూపాయలు
అర్థ సంవత్సర చందా : ఆరు రూపాయలు
విడిప్రతి : ఒకరూపాయి

ముద్రణ :
వేంకటరమణ ముద్రణాలయము,
జె. పి. యన్. రోడ్,
వరంగల్-2

Edited Printed and Published by Varavara Rao for Sahithee Mithrulu.
84 Pages 100 Paise